గురువారం
18-9-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 358
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కెనడాలో భారత దౌత్య కార్యాలయం ముట్టడిస్తాం

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన ఖలిస్తానీ ఉగ్రవాద సంస్థ అయిన సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) వాంకోవర్‌లోని భారత దౌత్యకార్యాలయాన్ని 12 గంటల పాటు ముట్టడించేందుకు పిలుపునిచ్చింది. ఇది కెనడాలోని భారత దౌత్యవేత్తలు, మిషన్ల భద్రత గురించి ఆందోళనలను రేకెత్తించింది. 2019 నుంచి భారతదేశంలో నిషేధించబడిన వేర్పాటువాద సంస్థ అయిన ఎస్ఎఫ్‌జే... జూన్ 2023లో కెనడాలో హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు వ్యతిరేకంగా సెప్టెంబరు 18 గురువారం నిరసన చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఎస్ఎఫ్‌జే రెచ్చగొట్టే పోస్టర్ కెనడాలోని భారత హైకమిషనర్ దినేష్ పట్నాయక్‌ను ఉద్దేశించి చిత్రీకరించింది. తన ప్రకటనలో ఎస్ఎఫ్‌జే... కెనడాలోని భారత మిషన్లు ఖలిస్థాన్ మద్దతుదారులపై నిఘా నెట్‌వర్క్‌ను నడుపుతున్నాయని ఆరోపించింది.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతోనే
నిరంకుశ పాలనకు అంతం

- ఎర్రజెండా అంటే ప్రజలకు ప్రేమాభిమానాలు
- ఉద్యమ చరిత్ర లేనిది బీజేపీ: కూనంనేని

విశాలాంధ్ర– హైదరాబాద్: నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య వ్యవస్థను కూకటివేళ్లతో పెకలించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ప్రేరణే దేశంలో అనేక ఉద్యమాలకు ఊపిరి పోసిందని వక్తలు పేర్కొన్నారు. ఆ పోరాట ఫలితంగానే ఈ ప్రాంత ప్రజల్లో చైతన్యం రగిలి మెరుగైన తెలంగాణ పౌర సమాజం ఏర్పడిందని అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 77వ వారోత్సవాల ముగింపు సభ బుధవారం రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభకు జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.డి.యూసుఫ్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహ, కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, కళవేణ శంకర్, అరుణోదయ సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు విమలక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని అధ్యక్షోపన్యాసం చేస్తూ దొరల పెత్తనం, భూస్వాముల అరాచకాలను వ్యతిరేకిస్తూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నాడు అన్ని ప్రవంతులు ఏకమై సాగించిన సమరమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమన్నారు. ఈ పోరాట ద్వారానే నిరకుంశ నిజాం పాలన పతనమై హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైందని స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోని గాని, దేశ స్వాతంత్రోద్యమంలో గాని ఎటువంటి పాత్రలేని బీజేపీ... ఇటు కమ్యూనిస్టులను అటు మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూను తప్ప ... గాంధీ మొదలు గాడ్సేవరకు, వివేకానంద నుంచి విప్లవ కెరటం భగత్‌సింగ్ వరకు అంతా తమ వారే అంటూ సొంతం చేసుకునే కుట్రకు తెరలేపిందని విమర్శించారు. కమ్యూనిస్టులు అన్నా... ఎర్రజెండా అన్నా ఇప్పటికీప్రజల గుండెల్లో నిండుగా ప్రేమాభిమానాలు

- మిగతా 2 లో

స్వేచ్ఛ మన జీవన విధానం

- దేశానికే తెలంగాణ రోల్ మోడల్
- ప్రజలే రాసుకున్న పోరాట చరిత్ర మనది
- ప్రజాపాలన దినోత్సవంలో సీఎం రేవంత్

విశాలాంధ్ర – హైదరాబాద్: స్వేచ్ఛ మన జీవన విధానమని, ఆ స్వేచ్ఛా సాధనకు ప్రాణ త్యాగాలకు సైతం వెనుకాడని జాతి మనదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పబ్లిక్ గార్డెన్ వద్ద బుధవారం ప్రజాపాలన దినోత్సవం నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం సీఎం మాట్లాడుతూ తెలంగాణ ప్రజాస్వామ్య చరిత్రకు శ్రీకారంచుట్టిన శుభదినం అని వ్యాఖ్యానించారు. నిజాం నియంతృత్వంపై సామాన్యుడు సాయుధ పోరాటంతో సాధించుకున్న రోజన్నారు. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే రాసుకున్న పోరాట చరిత్ర మనదన్నారు. ప్రపంచ ఉద్యమాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘనత తెలంగాణ సాయుధ పోరాటానిదని పేర్కొన్నారు. 1948, సెప్టెంబరు 17 ఈ పోరాటంలో ప్రజలు విజయం సాధించి, స్వేచ్ఛాపతాకాన్ని ఎగురవేశారన్నారు. అణచివేత, పెత్తందారీతనం, నియంతృత్వం, బానిసత్వం సంకెళ్లను బద్ధలు కొట్టి స్వేచ్ఛకు ఊపిరి పోయడానికి ఊపిరి వదిలిన వందలాది మంది అమరులకు ఘన నివాళి అర్పిస్తున్నానని చెప్పారు. డిసెంబరు 7, 2023 స్వరాష్ట్ర ప్రజాస్వామ్య ప్రస్థానంలో మరోమైలు రాయి అని తెలిపారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో మొదలైన స్వరాష్ట్ర ప్రస్థానం... నాటి సాయుధ పోరాట

- మిగతా 2 లో

నిరుపేదలకు లబ్ధి చేకూరేలా
విద్యా వ్యవస్థ

- దేశానికి దిక్సూచిలా తెలంగాణ విద్యా విధానం
- భాష, జ్ఞానం, నైపుణ్యాలు, క్రీడల మేళవింపు
- విద్యాలయాల్లో అందరికీ సమాన అవకాశాలు
- సమూల ప్రక్షాళనే ధ్యేయం: సీఎం రేవంత్

2 లో

‘ఉస్మానియా’ సేవల విస్తరణ

- కాలానుగుణంగా ఆస్పత్రుల్లో మౌలిక వసతులు
- పాత భవనాలపై రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలి
- ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి రాజనర్సింహా

విశాలాంధ్ర–హైదరాబాద్: ఉస్మానియా మెడికల్ కాలేజీ అనుబంధ ఆస్పత్రుల సేవలను మరింత విస్తరించాలని, మెరుగుపర్చాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. ఉస్మానియా అనుబంధ ఆస్పత్రులలో వైద్య సేవల బలోపేతానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాజనర్సింహ బుధవారం ఉన్నత స్థాయి సమీక్షలో ఉస్మానియా హెల్త్ హబ్‌గా, బ్రాండ్‌గా ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చారన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ ఆస్పత్రిలో సేవలు పెంచడంపై, ఆస్పత్రి పాత భవనాల పరిస్థితిపై సమీక్షించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి రెండు, మూడు రోజుల్లోగా పాత భవనాలపై నివేదిక సమర్పించాలని టీజీఎంఎస్ ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులను మంత్రి రాజనర్సింహ ఆదేశించారు. ఉస్మానియా మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉస్మానియా హాస్పిటల్‌తో పాటు, నీలోఫర్ హాస్పిటల్, సరోజిని దేవి కంటి ఆస్పత్రి, ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్, టీబీ అండ్ చెస్ట్ హాస్పిటల్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, సుల్తాన్ బజార్ మెటర్నిటీ హాస్పిటల్, పెట్లబుర్జు మెటర్నిటీ హాస్పిటల్, ఈఎన్‌టీ హాస్పిటల్, ఫీవర్ హాస్పిటల్ విశేష సేవలు అందిస్తున్నాయని అన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌కు పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పన, హెచ్ ఆర్, పరికరాలకు మరమ్మతులు, ఆర్వో వాటర్ ప్లాంట్, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, మౌలిక వసతులు, అంతర్గత రోడ్లు, రోగులకు సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఓపీ, ఐపీ, సేవల వివరాలు తెలుసుకున్నారు. సరోజినీ దేవి కంటి ఆస్పత్రిపై మంత్రి చర్చించారు. కాలానుగుణంగా ఆస్పత్రుల్లో సదుపాయాలు ఉండాలన్నారు. సమావేశంలో ఆరోగ్య శాఖ కార్యదర్శి డా క్రిస్టినా, డీఎంఈ డా.నరేంద్ర కుమార్, ఉస్మానియా అనుబంధ మెడికల్ కాలేజీల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

అదానీపై వీడియోలు, పోస్టులు తొలగించాలి

న్యూఢిల్లీ: అదానీ గ్రూపుపై 138 వీడియోలు, 83 ఇన్‌స్టాగ్రామ్ పోస్టులను వెంటనే తొలగించాలంటూ రెండు మీడియా సంస్థలతో పాటు యూట్యూబ్ ఛానళ్లకు కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ ఆదేశాలిచ్చింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ దాఖలు చేసిన పరువు నష్టం దావాపై ఈనెల 6న ఆగ్నేయ దిల్లీ జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ఆధారంగా తాజా ఆదేశాలు జారీ అయ్యాయి. అదానీ గ్రూపు పరువు తీసేవిగా ఉన్నట్లు ఆరోపించే సోషల్ మీడియా పోస్టులన్నీ తొలగించాలని జర్నలిస్టులు,

- మిగతా 2 లో

ఈవీఎంలలో అభ్యర్థుల కలర్ ఫొటోలు

న్యూఢిల్లీ: ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రానిక్ ఓటరు యంత్రాల (ఈవీఎం) బ్యాలెట్‌కు కొత్త హంగులు దిద్దబోతోంది. తెలుపు–నలుపు కాకుండా కలర్ ఫొటోలు, వరుస సంఖ్యలతో బ్యాలెట్లను అందుబాటు లోకి తీసుకొస్తున్నది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో కొత్త బ్యాలెట్లను పరిచయం చేయనుంది. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థులను సులువుగా గుర్తించేలా కొత్త బ్యాలెట్లు ఉండనున్నాయి. అభ్యర్థి చిత్రం కోసం కేటాయించిన స్థలంలో కలర్ ఫొటో స్పష్టంగా

- మిగతా 2 లో

మహారాష్ట్రలో ఎన్‌కౌంటర్

ఇద్దరు మహిళా మావోయిస్టుల మృతి

విశాలాంధ్ర– చింతూరు: మహారాష్ట్రలోని గడ్చిరౌలి జిల్లాలో బుధవారం ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసులతో జరిగిన పోరులో ఇద్దరు మహిళా మావోయిస్టులు మరణించారు. గట్టా ఎల్‌ఓఎస్ సభ్యులు కొందరు మొదాస్కే గ్రామం సమీప అడవుల్లో సంచరిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అదనపు ఎస్పీ అధేరి సత్య సాయి కార్తిక్ నాయకత్వంలో ఐదు సీ60 యూనిట్లు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయని గడ్చిరోలి ఎస్పీ నీలాట్పాల్ వెల్లడించారు. గట్టా జంభియా పోస్టు పార్టీ, సీఆర్‌పీఎఫ్

- మిగతా 2 లో

త్యాగాల గడ్డ తెలంగాణ: కేటీఆర్

విశాలాంధ్ర–హైదరాబాద్: తెలంగాణ అంటేనే త్యాగాల గడ్డ, పోరాటాల అడ్డా అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు (కేటీఆర్) అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో వేడుకలు నిర్వహించారు. జాతీయ జెండాను ఎగరవేసి, జాతీయ గీతాన్ని పార్టీ నేతలు ఆలపించారు. ఈ రోజును సమైక్య దినోత్సవంగా జరుపుకుందామని, పోరాట యోధుల త్యాగాల సాక్షిగా తెలంగాణ బిడ్డలు మరో పోరాటానికి సిద్ధం కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి తెలంగాణ బిడ్డలు

- మిగతా 2 లో

మోదీ... టెర్రరిస్టులు, నక్సలైట్లకు తేడా తెలుసుకో

- నేరచరిత్ర గల అమిత్‌షా రాజకీయ నాయకుడే కాదు
- నక్సలైట్ల సిద్ధాంతాన్ని అంతం చేయలేరు
- కమ్యూనిస్టుల బలం పెరగడంతో భయపడుతున్న ట్రంప్
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర–గుంటూరు వైద్యం: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ టెర్రరిస్టులకు, నక్సలైట్లకు మధ్య తేడా గమనించలేకపోతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ధ్వజమెత్తారు. చైనా, రష్యా, కొరియాలు ఒకటైన తర్వాత దేశంలో కమ్యూనిస్టుల బలం మరింత పెరుగుతూ ఉందని, దీంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భయపడి వణికిపోతున్నాడని అన్నారు. బుధవారం కొత్తపేట మల్లయ్యలింగం భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నక్సలైట్ల కంటే టెర్రరిస్టులే మేలని మోదీ అనటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టెర్రరిస్టులు వేరు, నక్సలైట్లు వేరని, టెర్రరిస్టులకు సిద్ధాంతం అంటూ ఉండదని... కేవలం చంపడం తప్ప ఈ సమాజం పట్ల వారికి ఎలాంటి అవగాహన ఉండదని తెలిపారు. కానీ నక్సలైట్లు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో స్పష్టమైన వైఖరి కలిగి ఉండి అంతర్జాతీయ

- మిగతా 2 లో

దక్షిణాది విలవిల

అమెరికా సుంకాల భారంతో రూ.వేల కోట్ల ఎగుమతులపై ప్రభావం
కేంద్ర సాయం కోరుతున్న కేరళ, ఏపీ, తమిళనాడు

న్యూఢిల్లీ: అమెరికా సుంకాల భారంతో దక్షిణాది రాష్ట్రాలు కుంగిపోతున్నాయి. వేల కోట్ల రూపాయల ఎగుమతులను నష్టపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ సాయాన్ని అర్థిస్తున్నాయి. అమెరికా సుంకాల దెబ్బతో కేరళ సాంప్రదాయ ఎగుమతులు సంక్షోభంలో చిక్కుకుంది. ఆంధ్ర ప్రదేశ్ తన ఆక్వా రంగానికి తక్షణ ఉపశమనం కోరుతోంది. వస్త్ర, తోలు, ఆటో, యంత్ర పరిశ్రమల్లో లక్షలాది ఉద్యోగాలు ప్రమాదంలో ఉన్నాయని తమిళనాడు హెచ్చరించింది. కొత్త సుంకాలు ఆదాయాలను తగ్గించవచ్చని, సరఫరా గొలుసులను దెబ్బతీస్తాయని, వేలాది మంది కార్మికులను... వారిలో చాలామంది మహిళలను ఉద్యోగాల నుంచి తొలగించవచ్చని కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్.బాలగోపాల్ హెచ్చరించారు. మంగళవారం అసెంబ్లీలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, కేరళ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న సముద్ర ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, జీడిపప్పు, కొబ్బరి, టీ, రబ్బరు రంగాలపై ఈ ప్రభావం ఇప్పటికే ఉందని బాలగోపాల్ అన్నారు. ‘ఈ సుంకాలు కేవలం వాణిజ్య అవరోధాలు కాదు. అవి కేరళలో పెద్ద ఆర్థిక సంక్షోభాలను సృష్టిస్తున్నాయి’ అని బాలగోపాల్ శాసన సభ్యులకు చెప్పారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఏటా రూ.2,500 కోట్ల నుంచి రూ.4,500 కోట్ల మధ్య నష్టాలు సంభవిస్తాయని ఆయన అన్నారు. సముద్ర ఎగుమతులు మొదటి నష్టాలలో ఉన్నాయి. భారతదేశ సముద్ర ఆహార ఎగుమతుల్లో కేరళ వాటా 12 నుంచి 13 శాతం. రొయ్యలు దాని అతిపెద్ద ఆదాయ వనరు. వాషింగ్టన్ భారతీయ రొయ్యలపై దిగుమతిపై వ్యతిరేక సుంకాలను 1.4 శాతం నుంచి 4.5 శాతానికి పెంచింది. కౌంటర్‌వైలింగ్ (ఆ దేశం ఎగుమతి చేసే వస్తువులపై సబ్సిడీలను ఎదుర్కొవ దానికి విధించే) సుంకాలను జోడించి... 25 శాతం వరకు అదనపు జరిమానా సుంకాన్ని విధించింది. ‘ప్రభావవంతమైన సుంకాల భారం ఇప్పుడు 33 శాతానికి మించిపోయింది. ఇది అమెరికా మార్కెట్‌లో భారతీయ రొయ్యలను గణనీయంగా ఖరీదైనదిగా చేసింది’ అని బాలగోపాల్ అన్నారు. ‘ఆర్డర్లు రద్దవుతున్నాయి. కోల్డ్ స్టోరేజీలలో నిల్వలు పేరుకుపోతున్నాయి. ప్రాసెసింగ్ ప్లాంట్ల వినియోగం 20 శాతం కంటే తక్కువగా పడిపోయింది’ అని ఆయన హెచ్చరించారు. రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లలో మహిళలు ఎక్కువగా ఉన్నారు. వారి ఉద్యోగాలు ఇప్పుడు ప్రమాదంలో ఉన్నాయి. శతాబ్దాలుగా కేరళకు ప్రసిద్ధి చెందిన సుగంధ ద్రవ్యాల వ్యాపారం కూడా దెబ్బతింటోంది. భారతదేశ మిరియాల ఎగుమతుల్లో 80 శాతానికి పైగా రాష్ట్రం నుంచే ఉన్నాయి. వాటితో పాటు యాలకులు, అల్లం, సుగంధ ద్రవ్యాల నూనెలు, ఒలియోరెసిన్లు కూడా ఉన్నాయి. బాలగోపాల్ మాట్లాడుతూ అమెరికా ఏటా 700 మిలియన్ డాలర్లకు పైగా విలువైన సుగంధ ద్రవ్యాల ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటుందని అన్నారు. ‘కానీ దశలవారీగా 50 శాతానికి పెరిగే సుంకాలు కేరళ పోటీతత్వాన్ని తుడిచిపెట్టే

- మిగతా 2 లో

నేటి నుంచి ఏపీ అసెంబ్లీ

విశాలాంధ్ర–సచివాలయం: నేటి నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 గంటలకు శాసన సభ, 10 గంటలకు మండలి సమావేశాలు ప్రారంభం అవుతాయి. సభ ఎన్ని రోజులు జరగాలనే అంశంపై బీసీఏలో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకోనున్నారు. సుమారు వారం రోజుల పాటు అసెంబ్లీ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఈ సమావేశాల్లో ఆర్డినెన్స్‌లను బిల్లుల రూపంలో ప్రవేశ పెట్టనుంది. ఎప్పటిలాగే ఈ సారి కూడా అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు హాజరుకాకపోవచ్చు. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో స్పీకర్ అయ్యన్న పాత్రుడు సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, వివిధ శాఖలతో కూడా ప్రత్యేకంగా స్పీకర్ సమావేశం అయ్యారు. అసెంబ్లీలో చర్చించే అంశాలపై సభకు త్వరితగతి సమాచారం ఇవ్వడంతో పాటు సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ పరిసరాల్లో కల్పించాల్సిన భద్రత అంశంలో డీజీపీ, హోం శాఖ అధికారులతో పాటు ఇతర పోలీసు

సమావేశాలకు వైసీపీ దూరం?

అధికారులతో స్పీకర్ అయ్యన్న పాత్రుడు సమీక్ష నిర్వహించారు. సభకు వచ్చే శాసన సభ్యులు, మండలి సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు యంత్రాంగం ఎక్కడెక్కడ ఉండాలి... విధుల నిర్వహణపై చర్చించారు. వారం రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉన్నందున భద్రత మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని స్పీకర్ ఈ సందర్భంగా డీజీపీకి సూచించారు. అలాగే ఉదయం 8 గంటలకు సీఎం చంద్రబాబుతో పాటు టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెంకటపాలెంలోని టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళులు అర్పించి, అక్కడ నుంచి అసెంబ్లీకి రానున్నారు. ఇదే సమయంలో టీడీపీ సభ్యులందరూ పసుపు పచ్చ చొక్కాలతో సమావేశాలకు హాజరుకావాలని చీఫ్ విప్ జి.వి.అంజనేయులు సూచించారు. అసెంబ్లీకి వైసీపీ ఎమ్మెల్యేలు హాజరయ్యే పరిస్థితి లేదు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతామని ఆ పార్టీ చెబుతోంది.

ఇదీ లోకం!

నిరంకుశ పాలనకు అంతం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయని, వాటిని ముందుకు తీసుకువెళ్లడమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరులకు మనమిచ్చే నిజమైన నివాళి అవుతుందన్నారు. అజీజ్‌పాషా మాట్లాడుతూ... బాషా పరిరక్షణ ఉద్యమంగా ప్రారంభమై ఆతర్వాత నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమంగా మారిందే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశానికి 1947లో స్వాతంత్ర్యం లభిస్తే, నిజాం మాత్రం స్వాతంత్ర దేశంగా ప్రకటించుకునే ప్రయత్నం చేస్తే కమ్యూనిస్టు సారధ్యంలో ఏడాది పాటు పోరాడి నిజాం పీచం అణిచివేసిందన్నారు. జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగంతో పాటు వ్యవస్థల పరిరక్షణకు నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో కమ్యూనిస్టులు మరో అవిశ్రాంత పోరాటం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ సాయుధ పోరాటం ప్రభావం తెలంగాణ సమాజంపై ఎప్పుడూ ఉంటుందన్నారు. కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో సాధించుకున్న స్వేచ్ఛ మన తెలంగాణ అని అన్నారు. ఇప్పటికైనా కమ్యూనిస్టు పార్టీలు ఏకమై ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా పని చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. మావోయిస్టులు తాత్కాలికంగ సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నట్లు ప్రకటించడం శుభపరిణామమని పేర్కొన్నారు. కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ సెప్టెంబరు 17ను తెలంగాణ విలీన దినోత్సవం పేరుతో అధికారికంగా ఉత్సవాలు నిర్వహించాలని అనేక సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో అటు రాష్ట్ర ప్రభుత్వం ఇటు కేంద్ర ప్రభుత్వం తమతమ రాజకీయాలకు అనుగుణంగా ఏదో ఒక్క పేరుతో వేడుకలు నిర్వహించడం కొంత సంతోషమేనని అన్నారు. విమలక్క మాట్లాడుతూ ఇప్పటికైనా కమ్యూనిస్టు పార్టీలు ఏకతాటిపైకి వచ్చి పోరాటాలు చేయాలని కోరారు.

అమరవీరుల త్యాగాలకు స్థూపాలే నిదర్శనం

భూస్వాములు, వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నాడు కులాలు, మతాలకు అతీతంగా శ్రామికవర్గమంతా ఏకమై సాగించిన సమరమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆ మహోత్తర ఉద్యమాన్ని బీజేపీ... హిందూ, ముస్లింల మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరించే ప్రయత్నం చేయడాన్ని చరిత్ర క్షమించదని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ బుధవారం... జాతీయ పతాకాన్ని సయ్యద్ అజీజ్ పాషా, అరుణ పతాకాన్ని కూనంనేని ఆవిష్కరించారు. తెలంగాణలో నాటి పోరాటంలో అసువులు బాసిన వీరయోధుల, అమరవీరుల త్యాగాలకు గుర్తుగా ఉన్న స్థూపాలే ఇందుకు నిదర్శనమని, ఎవరూ చరిత్ర చెరిపి వేద్దామనుకున్నా చెరిగిపోనిది అని కూనంనేని అన్నారు. ఉజ్జని రత్నాకర్ రావు, కె.ఏసురత్నం, బి.ఆర్.ఎస్ మోహన్, బి.వెంకటేశం, ఎం.అనిల్ కుమార్, కె.శ్రీనివాస్, కె.ధర్మేంద్ర, కసిరెడ్డి మణికంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలలో అభ్యర్థుల కలర్ ఫొటోలు

(మొదటిపేజీ తరువాయి)

ముద్రించడమే కాకుండా వరుస సంఖ్యలు జోడించడంతో ప్రక్రియ మరింత సులభమవుతుందని ఈసీ వర్గాలు పేర్కొన్నాయి. అభ్యర్థుల పేర్లను, నోటాను ఒకే సైజు, ఫాంట్‌తో ఈ బ్యాలెట్లలో ముద్రిస్తారు. ఈవీఎం కొత్త బ్యాలెట్ల కోసం 70 జీఎస్‌ఎం పేపర్‌ను వాడతారు. అసెంబ్లీ ఎన్నికల కోసం పింక్ పేపర్ వినియోగిస్తారు. కొత్త ఈవీఎం బ్యాలెట్లను త్వరలో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో అందుబాటులోకి తేవాలని ఈసీ నిర్ణయించింది.

సగానికిపైగా ఓటర్లు పత్రాలు ఇవ్వనక్కర్లేదు

బీహార్‌లో వివాదాస్పదమైనప్పటికీ అన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. ప్రత్యేకంగా నిర్వహించే ఈ సమీక్ష కోసం ఓటర్లలో దాదాపు సగం మందికిపైగా పత్రాలు సమర్పించాల్సిన అవసరం ఉండదని ఈసీ అధికారులు బుధవారం వెల్లడించారు. '2002-04లో చాలా రాష్ట్రాలు ఎస్ఐఆర్ నిర్వహించాయి. తదుపరి ఎస్ఐఆర్ కటాఫ్ తేదీగా ఆ సంవత్సరాన్ని పరిగణిస్తాం. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించేందుకు తేదీని ఈసీ త్వరలో నిర్ణయించనుంది' అని అధికారులు తెలిపారు. ఈ ఏడాది ముగిసేలోగా రాష్ట్రాల ఓటర్ల జాబితాల ప్రక్షాళన జరుగుతుందన్నారు. చివరి ఎస్ఐఆర్ ఆధారిత ఓటర్ల జాబితాలు సిద్ధంగా ఉంచాలని అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు ఇప్పటికే సూచించినట్లు చెప్పారు. గత ఎస్ఐఆర్ తర్వాత ముద్రించిన జాబితాలను కొన్ని రాష్ట్రాల సీఈఓలు ఇప్పటికే తమ వెబ్‌సైట్లలో పెట్టాయన్నారు. కాగా దిల్లీ సీఈఓ వెబ్‌సైట్‌లో 2008 ఓటర్ల జాబితా పెట్టగా, ఉత్తరాఖండ్ సీఈఓ వెబ్‌సైట్‌లో 2006 నాటి ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచారు.

మహారాష్ట్రలో ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

ఈ కాయ్ 191 ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టినట్లు చెప్పారు. కూంబింగ్ సమయంలో మావోయిస్టులు తారసపడటంతో ఎదురు కాల్పులు జరిగాయని, ఇద్దరు మహిళా మావోయిస్టులు చనిపోయారని తెలిపారు. ఘటనాస్థలం నుంచి ఏకే 47 రైఫిళ్లు, పిస్టల్, తూటాలు, మావోయిస్టు సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

చత్తీస్‌గఢ్‌లో: పోలీసు ఇన్‌ఫార్మర్ అన్న అనుమానంతో చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో 36ఏళ్ల వ్యక్తిని మావోయిస్టులు చంపేశారని అధికారి తెలిపారు. జంగ్లా పోలీసు స్టేషన్ పరిధిలోని బెంచారం గ్రామంలో దర్రు రామ్ ఓయమ్ హత్యకు గురైనట్లు చెప్పారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. నారాయణ్‌పూర్‌లో 12 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరిలో తొమ్మిది మందిపై రూ.18లక్షల నగదు బహుమతి ఉందని అధికారి చెప్పారు.

త్యాగాల గడ్డ తెలంగాణ: కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

అడుగుపెట్టిన రోజు ఇది అని కేటీఆర్ అన్నారు. కొంతమంది దీనిని విమోచనమని, విలీనం అని అన్నా, నాటి పోరాట యోధులకు, అమరవీరులందరికీ శిరస్సు వంచి నివాళులు అర్పిస్తున్నామన్నారు. సాయుధ రైతాంగ పోరాటం మొదలుకొని తెలంగాణ ఉద్యమం... ఆపై కేసీఆర్ అధ్వర్యంలోని ప్రజాస్వామిక తెలంగాణ ఉద్యమం వరకు తెలంగాణ చూసిందన్నారు. చాకలి ఐలమ్మ, షేక్ బందగి, రావి నారాయణరెడ్డి వంటి అమరవీరులను కన్నదన్నారు. తెలంగాణలో సంక్షేమ, అభివృద్ధి రాజ్యం రావాలని, నియంతృత్వ పోకడలు లేని ప్రజాస్వామిక పాలన సాగాలని, ఇందుకోసం కేసీఆర్ అధ్వర్యంలో పోరాటం సాగిస్తామని కేటీఆర్ ప్రకటించారు. గ్రూప్-1 విద్యార్థులు రౌండ్ టేబుల్ సమావేశం పెట్టుకుంటే రాష్ట్ర ప్రభుత్వం నియంతృత్వంతో దాడి చేసిందని విమర్శించారు. ఒకవైపు రైతన్నలు యూరియా లేక ఇబ్బందులు పడుతుంటే ఒలింపిక్స్ గురించి మాట్లాడుతుందని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వంపై బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని కేటీఆర్ అన్నారు.

అమెరికా నేతలు పచ్చి అవినీతి పరులు

- ఇజ్రాయిల్ నుంచి లంచాలు
- పాక్ రక్షణమంత్రి సంచలన వ్యాఖ్యలు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా రాజకీయ నాయకులు ఇజ్రాయిల్ నుంచి బహిరంగంగా లంచాలు స్వీకరిస్తారని, అదే పని తాను చేయాల్సి వస్తే రహస్యంగా చేస్తానంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఓ స్థానిక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వివాదాస్పద ఆరోపణలు చేశారు. జియో టీవీలో జర్నలిస్ట్ షాజెబ్ ఖాన్జాదాతో జరిగిన ముఖాముఖిలో ఆయన మాట్లాడుతూ... అవినీతి విషయంలో తమ దేశాన్ని అన్యాయంగా నిందిస్తున్నారని వాదించారు. అమెరికాలో రాజకీయ నాయకులు, చట్టసభ సభ్యులు ఇజ్రాయిల్, దాని లాబీయింగ్ గ్రూపుల నుంచి బహిరంగంగా ఆర్థిక సహాయం పొందుతున్నారని ఆయన ఆరోపించారు.

"మమ్మల్ని లంచాలు తీసుకుంటున్నామని బదనాం చేస్తున్నారు. కానీ అమెరికా నేతలు ఇజ్రాయెల్ నుంచి బహిరంగంగానే లంచాలు స్వీకరిస్తారు. ఒకవేళ నేను లంచం తీసుకోవాల్సి వస్తే, ఎక్కడో ఓ మూలన రహస్యంగా తీసుకుంటాను" అని ఆయన అన్నారు. పాకిస్థాన్‌పై అవినీతి ఆరోపణలు వస్తున్నాయని, కానీ అమెరికాలో ఇలాంటి పద్ధతులను రాజకీయ నిధుల పేరుతో చట్టబద్ధం చేశారని ఆయన విమర్శించారు. గాజాపై ఇజ్రాయిల్ దాడులు తీవ్రతరం చేయడం, టెల్ అవీవ్‌కు అమెరికా మద్దతు పునరుద్ఘాటించడం వంటి పరిణామాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇదే కార్యక్రమంలో, ఇస్లామిక్ దేశాలన్నీ కలిసి నాటో తరహాలో ఒక రక్షణ కూటమిని ఏర్పాటు చేయాలని కూడా ఆసిఫ్ ప్రతిపాదించారు.

గూఢచర్యం చేసిన వ్యక్తిని ఉరితీశాం: ఇరాన్

టెహ్రాన్: ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధం సమయంలో ఇజ్రాయిల్‌కు కీలక సమాచారం అందించారనే కారణంతో ఓ వ్యక్తిని బహిరంగంగా ఉరితీసినట్లు ఇరాన్ బుధవారం వెల్లడించింది. ఇరానియన్ డేటా సెంటర్లు, భద్రతాపరమైన విషయాల గురించి ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్ సర్వీస్ 'మొస్సాద్' కు కీలక సమాచారం అందించిన ఘటనలో బాబాక్ షాబాజీ అనే వ్యక్తిని ఉరి తీసినట్లు ఇరాన్ న్యాయవ్యవస్థ పేర్కొంది. అతడు పొరుగు దేశంలో ఇజ్రాయిల్ ఏజెంట్లతో భేటీ అయినట్లు ఆరోపించింది. అయితే, అతడిని తప్పుడు కేసులో ఇరికించి వేధింపులకు గురి చేశారని... ఇరాన్‌లోని మానవ హక్కుల కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి సహాయం చేస్తూ లేఖ రాసినందుకు బాబాక్ షాబాజీని ఇరాన్ అదుపులోకి తీసుకున్నట్లు ఆరోపించారు. ఉక్రెయిన్‌పై దాడి చేయడానికి మాస్కో ఉపయోగించిన డ్రోన్‌లను ఇరాన్ రష్యాకు సరఫరా చేసిందని.. ఈ విధంగా రష్యాకు ఇరాన్ యుద్ధంలో సహకరిస్తుందనే విషయాన్ని జెలెన్‌స్కీకి తెలిపినందుకే అతడిని ఉరి తీశారని అన్నారు. కానీ పైకిమాత్రం ఇజ్రాయిల్‌కు గూఢచర్యం చేసినట్టు తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే వీరి వాదనను ఇరాన్ ఖండించింది. ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించినప్పటికీ ఇజ్రాయిల్ కోసం గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలతో ఇరాన్ న్యాయవ్యవస్థ ఇప్పటి వరకు ఎనిమిది మందిని ఉరితీసింది. ఈ ఘటనలపై ప్రపంచ మానవ హక్కుల సంఘాలు, పలు సంస్థలు తీవ్రంగా స్పందిస్తున్నాయి. ఇరాన్ న్యాయ ప్రక్రియలో పారదర్శకతను ప్రశ్నిస్తూ తీవ్ర విమర్శలు చేశాయి.

నిరుపేదలకు లబ్ధి చేకూరేలా విద్యా వ్యవస్థ

విశాలాంధ్ర - హైదరాబాద్: క్షేత్రస్థాయి పరిస్థితులు, అధ్యయనం, భవిష్యత్ అవసరాలకు తగినట్లు రూపొందించే తెలంగాణ విద్యా విధానం భారతదేశ విద్యా విధానానికి దిక్సూచిలా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో భాష ఉన్న వారి దగ్గర జ్ఞానం లేదని... జ్ఞానం ఉన్న చోట భాష లేదని... రెండు ఉన్న చోట నైపుణ్యాలు లేవని... కానీ ఈ మూడింటి కలబోత విద్యారంగం ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. తెలంగాణ విద్యా విధానం రూపకల్పనపై సెక్రటేరియట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో రేవంత్ మాట్లాడుతూ... తెలంగాణలో విద్యా రంగాన్ని సమూల ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. పేదరిక నిర్మూలనకు విద్య తప్ప మరో ఆయుధం లేదని అన్నారు. మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా ఉన్న కాలంలో ఉద్యోగావకాశాలకు అనేక పరిమితులు ఉన్నాయని సీఎం చెప్పారు. సరళీకృత ఆర్థిక వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు భారీగా పెరిగినప్పటికీ విద్యాప్రమాణాలు ఆస్థాయిలో పెరగకపోవడంతో వాటిని అందిపుచ్చుకోవడంలో మనం విఫలమవుతున్నామని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి ఏటా బయటకు వస్తున్న లక్షలాది మంది ఇంజినీరింగ్ విద్యార్థుల్లో పది శాతం మందికి కూడా ఉద్యోగాలు దక్కడం లేదన్నారు. తగినంత నైపుణ్యం లేకపోవడమే అందుకు కారణమన్నారు. విద్యా రంగానికి భారీఎత్తున నిధులు కేటాయిస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోందని అన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్లు ఉపాధ్యాయులు ఉండాలనే ఉద్దేశంతో తాము అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని గుర్తు చేశారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చామన్నారు. యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల నియామకం చేపట్టామని సీఎం తెలిపారు. మన చదువులు భాష, జ్ఞానం, నైపుణ్యాలు, క్రీడల మేళవింపుతో ఉండాలని సూచించారు. విద్యా వ్యవస్థ నిరుపేదలకు లబ్ధికలిగేలా ఉండాలని తాము ఆకాంక్షిస్తున్నామని సీఎం తెలిపారు. విద్యా విధానంలో సిలబస్ రూపకల్పన, వనరుల సమీకరణ, విధానం అమలుపై స్పష్టత అవసరమని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ విద్యా విధానం చైర్మన్ కేశవరావు మాట్లాడుతూ విద్యా కమిషన్, ఇతర భాగస్వాములతో తాము విస్తృత సంప్రదింపులు చేశామన్నారు. గణాంకాల కన్నా నాణ్యత ప్రధానమని, విద్యార్థి కేంద్రంగా బోధన ఉండాలనేది తమ అభిప్రాయమన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐ.వి.సుబ్బారావు మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల పెంపునకు చేసిన కృషి అభినందనీయమన్నారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ తాము స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నామని, ఒక్క ఏడాదిలో 180 పేటెంట్లు పొందామని తెలిపారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ విద్యా విధానం కొలువుల సాధనకే కాకుండా అత్యుత్తమ మానవునిగా తీర్చిదిద్దేదిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు, ఎమ్మెల్సీలు ఏ.వి.ఎన్.రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, విద్యావేత్తలు మోహన్ గురుస్వామి, ప్రొఫెసర్ సుబ్బారావు, సీఐఐ శేఖర్ రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, అక్షరవనం మాధవరెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణాది విలవిల

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాదం ఉంది. సుంకాలు ప్రకటించినప్పటి నుంచి గుమతిదారులు ఆర్డర్‌లలో ఆరు శాతం తగ్గుదల నివేదించారు. అయితే వియత్నాం, ఇండోనేషియా వంటి ప్రత్యర్థులు మార్కెట్‌లో ఎక్కువ వాటా కోసం చూస్తున్నారు' అని తెలిపారు. అమెరికాకు వార్షిక ఎగుమతుల్లో సుమారు రూ.700 కోట్ల విలువైన టీ, రబ్బరు కూడా సుంకాల భారానికి గురవుతున్నాయి. కేరళ వలస జనాభా ఎగుమతి పరిశ్రమలను నిలబెట్టడంలో పరోక్ష పాత్ర పోషిస్తుంది. వాణిజ్య అంతరాయాలు వలసల నమూనాలలో ఇబ్బందులను ఏర్పరచవచ్చు. 'సాంప్రదాయ పారిశ్రామిక, వ్యవసాయ రంగాలో ఆదాయ నష్టాలు రాష్ట్ర మానవ అభివృద్ధి సూచికలను కూడా బలహీనపరచవచ్చు' అని మంత్రి హెచ్చరించారు. రాయితీ వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, వేగవంతమైన జీఎస్టీ వాపసు, ఇంధన సబ్సిడీలు, కార్మికులకు మధ్యంతర ఉపశమనం వంటి స్వల్పకాలిక చర్యలను బాలగోపాల్ వివరించారు. దీర్ఘకాలిక వ్యూహాలలో ఎగుమతి మార్కెట్లను వైవిధ్యపరచడం, రూపాయి ఆధారిత వాణిజ్య పరిష్కారాల వైపు వెళ్లడం, మార్కెట్ ఇంటెలిజెన్స్‌ను మెరుగుపరచడం, బ్రాండింగ్‌కు మద్దతు ఇవ్వడం, సామూహిక బేరసారాలను బలోపేతం చేయడం వంటివి ఉన్నాయి. సోమవారం ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. భారతదేశంలోని రొయ్యల ఎగుమతుల్లో దాదాపు 80 శాతం, సముద్ర ఎగుమతుల్లో 34 శాతం ఆంధ్ర ప్రదేశ్ వాటా కలిగి ఉంది. దీని విలువ ఏటా రూ.21,246 కోట్లు. పరిశ్రమ దాదాపు రూ.25,000 కోట్ల నష్టాలను ఎదుర్కొంటుందని, దాదాపు సగం ఎగుమతి ఆర్డర్లు రద్దయ్యాయని, దాదాపు 2,000 కంటైనర్లు రూ.600 కోట్ల సుంకం భారంతో ఇబ్బంది పడుతున్నాయని సీఎం చంద్రబాబు చెప్పారు. రుణం, వడ్డీ చెల్లింపులపై 240 రోజుల మారటోరియం, వడ్డీ సబ్సిడీలు, స్తంభింపజేసిన రొయ్యలపై 5 శాతం జీఎస్టీని తాత్కాలికంగా మినహాయించాలని చంద్రబాబు కోరారు. ఆక్వా ఫీడ్, సబ్సిడీ ట్రాన్స్‌ఫార్మర్లలో ధరల తగ్గింపు వంటి ఉపశమన చర్యలు ప్రారంభమయ్యాయి. అయితే కేంద్రం సహాయం తప్పనిసరి అని ఏపీ సీఎం నొక్కి చెప్పారు. అంతకుముందు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ కూడా ఇలాంటి భయాలను వ్యక్తం చేశారు. 'వస్త్రాలు, తోలు, ఆటో, యంత్రాలు, ఇతర రంగాలలో లక్షల ఉద్యోగాలు ప్రమాదంలో ఉన్నాయి' అని ఆయన తెలిపారు. 'మానవ నిర్మిత వస్త్రాలపై జీఎస్టీ తగ్గించాలని, పత్తి దిగుమతులపై సుంకాలను తొలగించాలని, తక్కువ వడ్డీ రుణాలను విస్తరించాలని, ఎగుమతి ప్రోత్సాహకాలను పెంచాలని ఆయన 'ఎక్స్' పోస్ట్‌లో ప్రధాని మోదీని కోరారు. ఈ వాణిజ్య సంక్షోభాన్ని అధిగమించడానికి తమిళనాడు కేంద్ర ప్రభుత్వంతో కలిసి పని చేస్తుంది' అని సీఎం ఎం.కె.స్టాలిన్ అన్నారు. ఇక అమెరికా సుంకాల భారానికి బెంగాల్‌లోని సైకిల్ తయారీదారులు, టీ ఎగుమతిదారులు, రత్నాలు, ఆభరణాల రంగం కూడా ఎదురుదెబ్బలకు సిద్ధమవుతున్నాయని ఒక ఆంగ్ల వార్తా సంస్థ కథనం పేర్కొంది.

మోదీ... టెర్రరిస్టులు, నక్సలైట్లకు తేడా తెలుసుకో

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధాంతాన్ని ఆయుధంగా చేసుకొని పని చేస్తారన్నారు. తాము కూడా అదే సిద్ధాంతాన్ని అనుసరిస్తామని, అయితే వారికి, తమకు తేడా ఉందన్నారు. నక్సలైట్లను చంపినంత మాత్రాన వారి సిద్ధాంతాన్ని చంపలేరు కదా అని ప్రశ్నించారు. ఫాసిజాన్ని చంపగలరా? అసలు సాధ్యపడుతుందా? అని మండిపడ్డారు. నక్సలిజాన్ని చంపడం ఎవరి తరం కాదని హెచ్చరించారు. నక్సలైట్ల పేరుతో గిరిజనులను చంపుతున్నారని విమర్శించారు. గిరిజనులు అటవీ ప్రాంతాన్ని ఖాళీ చేసిపోతే ప్రకృతి సిద్ధమైన సంపదను దోచుకుని కార్పొరేట్ శక్తులకు అప్పచెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం కుటిల రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేర చరిత్ర కలిగిన అమిత్ షా అసలు రాజకీయ నాయకుడే కాదని, ఆయన నిర్దోషిగా బయటపడేందుకు 12 మందిని చంపించారని ఆరోపించారు. అమిత్ షా ఆలోచనే దుర్మార్గపు ఆలోచన అని దుయ్యబట్టారు.

చండీగఢ్‌లో 21 నుంచి 25 వరకు సీపీఐ జాతీయ మహాసభలు

చండీగఢ్‌లో ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు సీపీఐ జాతీయ మహాసభలు జరగనున్నాయని నారాయణ చెప్పారు. దేశ, అంతర్జాతీయ రాజకీయాలు... ముఖ్యంగా బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల గురించి ఈ సభల్లో చర్చిస్తామన్నారు. సీపీఐ ఇటీవల కొంతమేరకు బలోపేతం అవుతున్నప్పటికీ మరింత మంది యువత పార్టీలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇటీవల బంగ్లాదేశ్, శ్రీలంకలో ప్రజలచే ఎన్నికయిన ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల 6 నెలల్లోనే అక్కడ యువత స్పందించిన విధానం చూస్తే... యువతలో మార్పు కొట్టొచ్చినట్లు కనబడుతోందని తెలిపారు. నేపాల్‌లో అధికార ప్రభుత్వంపై యువత తిరగబడిన విధానం చూస్తే ప్రపంచ వ్యాప్తంగా యువతలో మార్పు వస్తోందన్నారు. అయితే నేపాల్‌లో సోషల్ మీడియాను నిషేధించడం వల్లే యువత తిరగబడిందనేది వాస్తవం కాదని చెప్పారు. అక్కడ అనేక రంగాలలో అవినీతి చోటుచేసుకోవడం, నిరుద్యోగ సమస్య ప్రబలటం తదితర కారణాల వల్ల యువత ఘాటుగా స్పందించిందన్నారు. అధికార ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఢీకొట్టే ధైర్యం యువతకే ఉందని అన్నారు. ఎప్పుడయితే పాలక వర్గాలు ప్రజలను అవమానపరిచే పద్ధతుల్లో పాలన కొనసాగించినప్పుడు ఇతర పార్టీలు చేయలేని పనిని యువత చేస్తుందనటంలో పైన తెలిపిన ఉదాహరణలేనని అన్నారు. యువత రాజకీయాల్లోకి వస్తేనే ప్రభుత్వాలు ప్రజా పాలన అందిస్తాయని తెలిపారు. పార్టీలో వయసును ప్రామాణికం చేయకపోతే యువత చేరిక అంత సులువుగా ఉండదని... 75 సంవత్సరాలు దాటిన వారు పార్టీలో కొనసాగేలా ఉండొచ్చు... కానీ నాయకత్వంలో ఉండాల్సిన అవసరం లేదని అన్నారు. యువతకు అవకాశం ఇవ్వడం కోసమే ఈ మార్పు అని, సీపీఐలో అంతర్గత మార్పు జరగాల్సిన అవసరం ఉందని, వీటన్నిటిపై చండీగఢ్‌లో జరగనున్న జాతీయ మహాసభలలో చర్చించనున్నట్లు ఆయన చెప్పారు.

కుల గణన జరగాలి... బీసీల వాదన న్యాయబద్ధమే

ఒక్క శాతంగా ఉన్న జనాభా చేతిలో 60 శాతం ఆస్తులు ఉన్నాయని... జనాభాలో 10 శాతం ఉన్న వారు నేడు అధికారంలో ఉంటున్నారని నారాయణ అన్నారు. ఈ నేపథ్యంలోనే మా వాటా మాకు ఇవ్వండనే బీసీల వాదన న్యాయబద్ధమైనదేనని, ఇటువంటి పరిస్థితుల్లో కుల గణన జరగాలని ఆయన డిమాండ్ చేశారు. 2029 లో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వర్తించేలా చేయాలని, అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కూడా రాజ్యాంగబద్ధంగా బీసీలకు 42 శాతం సీట్లు ఇవ్వాలని, ఇది విజయవంతం అయ్యేందుకు సీపీఐ ఉద్యమం చేపడుతుందని తెలిపారు. మహాసభల అనంతరం కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

విశాఖ స్టీల్ ప్రైవేటుపరమైతే కూటమి ప్రభుత్వానికి పుట్టగతులుండవు: ముప్పాళ్ల

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని 42 విభాగాలను ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అది అవుట్ సోర్సింగ్ ప్రయోజనాల కోసం చేసే పని తప్పా... ప్రైవేట్ కాకుండా ప్రభుత్వ పరంగానే కొనసాగిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడటానికి కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయకపోగా మోదీకి భజన చేస్తున్నారని, ఇది చాలా దుర్మార్గమని, విశాఖ స్టీలు ప్రైవేట్‌పరం అయితే కూటమి ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన వైఖరిని చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సహజ నిక్షేపాలు విస్తారంగా ఉన్నాయని, వాటిని రిలయన్స్ కంపెనీ తీసుకెళ్లి గుజరాత్‌లో రిఫైనరీలలో పెట్టి అక్కడ నుంచి దేశమంతా అమ్ముకొని సొమ్ము చేసుకుంటోందని ముప్పాళ్ల ధ్వజమెత్తారు. రిలయన్స్ అధినేత ప్రతి సంవత్సరం రెండున్నర లక్షల కోట్ల రూపాయలు మన సహజ ఆయిల్‌పై లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలు ఉన్న రాష్ట్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి రావలసిన 50 శాతం వాటా తెచ్చుకున్నట్లయితే ఉచిత విద్యుత్‌తో పాటు రాష్ట్ర వనరులను పెంచుకోవచ్చన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయం కాదని, ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక, సామాజిక విధానాలు కావాలని తెలిపారు. ఆ రకమైన విధానాలను సీపీఐ రానున్న రోజుల్లో ముందుకు తీసుకెళుతుందని చెప్పారు. వామపక్షాలే కాకుండా దేశభక్తులు, అంబేద్కరిష్టులు, ప్రజాస్వామ్యవాదులు అందరూ కలిసి మోదీకి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి, సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్, సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్, కేసీఆర్ అసెంబ్లీకి వెళ్లాలి

విశాలాంధ్ర- సత్తెనపల్లి: ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసన సభ గొప్ప వేదిక అని, అటువంటి శాసన సభకు ఎన్నికలలో పోటీ చేసి తెలంగాణాలో కేసీఆర్, ఆంధ్ర ప్రదేశ్‌లో జగన్‌మోహన్ రెడ్డి అసెంబ్లీకి వెళ్లకపోవటం సరైనది కాదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ పెళ్లి చేసుకొని కాపురం చేయననే చందంగా కేసీఆర్, జగన్ వ్యవహరిస్తున్నారని అన్నారు. శాసన సభ్యులుగా ప్రమాణం చేసి అసెంబ్లీకి వెళ్లకుండా ఎమ్మెల్యే రాయితీలు, జీతాలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రజల సమస్యలు ప్రస్తావన చేయవలసిన ప్రజా ప్రతినిధులు ముందు వరస సీట్లు కావాలని, హోదా కావాలని... అవి ఇస్తేనే అసెంబ్లీకి వస్తామనటం ఎంత వరకు సమంజసమని అన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కావాలంటే ఒక లెక్క ఉంటుందని, దాని ప్రకారం మాత్రమే ఇస్తారని తెలిపారు. స్థానిక సీపీఐ నాయకులు నరిసేటి తాండవ కృష్ణ, కంబాల శ్రీనివాస్, చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛ మన జీవన విధానం

(మొదటిపేజీ తరువాయి)

స్ఫూర్తితో నిన్నటి నియంతృత్వ పాలనను ఓడించి ప్రజా పాలనను తెచ్చుకున్నామ న్నారు. తప్పులుంటే దిద్దుకుంటున్నామని, మంచి చేయడమే బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడాలన్న తపనతో పని చేస్తున్నామని, పేదవాడి మొఖంలో ఆనందమే లక్ష్యంగా సంక్షేమ చరిత్రను తిరగ రాస్తున్నామన్నారు. "మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి" నినాదంతో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయన్నారు. నారాయణపేట జిల్లాలో మహిళా సమాఖ్య అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ద్వారా ఆరు నెలల్లో రూ.15.50 లక్షల లాభాలు ఆర్జించిందన్నారు. ఖమ్మం "మహిళా మార్ట్" విజయవంతంగా నడుస్తోందని పేర్కొన్నారు. హరిత విప్లవం నుంచి ఉచిత విద్యుత్ వరకు, రుణమాఫీ నుంచి రైతు భరోసా వరకు కొత్త చరిత్రను సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణాలు మాఫీ చేసి దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా రైతులను ఆదుకున్నామన్నారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో రూ.తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేసి పెట్టుబడికి భరోసా ఇచ్చామని వివరించారు. ఏడాది కాలంలో రూ.లక్షా నాలుగు వేల కోట్లు రైతుల ప్రయోజనాలపై ఖర్చు చేశామన్నారు. 7,178 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద చివరి గింజ వరకు కొన్నామని, సన్నాలకు క్వింటాల్ కు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ మోటార్లకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, దీని కోసం రూ.16,691 కోట్ల సబ్సిడీని విద్యుత్తు సంస్థలకు చెల్లిస్తున్నామని వివరించారు. గత ఏడాది 2.90 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తితో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. సుమారు 60 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేశామన్నారు. రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం ద్వారా రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు. కృష్ణా, గోదావరి నదుల్లో మనకు హక్కుగా దక్కాల్సిన నీటి వాటాలపై రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. 2027, డిసెంబరు తొమ్మిదో తేదీ నాటికి ఎస్ఎల్‌బీసీని (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) ప్రజలకు అంకితం చేస్తామన్నారు. రూ.7,360 కోట్లతో గోదావరి రెండు, మూడు దశల పనులను ఇటీవలే ప్రారంభించామని, ఓఆర్ఆర్‌పై తలపెట్టిన గేట్ వే ఆఫ్ హైదరాబాద్ ఒక గొప్ప స్వాగత తోరణంగా నిలుస్తుందని తెలిపారు. రూ.24 వేల కోట్లతో మెట్రో రెండవ దశ విస్తరణ ప్రాజెక్టును చేపడుతున్నామని చెప్పారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు, గ్రీన్ ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, మెట్రో రెండో దశ విస్తరణ ప్రాజెక్టులు, ఔటర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య నిర్మించే రేడియల్ రోడ్లు, వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు, హైదరాబాద్ -నాగపూర్, హైదరాబాద్-బెంగుళూరు, హైదరాబాద్-విజయవాడ పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుతో తెలంగాణ ముఖ చిత్రాన్ని సమూలంగా మారుస్తాయన్నారు. ప్రపంచ వేదికపై తెలంగాణ జెండా ఎగిరే స్థాయికి ఎదగాలన్నదే లక్ష్యమన్నారు.

సంక్షేమం...అభివృద్ధే ధ్యేయం: భట్టి

పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతాంగం, కూలీలు భూమి కొరకు, భుక్తి కొరకు భూ పోరాటాలు చేసి, నిజాంప్రభుత్వ సాయుధ రజాకార్లను ఎదురించారని, నిజాం సంస్థానాన్ని సమాఖ్య భారతదేశంలో భాగంగా చేయడానికి జరిగిన పోరాటాల్లో ఖమ్మం జిల్లా కూడా ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. గ్రంథాలయ ఉద్యమాలలో, రజాకార్లకు వ్యతిరేకంగా, వీరొచితంగా జరిగిన పొరాటంలో బొమ్మ కంటి సత్యనారాయణ రావు, రామ్ చందర్ రావు, శీలం సిద్ధారెడ్డి, నల్లమల్ల గిరిప్రసాద్, మహ్మద్ రజబ్ అలీ, వెంగళరావు ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. లక్షా 14 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం వసతి కల్పిస్తున్నామని అన్నారు. అర్హులైన పేద కుటుంబాల అందరికీ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఖమ్మం జిల్లాలో లక్షా 38 వేల 790 ఎకరాలకు సాగునీటి వసతి కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమం కింద ఇప్పటి వరకు 29 లక్షల 68 వేల మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. తొలుత దేశ భక్తి గేయాలపై న్యూ విజన్ కాన్సెప్ట్ స్కూల్- టేకులపల్లికి చెందిన టీజీఎస్.డబ్ల్యూఆర్ ఎస్ గురుకుల బాలికల విద్యార్థినిలు చేసిన ప్రదర్శనలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చేనేత జౌళి శాఖ, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, జిల్లా పౌర సరఫరాలు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య, వ్యవసాయ, విద్యుత్, తదితర శాఖలు అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమం ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను భట్టి సందర్శించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డి.ఎఫ్.ఓ. సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, డిఆర్ఓ ఎ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా పాల్గొన్నారు.

అదానీపై వీడియోలు, పోస్టులు తొలగించాలి

(మొదటిపేజీ తరువాయి)

కార్యకర్తలకు కోర్టు స్పష్టంచేసింది. వార్తా సంస్థలు న్యూస్‌లాండ్రీ, ది వైర్‌తో పాటు యూట్యూబర్లు రవీశ్ కుమార్, అజిత్ అంజుమ్, ధ్రువ్ రాఠి, అకాశ్ బెనర్జీ (దేశ్‌భక్త్) ఉన్నారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం కాలానుగుణంగా చర్యలు తీసుకోవడంతో పబ్లిషర్లు విఫలమైనట్లు మంత్రిత్వశాఖ పేర్కొంది. నోటీసు అందిన 36 గంటల్లోగా సంబంధిత వీడియోలు, పోస్టులన్నీ తొలగించాలని ఆదేశించింది. ఈ నోటీసు ప్రతులను మెటా, గూగుల్‌కూ పంపింది.

ఎంతోమంది త్యాగధనుల ఫలితమే ప్రజాపాలన దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లాను అన్ని రంగాలలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిల్పడానికి ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్లో జరిగిన ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ ముందుగా కలెక్టరేట్ ప్రాంగణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ముందుగా జిల్లా ప్రజలకు మంత్రి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంతోమంది త్యాగధనుల ఫలితంగా 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ రాష్ట్రం (హైదరాబాద్ స్టేట్) విలీనమైనదని తెలిపారు.తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలపడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ పి.ప్రావిణ్య, ఎస్పి పరితోష్ పంకజ్ ,టి జి ఐ ఐ సీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి డిఆర్ఓ పద్మజ రాణి, సంగారెడ్డి జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ అంజయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: తెలంగాణకు నిజమైన స్వాతంత్రం సెప్టెంబర్ 17 అని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి తెలిపారు.బుధవారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో నూతన కూరగాయల మార్కెట్ నుండి ర్యాలీ నిర్వహించి మూడు కోట్ల జంక్షన్ లో గల తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పూర్తి చిహ్నం దగ్గర పూలమాలలు వేసి, నివాళులు అర్పించి సాయుధ పోరాట వీరుడు తీగల సత్యనారాయణ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణకు నిజమైన స్వాతంత్రం సెప్టెంబర్ 17న వచ్చిందన్నారు. నాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నిర్వహించి తెలంగాణను విలీనం చేసిన ఘనత కమ్యూనిస్టులదే అన్నారు. సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి, పెరుగు కుమార్, రేసపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న ,మామిండ్ల సాంబలక్ష్మి ,కట్లోజు పాండురంగ చారి, తండ సందీప్ ,వీరవెల్లి రవి ,వెలుగు శ్రావణ్ ,ఎండి ఫాతిమా ,కేదాసు ,రమేష్, బానోతు లింగ్య నాయక్, మాలోతు రవీందర్, ఆ బోతు అశోక్ ,జలగం ప్రవీణ్, వంకాయలపాటి చిరంజీవి, మంద శంకర్, ముదుసు రాణి ,నాంచారి దాసు, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో : పోషణ మాసం సందర్భంగా పిల్లలు, కిశోర బాలికలు, మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ మాసం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు జిల్లాలోని అంగన్వాడి కేంద్రాల స్థాయి నుండి ప్రాజెక్టు స్థాయి వరకు ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి దయానందరా ణి, డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, డీఈఓ అశోక్, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

విశాలాంధ్ర - తొర్రూర్: పర్యావరణాన్ని ప్రతి ఒక్కరు పరిరక్షించాలని లైన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ సూర్నం రామ నరసయ్య అన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ సూర్నం రామనర్సయ్య లైన్స్ క్లబ్ ప్రతినిధులతో కలిసి రోహిత్ హాస్పిటల్‌లో జూట్ బ్యాగులను పేదలకు పంపిణీ చేశారు. అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవ సందర్భంగా డాక్టర్ రామ నరసయ్య మాట్లాడుతూ ఓజోన్ పొర అనేది భూమిని కాపాడే ఒక సహజ వాయు కవచం అని, ఇది సూర్యుని నుంచి వచ్చే హానికరమైన అతినీలలోహిత (యువి) కిరణాలను అడ్డుకుంటుందని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు వాడవద్దు అవి భూమిలో కరగడానికి కొన్ని సంవత్సరాలు పడుతుందని పేర్కొన్నారు. క్లబ్ ఆఫ్ ఉపాధ్యక్షులు పెరుమాండ్ల రమేష్, సెక్రెటరీ రవీందర్ రెడ్డి, జిల్లా క్యాబినెట్ మెంబర్ విశ్వేశ్వర్ రావు, ట్రెజర్ శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ శంకర్, లైన్స్ క్లబ్ అధ్యక్షులు రామ నర్సయ్య కుమారుడు రోహిత్ జన్మదిన పురస్కరించుకొని నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి గ్రామ జెడ్‌పిహెచ్ పాఠశాలకు బ్లూటూత్ స్పీకర్‌ను రామ నర్సయ్య అందజేశారు. సెక్రటరీ ముదుపు రవీందర్ రెడ్డి, ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ బోనగిరి శంకర్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - కోదాడ : మహిళల ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్య మహిళ, శక్తివంతమైన కుటుంబం) కార్యక్రమాన్ని బుధవారం కోదాడలోని ప్రభుత్వ హాస్పిటల్లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని ఆరోగ్య కేంద్రాల యందు ప్రత్యేక మహిళా ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి, ప్రత్యేక వైద్య నిపుణులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించబడతాయని అన్నారు. వైద్యశిబిరాల్లో నేత్ర, దంత, చర్మ, చెవి, ముక్కు, గొంతు,ప్రసూతి, దెర్మటాలజీ, సైక్రియాట్రిస్ట్ వైద్య నిపుణులు పాల్గొని సేవలందిస్తార న్నారు. డి ఎం హెచ్ ఓ చంద్రశేఖర్, డి సి హెచ్ ఎస్ వెంకటేశ్వర్లు, ఏరియా హాస్పిటల్ సూపరిటీడెంట్ దశరద, డిప్యుటీ డిఎంహెచ్ఓ జయమనో హరి, జనరల్ మెడిసిన్ డాక్టర్ మాధవ్ కుమార్,ఇమ్యూనైజేషన్ డాక్టర్ లక్ష్మణ్, ఈ ఎన్ టి డాక్టర్లు నరసింహ, రాజేష్, అప్తమాలజీ డాక్టర్ నాగమణి, సైకీయాట్రిక్ డాక్టర్ స్రవంతి, జనరల్ సర్జెన్ డాక్టర్ వైష్ణవి పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి, సింగరేణి: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం ఘనంగా ప్రజా పాలన దినోత్సవం నిర్వహించారు. రామగుండం కమీషనేట్ కార్యాలయంలో కమీషనర్ అంబర్ కిశోర్ ఝా జాతీయ జెండా ఆవిష్కరించి తెలంగాణ ఎట్లా దేశంలో ఎట్లా విలీనం అయిందో వివరించారు. రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్, జిల్లా అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ కమీషనరేట్ కార్యాలయంలో జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ తెలంగాణ పోరాటం, విలీనం, పరిపాలన గురించి వివరించారన్నారు. జిఎం లలిత్ కుమార్ జాతీయ జెండాను ఎగురవేసి తెలంగాణ భారత్‌లో విలీనం గురించి మాట్లాడారు.

బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన డిప్యూటీ సీఎం

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : వైరా నియోజకవర్గం ముసలిమడుగు గ్రామంలోని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో ముచ్చటించారు. అధ్యాపకులు బోధిస్తున్న పాఠ్యాంశాలు అర్ధమవుతున్నాయా? మీరు బాగా చదువుతున్నారు? మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయి? డైట్ చార్ట్ ప్రకారం ఆహారం అందిస్తున్నారా? అని బాలికలను ఉప ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఈ సందర్భంగా బాలికలు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం నిర్ణయించిన డైట్ మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారని చెప్పారు. ప్రతిరోజు గుడ్డు, అదేవిధంగా చార్ట్ ప్రకారం చికెన్, మాంసాహార వంటలను అందిస్తున్నారని చెప్పారు. పాఠ్యాంశాలను అధ్యాపకులు చక్కగా బోధిస్తున్నారని స్టడీ అవర్స్‌లో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేస్తూ చదువు చెబుతున్నారని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురుకుల పాఠశాలలోని తరగతి గదులను, వంటశాలని తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన మేరకు విద్యార్థినులకు డైట్ మెనూతో పాటు బాలికలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగా వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల త్యాగాలతోనే తెలంగాణ విలీనం

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : కమ్యూనిస్టుల త్యాగాలతోనే భారతదేశంలో తెలంగాణా విలీనమైందని ఇందులో మరో అభిప్రాయానికి తావులేదని సి.పి.ఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు స్పష్టం చేశారు. తెలంగాణ పోరాట చరిత్రను, కమ్యూనిస్టుల త్యాగాలను వక్రీకరిస్తే జాతి క్షమించదని ఆయన హెచ్చరించారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవ ముగింపుసభ బుధవారం ఖమ్మం లోని జెడ్పీ మీటింగ్ హాల్లో జరిగింది. అంతకు ముందు సి.పి.ఐ శ్రేణులు కదంతొక్కాయి. పాత బస్టాండ్ సెంటర్ నుంచి జెడ్పీ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. జనసేవాదళ్ కార్యకర్తలు నిర్వహించిన కవాత్ పట్టణ, నగర ప్రజలను ఆకట్టుకుంది. వైరా రోడ్ అరుణవర్ణం పులుముకుంది. జెడ్పీమీటింగ్హాల్లో జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ తెలంగాణా సాయుధపోరాటం నాటి సామాజిక, ఆర్థిక పరిస్థితుల పట్ల అవగాహన లేని వారు ఇది మతపరమైన పోరాటంగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. 1947 సెప్టెంబర్ 11న ఆంధ్ర మహాసభ సి.పి.ఐ ఎ.ఐ.టి.యు.సి పక్షాన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూమొహినుద్దీన్లు సాయుధపోరాటానికి పిలుపు నిచ్చారన్నారు. సామాన్యులు సాయుధలై పోరాడారని కర్ర, వడిసెల, గొడ్డలి ఆయుధాలుగా చేబూని ప్రజలు పోరాడారాని ఆ పోరాట ఫలితంగా నైజాం గద్దెదిగక తప్పదన్నారు. యూనియన్ సైన్యాలు ప్రవేశించి నిజాంకు వ్యతిరేకంగా పోరాడలేదని, కమ్యూనిస్టు యోధులను యూనియన్ సైన్యాలు హతమర్చాయని హేమంతరావు తెలిపారు. సి.పి.ఐ జిల్లా సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా, సి.పి.ఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మెన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితిసభ్యులు యర్రాబాబు, ఎస్.కె. జానిమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, బి.జి. క్లైమెంట్, మహ్మద్ సలాం. అజ్మీర రామ్మూర్తి పాల్గొన్నారు.

ఆదివాసుల ఆరాధ్య దైవం కొమురంభీం

విశాలాంధ్ర - బ్యూరో కొమరం భీం : పోరాటయోధుడు కొమురంభీం ఆదివాసీల ఆరాధ్య దైవమని రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. బుధవారం జిల్లాలోని కెరమెరి మండలం జోడేఘాట్ లో ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, ఆదివాసి సంఘ నాయకులతో కలిసి కుమ్రంభీం విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ మాట్లాడుతూ ఆదివాసీల జీవితాలలో వెలుగులు నింపిన పోరాట యోధుడు కుమ్రంభీం జీవితం అందరికీ ఆదర్శనీయమని. జిల్లాలోని జోడేఘాట్ ప్రాంతం చారిత్రాత్మకమైనదని, ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కుమ్రంభీం మ్యూజియంలో ప్రదర్శించిన ఆదివాసీల పురాతన వస్తువులు, వారి ఆచార వ్యవహారాలు, ఆధునికతను జోడించి జీవన విధానంలో తెస్తున్న మార్పులు వంటి విషయాలను తెలుసుకోవచ్చుని, గిరిజనుల అభివృద్ధికి, ఆదివాసీ సంస్కృతిని కాపాడేందుకు సమిష్టిగా కృషి చేద్దామని అన్నారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దాం

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : నాటి నిజాం కాలంలో దొరలు, భూస్వాములు, దేశముఖ్ లు, రజాకారుల మూకలను తరిమికొట్టి తెలంగాణకు విముక్తి కలిగించి విలీనానికి కమ్యూనిస్టులే ప్రధాన భూమిక పోషించారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సలిగంటి శ్రీనివాస్ అన్నారు. అదే స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న నేటి పాలకులకు దారిలో తెచ్చేందుకు ప్రజాఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం శేషగిరిభవన్ లో తెలంగాణ సాయుధ రైతాంగా పోరాట వారోత్సవాల ముగింపు సభ, విలీన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిపిఐ సీనియర్ నాయకులు దమ్మాలపాటి శేషయ్య జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సదస్సులో శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో సిపిఐ పార్టీ పాత్ర ఎంతో ఉందని ముఖ్య ఘట్టాలను వివరించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో సిపిఐ జిల్లా నాయకులు రేసు ఎల్లయ్య, వాసిరెడ్డి మురళి, జి. వీరాస్వామి, కందుల భాస్కర్, ముప్పా వెంకటేశ్వర్ రావు, ఎస్ కె. ఫహీం సదస్సులో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గెద్దాడు నగేష్, దీటి లక్ష్మీపతి, గుగులోత్ రాంచందర్, భూక్యా శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు, కె రత్నకుమారి, ఎం ధనలక్ష్మి, నేరెళ్ల రమేష్, మునిగడప పద్మ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్‌కే సాధ్యం

విశాలాంధ్ర - పినపాక : అన్ని వర్గాల ప్రజా సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మాటల గారడి పార్టీ బిఆర్ఎస్ నుండి వివిధ గ్రామాలకు చెందిన 314 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలోకి చేరడం శుభ పరిణామన్నారు. బుధవారం పినపాక మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి, ఏడూళ్ల బయ్యారం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఎల్చిరెడ్డిపల్లి, ఏడూళ్ల బయ్యారం గ్రామాల నుండి బిఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్ లోకి భారీగా చేరికలు జరిగాయి. వారికి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించి, శాలువాలు కప్పారు. ఈ సందర్భంగా యువకులు 300 బైక్లతో భారీ ర్యాలీ తీస్తూ ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో సంక్షేమ పథకాల జాతర నడుస్తుందన్నారు. గత కెసిఆర్ ప్రభుత్వం కుటుంబ ప్రయోజనాలకే పని చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా నిర్వహిస్తూ తొలి విడుతలో నియోజకవర్గానికి 3500 ఇళ్లతో పాటు ప్రత్యేక హోదా కింద రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవతో మరో 1000 ఇండ్లు అదనంగా ఇచ్చామన్నారు. మరో కోటాలో 1500 ఇండ్లు రాబోతున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం పై రాజకీయాలు చేయటం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొడిశాల రామనాథం, గంగిరెడ్డి వెంకట రెడ్డి, వి. లక్ష్మిరెడ్డి, పేరం వెంకటేశ్వరరావు, జి. శ్రీనివాస్ రెడ్డి, దాట్ల రాజేష్, తోలెం కళ్యాణి, బుచ్చిబాబు, అర్జున్, మధు రెడ్డి, గీద సాయి, బండారు సాంబ, పొనగంటి మల్లయ్య, బి. రమేష్, కె. వీరస్వామి, బతకయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవ సంబరాలు

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో: జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో బుధవారం ప్రజా పాలన దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్క విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించి, జిల్లా ప్రగతి నివేదికను వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులపై, పలు అంశాలపై అంశాల మంత్రి ప్రసంగించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. అనంతరం మంత్రి అసెట్స్ డిస్ట్రిబ్యూషన్ చేశారు.ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి. శబరిష్, ఏ ఎస్ పి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, ఆర్డీఓ వెంకటేష్, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - నేరేడుచర్లలో: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలన దినోత్సవంను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా జరుపుకుంటుంది. రాష్ట్ర ప్రజలకు మరింత సమర్థవంతమైన పారదర్శకమైన పాలను అందించాలని లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నేరేడుచర్ల తాసిల్దార్ సురిగి సైదులు గౌడ్ బుధవారం తెలిపారు. అనంతరం నేరేడుచర్ల తహసిల్దార్ కార్యాలయం నందు మహాత్మా గాంధీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి భారత జాతీయ పథకాన్ని తహసిల్దార్ సురిగి సైదులు గౌడ్ ఆవిష్కరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ బెల్లంకొండ విజయలక్ష్మి నరసింహారావు మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల సందీప్ రెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి, నూకల సుగుణమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడా నైపుణ్యం కలిగి ఉండాలి

విశాలాంధ్ర - మోతె : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో నైపుణ్యం కలిగి ఉండాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నామవరం గ్రామం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కీసర సత్యనారాయణ రెడ్డి, కీసర వినీత్ రెడ్డి జ్ఞాపకార్థంతో ఏర్పాటు చేసిన స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14- అండర్ 17 బాలబాలికల సూర్యాపేట జిల్లా స్థాయి కబడ్డీ పోటీల ప్రారంబించి మాట్లాడాడు ప్రతి విద్యార్థి చదువు కు ఇస్తున్న ప్రాధాన్యతతో పాటు క్రీడలకు ఇస్తే క్రీడా నైపుణ్యాన్ని పెంచుతుంది అన్నారు, అదేవిధంగా క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడుతుందని అన్నారు. తాసిల్దార్ వెంకన్న,ఎంపీడీవో అంజనేయులు ఎంఈఓ గోపాలరావు, ప్రధానోపాధ్యాయులు ఎల్ బి ఎన్ చారి, ఉపాధ్యాయులు రామ్ రెడ్డి,పి ఈ టి కోటి పాల్గొన్నారు.

యాకుబ్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర - గూడూరు : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (హెచ్143) గూడూరు మండల అధ్యక్షునిగా షేక్ యాకుబ్ ఎంపికైన సందర్భంగా ఎస్‌టిఓ రఫీ, చొక్కారావులు షాలువ బుధవారంతో సన్మానించారు. గూడూరు మండలానికి చెందిన వి6 వెలుగు రిపోర్టర్ షేక్ యాకూబ్‌ను గూడూరు ఎస్టిఓ మహమ్మద్ రఫీ, చొక్కారావు ఘనంగా సన్మానించి సత్కరించి స్వీట్ తినిపించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా వివిధ పత్రికలో పనిచేస్తూ ప్రజల కష్టసుఖాలను పత్రిక ద్వారా ప్రభుత్వాన్ని చేరవేసిన వ్యక్తి యాకూబ్ అని కొనియాడారు. మండల అధ్యక్షుడుగా ఎన్నికవ్వడం గర్వించదగ్గ విషయం అన్నారు. ప్రజల సమస్యలను వెలికితీయడంలో ముందు ఉండడంతో పాటు, జర్నలిస్టుల సమస్యలు కూడా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నామని తెలిపారు. విలేకరి వృత్తిలో ఎన్నో ఆటుపోట్లు ఎదురవుతున్నప్పటికీ ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా అడవులు వేస్తున్నామని తెలిపారు.

త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అభివృద్ధికి నాంది

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : ఎందరో మహానుభావుల ఆనాటి త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అభివృద్ధికి నాంది పలికిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు, ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మెదక్ కలెక్టరేట్లో జాతీయ జెండా ఆవిష్కరించారు. అంతకుముందు రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అసువులు బాసిన పోరాటయోధులకు నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా అభివృద్ధిపై ప్రసంగించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, విద్యుత్, వ్యవసాయ, వైద్య ఆరోగ్యం, పౌర సరఫరాలు, విద్యా, గృహ నిర్మాణం, అటవీ, గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్, పోలీస్ తదితర శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. మెదక్ జిల్లా అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ శ్రీనివాస్ రావు, అడిషనల్ కలెక్టర్ నగేష్, ఎఎస్పీ మహేందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సుహాసిని రెడ్డి, ఆర్డీఓ రమాదేవి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విశ్వకర్మ జయంతి మహోత్సవంలో పాల్గొన్నారు. విశ్వకర్మ చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాలని మంత్రి వెంకట్ స్వామి సూచించారు. నర్సాపూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

ప్రజాపాలనలో తొలి ప్రాధాన్యం ప్రజల ఆకాంక్షలకే
మంత్రి తుమ్మల నాగేశ్వరావు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న ప్రజా పాలనలో ప్రజల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు స్పష్టం చేశారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవం పురస్కరించుకొని కలెక్టరేట్‌లో తుమ్మల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లాకు వచ్చిన ఆయనకు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ప్రజలకు తన సందేశంలో అనేక అంశాలను ప్రస్తావించారు. ప్రజా పాలన దినోత్సవం తెలంగాణ చరిత్రలో గర్వకారణమైన రోజన్నారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాదు సంస్థానం భారతదేశంలో కలిసిన చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేస్తుందని తెలిపారు. జిల్లాలో సీతారామ ప్రాజెక్ట్‌తో నీటి కల నెరవేరిందన్నారు. ఇక్కడ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ స్థాపనతో జిల్లాకు ఖ్యాతి తెచ్చిందని చెప్పారు. భద్రాచలానికి రాకపోకల సౌకర్యం కల్పించేలా రైల్వే లైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. కొత్తగూడెం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్, రింగ్ రోడ్, బైపాస్ రోడ్, నేషనల్ హైవే పనులు కూడా ప్రగతిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, అధనపు కలెక్టర్ విద్యా చందన, బీసీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, జిల్లా అధికారులు, ఉద్యోగులు, బీసీ సంఘం నాయకులు వెంకటాచారి, వారాధి సత్యనారాయణ , బి. తిరుపతి, వారాధి రామాచారి, బి. సాంబయ్య, ఎస్. కృష్ణమాచారి, కూరపాటి లింగాచారి, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

విశాలాంధ్ర - భద్రాచలం : భద్రాచలం ఆర్టీవో కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య జాతీయ పథకాన్ని ఆవిష్కరించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమం ఆయన మాట్లాడుతూ భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ నిజాం పాలనలో వున్న హైదరాబాద్ సంస్థానం మాత్రం మరో 13 నెలల పాటు నిజాం పాలనలో కొనసాగిందన్నారు. చివరికి 1948 సెప్టెంబర్ 17న భారత ప్రభుత్వ ఆపరేషన్ పోలో పేర సైనిక చర్య చేపట్టినట్లు వివరించారు. ఫలితంగా హైదరాబాద్ నిజాం సంస్థానం భారతదేశంలో విలీనమైందని చెప్పారు. దీంతో సెప్టెంబర్ 17ను విమోచన దినంగా పేర్కొంటారన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా పేర్కొంటూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యం : మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర - నల్గొండ బ్యూరో : ప్రజాసంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రజాపాలన ప్రభుత్వం సేవలు అందిస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, “సెప్టెంబర్ 17 తేదీ ‘వెట్టి నుంచి తెలంగాణ మట్టికి విముక్తి’ అందించిన దినంగా జరుపుకుంటున్నాం. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారికి ఘన నివాళి అర్పిస్తున్నాం. నల్గొండ జిల్లానే తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువుగా నిలిచింది,” అని అన్నారు. ప్రభుత్వ పథకాలను ఆయన వివరించారు. కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయాన్ని “చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం”గా పేరు మార్చినట్లు తెలిపారు. రైతుల కోసం 2 లక్షల వరకు రుణమాఫీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు, నల్గొండ జిల్లాలో 2,33,981 మంది రైతులకు రూ.2,044.83 కోట్ల రుణమాఫీ అందించినట్లు పేర్కొన్నారు.ప్రజా గాయకుడు గద్దర్ పేరిట సినీ అవార్డులను ప్రవేశపెట్టి, రాష్ట్ర గీతంగా “జయ జయ హే తెలంగాణ”ను ప్రకటించినట్లు చెప్పారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని 8 లేన్లుగా అభివృద్ధి చేయడం, వరంగల్ మామునూర్ విమానాశ్రయానికి అనుమతులు లభించడం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, లైబ్రరీ చైర్మన్ హఫీజ్ ఖాన్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మరియు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఇల్లందు: బులియన్ మర్చంట్, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ విశ్వకర్మ జయంతి వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రాందేవ్ బాబ ఆలయంలో స్వర్ణకార కుటుంబ సభ్యులు యజ్ఞం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించి సాయంత్రం పట్టణ పురవీధుల్లో శోభాయాత్ర చేసారు. ఈ సందర్భంగా విశ్వకర్మ విశిష్టతలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో ఉండాలి

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి లో నిర్వహించిన “స్వస్తినారి - సశక్తు పరివార అభియాన్” కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యం, కుటుంబ సదృఢత, సశక్తీకరణ పై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమాజం బలంగా నిలవాలంటే మహిళలు ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో ఉండాలని, అందుకోసం ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించారు. తరువాత ఆసుపత్రి వసతులను పరిశీలించిన ఎంపీ వంశీకృష్ణ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో కొనసాగుతున్న నూతన భవన నిర్మాణ పనులను కూడా పరిశీలించి, వాటి పురోగతి గురించి కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నా రు.

టిప్పర్ ఢీకొని కొత్తగూడెం వాసి మృతి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : చుంచుపల్లి మండలంలోని శ్రీ ఇంక్లైన్ వద్ద బొగ్గు టిప్పర్ ఢీ కొని కొత్తగూడెంకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. అందిన సమాచారం ప్రకారం కొత్తగూడెంలోని గాజులరాజాం బస్తికి చెందిన కలుతూరి వేణుగోపాల్ (48) బైక్ పై వస్తుండగా టిప్పర్ వెనుక నుంచి ఢీ కొట్టిందని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. దింతో తీవ్ర గాయల పాలయ్యాడు. వెంటనే కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరించారు. చికిత్స పొందుతూ గంట వ్యవధిలోనే మృతి చేదాడు. ఒక పనిమీద సత్తుపల్లి వెళ్లి కొత్తగూడెం ఇంటికి తిరుగు ప్రయాణం వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తుంది. వేణుగోపాల్‌కు ఇద్దరు భార్యలు, నలుగురు పిల్లలు ఉన్నట్లు సమాచారం. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయం

ప్రశ్నించే వారికి మోదీ ప్రభుత్వ బెదిరింపులు

బుధవారం ప్రధానమంత్రి మోదీకి 75 ఏళ్ల జన్మ దినం. ఈ సందర్భంగా ఆయనకు దేశ దేశాల నుంచి శుభాకాంక్షలు అందాయి. మన దేశంలో అయితే భక్తులు ఎలాగో పోటీలుపడి అభినందనలు తెలియజేస్తారు. పారిశ్రామికవేత్తలు, పత్రికా రచయితలు, క్రికెటర్లు కృష్ణమాచార్య శ్రీకాంత్, రవీంద్ర జడేజా మొదలుకొని అనేకమంది ఆయనను అభినందనలతో ముంచెత్తారు. సినిమా నటులు ఆమిర్ ఖాన్, షారుఖ్ ఖాన్, అక్కినేని నాగార్జున, అజయ్ దేవగణ్ (ఆయన భార్య బీజేపీ నాయకురాలు) మోదీని అభినందించడంలో మునిగిపోయారు. పారిశ్రామిక వేత్తలు ముకేశ్ అంబానీ, ఉదయ్ కోటక్, ఆదిత్య బిర్లా, కుమార మంగళం బిర్లా, సునీల్ భారతి మిత్తల్ ఒకరిని మించిన పొగడ్తలతో మరొకరు మోదీని అభినందించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అయితే మంగళవారం అర్ధరాత్రే శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ పత్రికల్లో ఆయన కీర్తిగానంతో వ్యాసాలు ప్రచురించారు. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ కూడా 75 ఏళ్ల జన్మదినం జరుపుకున్నారు. ఆ సందర్భంగా మోదీ పేరుతో భగవత్ మీద వ్యాసాలు ప్రచురితమైనాయి. కానీ మోదీ జన్మదినం రోజున భగవత్ శుభాకాంక్షలు చెప్పారో లేదో తెలియదు. వివిధ పత్రికల్లో మోదీతో తమకు ఉన్న సంబంధాలను వివరిస్తూ అనేకమంది వ్యాసాలు రాసి తరించి పోయారు. ఈ ప్రముఖుల అభినందనల పరంపర కేవలం ఒక ఆనవాయితీగా కనిపించడం లేదు. మోదీని పొగిడి తామూ వార్తల్లోకెక్కాలన్న తపనే ఎక్కువగా కనిపిస్తోంది. 75వ జన్మదినం రోజున అభినందనలు వెల్లువెత్తడాన్ని అభ్యంతర పెట్టాల్సిన పనిలేదు. కానీ అభినందించే తీరే వ్యక్తి పూజను తలపిస్తోంది. విశేషం ఏమిటంటే రాజకీయాలకు దూరంగా ఉండవలసిన న్యాయమూర్తులు శేఖర్ యాదవ్, అరుణ్ మిశ్రా సైతం గతంలో లక్ష్మణ రేఖను దాటి మోదీని పొగడ్తలతో ముంచెత్తారు. ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులిచ్చిన న్యాయమూర్తుల సంఖ్య అపారంగానే ఉంది. అందులో కొందరికి రాజ్యసభ సభ్యత్వాలు దక్కాయి. మరి కొంతమందికి గవర్నర్ పదవుల్లాంటివి వచ్చాయి. ప్రధానమంత్రి స్వయంగా అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఇంట్లో వినాయక పూజలకు హాజరయ్యారు. ఇది నిజానికి ప్రధానమంత్రికి, ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ఉన్న వారికీ తగని పనే. ఇంతమంది మోదీని పొగడ్తలతో ముంచెత్తుతూ ఉంటే నేరుగా మోదీ ప్రభుత్వంలో సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ విధేయత వ్యక్తం చేయకుండా ఎలా ఉండగలదు? ఆ మంత్రిత్వశాఖ మోదీ తరఫున అసలైన పత్రికా రచనకోసం పాటు పడుతున్న న్యూస్ లాండ్రీ, ది వైర్ లాంటి న్యూస్ చానళ్లకు మోదీ తరఫున ఎదురు వాయినాలు అందించింది. మంగళవారం రాత్రి రెండు మీడియా సంస్థలకు, ప్రభుత్వాన్ని, వ్యవస్థను ప్రశ్నించడానికి సాహసిస్తున్న అనేక మంది పత్రికా రచయితలకు తాకీదులు జారీ చేసింది. ఈ తాకీదు ప్రకారం అదానీ మీద రూపొందించిన 138 వీడియోలను, 83 ఇన్స్టాగ్రాం పోస్టులను తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఈ ఆదేశాలు జారీ చేయడం వెనక వాయవ్య ఢిల్లీ జిల్లా కోర్టు గత ఆరో తేదీన జారీ చేసిన ఉత్తర్వులను ఆసరాగా చేసుకుంది. మోదీకి అత్యంత సన్నిహితుడైన బడా పారిశ్రామికవేత్త గౌతం అదానీ యాజమాన్యంలోని అదానీ ఎంటర్‌ప్రైజెస్ దాఖలు చేసిన ఓ కేసులో ఆ కోర్టు ఏకపక్షంగా ఓ ఉత్తర్వు జారీ చేసింది. ఆ ఉత్తర్వు ప్రకారం వీడియోలను, ఇన్స్టాగ్రాం పోస్టులను తొలగించాలట. యూట్యూబ్ చానళ్లను నిర్వహించేవారు స్వయంగా వీటిని తొలగించకపోతే తామే తొలగిస్తామని యూట్యూబ్ హెచ్చరించింది కూడా. ఈ వీడియోలు, వీటిని రూపొందించిన పత్రికా రచయితలు అదానీ పరువు తీశారట. విచిత్రం ఏమిటంటే కోర్టు తీర్పు ఆధారంగా సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆదేశాలు ప్రకారం అమెరికాలోని న్యాయస్థానాలు అదానీని అరెస్టు చేయాలన్న ఆదేశాలను ప్రచురించిన పత్రికలు, ప్రసారం చేసిన యూట్యూబ్ చానళ్ల వాటన్నింటినీ తొలగించాలట.

సమాచార మంత్రిత్వ శాఖ నుంచి ఈ ఆదేశాలు అందుకున్న వారిలో సీనియర్ పత్రికా రచయిత పరంజయ్ ఠాకుర్తా, రవి నాయర్, అబిర్ దాస్ గుప్తా, అయస్కాంత్ దాస్, ఆయుష్ జోషి కూడా ఉన్నారు. వాయవ్య ఢిల్లీ కోర్టు అదానీ దాఖలు చేసిన కేసుపై ఆదేశాలు జారీ చేసినప్పుడు ఈ ట్యూబర్లను విచారించనే లేదు. వారి వాదనలు వినలే లేదు. ఏకపక్షంగా ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాల ఆధారంగానే సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అదానీ పరువుకు భంగం కలిగించే యూట్యూబులను, ఇన్స్టాగ్రాంలను తొలగించాలని ఆదేశించింది. ఢిల్లీ కోర్టు జరిపిన విచారణలో ఈ యూట్యూబర్లకు సంబంధమే లేదు. అభ్యంతరకరం అంటున్న ఈ యూట్యూబ్ వీడియోలను రూపొందించిన వారిలో రవీశ్ కుమార్, అభిసార్ శర్మ, అజిత్ అంజుం, ధృవ్ రాఠీ, ఆకాశ్ బెనర్జీ లాంటి ప్రసిద్ధ పత్రికా రచయితలు ఉన్నారు. తమకు కిట్టని వార్తలు రాసిన వారి మీద కక్ష తీర్చుకోవడం అదానీకి మొదటి నుంచీ ఉన్న అలవాటే. పరంజయ్ గుహా ఠాకుర్తా ఇ.పి.డబ్ల్యు సంపాదకుడిగా ఉన్నప్పుడు అదానీ మీద రెండు వార్తలు ప్రచురించినందుకు రాజీనామా చేయాల్సి వచ్చింది. ఠాకుర్తా మీద ఇప్పటికే అదానీ దాఖలు చేసిన పరువు నష్టం కేసులు విచారణలో ఉన్నాయి. పత్రికా రచయితల మౌలికమైన బాధ్యత ఎప్పుడూ వ్యవస్థ మీద, అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే. ప్రభుత్వం మంచి పని చేసిందనుకున్నప్పుడు ఆ సమాచారమూ ప్రచురించాలి, ప్రసారం చేయాలి. కానీ మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే గుజరాత్ మారణకాండ జరిగింది. రాణా అయూబ్ లాంటి వారు తెహల్కా పత్రిక తరఫున ఆ సమాచారం అంతా సేకరించారు. అయితే తెహల్కా ఆ వార్తలు ప్రచురించకపోవడంతో ఆమె "గుజరాత్ ఫైల్స్" గ్రంథాన్ని ప్రచురించవలసి వచ్చింది. మోదీ ప్రధానమంత్రి అయిన తరవాత గత 11 ఏళ్ల చరిత్ర వివాదాస్పదం అయిందే. ఆయన చేసిన వాగ్దానాలన్నీ కల్లబొల్లి కబుర్లే. స్వదేశీ, స్వయం సమృద్ధి, అమృత కాలం, 2047 కల్లా భారత్ బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతుంది అని నమ్మించి కాలం గడుపుతున్నారు. సమాచార ప్రసార శాఖ జారీ చేసిన ఆదేశాలను చూస్తే ప్రభుత్వాన్ని, మీదు మిక్కిలి మోదీని వేలెత్తి చూపించే వారి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నట్టు స్పష్టం అవుతోంది. మీడియా సామ్రాజ్యాధిపతి కావాలన్న అదానీ ఎప్పటి నుంచో ప్రయత్నం చేస్తున్నారు. ఆయన మీడియా మీద పట్టు సంపాదించడంతో ఆగేట్టు లేరు. సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ తన కనుసన్నల్లో నడిచేట్టు చేసే స్థాయికి ఎగబాకినట్టున్నారు. ఈ కథ ఇక్కడితో ఆగలేదు. పట్నా హైకోర్టు మోదీని ప్రస్తావిస్తూ రూపొందించిన వీడియోను తొలగించాలని ఆదేశించింది. అయితే వీడియోలు తొలగించాలని ఆదేశాలు అందుకున్న పత్రికా రచయితలెవరూ ఒత్తిడికి లొంగే స్వభావం ఉన్న వారు కాదు. వారికి వెన్నెముక ఉంది మోదీ ఎదురు వాయినాలతో బెదిరిపోయే ప్రసక్తే లేదు.

పనిగంటలపై గ్రీస్‌లో ప్రజ్వరిల్లిన నిరసన

ప్రభుత్వం ప్రవేశపెట్టిన రోజుకు13 గంటల పనిదిన బిల్లుకు వ్యతిరేకంగా గ్రీస్ కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. "కార్మికులు మనుషులు... యంత్రాలు కాదు" అంటూ నినదించారు. వేలాది మంది కార్మికులు, కార్మిక సంఘాలు, ప్రజా సంస్థలు ఆల్ వర్కర్స్ మిలిటెంట్ ఫ్రంట్ (పీఏఎంఈ) పిలుపునకు స్పందించి గ్రీస్ రాజధాని ఏథెన్స్‌లో ప్రభుత్వ నిరంకుశ విధానాలకు నిరసనగా భారీ ప్రదర్శన చేపట్టారు. 13 గంటల పనివిధానాన్ని వ్యతిరేకిస్తూ ఇందుకు సంబంధించి ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లును ఉపసంహరించు కోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్మిక విధానాలకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మెతో సెప్టెంబర్ చివరిలో ఉద్యమించాలని నిర్ణయించారు. వివిధ రంగాలకు చెందిన ప్రజలు, కార్యాలయాల నుంచి కార్మికులు సింటాగ్మా స్క్వేర్‌లో సమావేశమై, యూనియన్ బ్యానర్‌లు చేబూని పని గంటలను రోజుకు ఏడు గంటలకు తగ్గించాలని, వారానికి ఐదు రోజులు (వారానికి 35

గంటలు) పనిదినాలుగా నిర్ధారించాలనీ, వేతన పెంపుదలకు తగిన ఒప్పందాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏథెన్స్‌లో జరిగిన ఈ ర్యాలీలో గ్రీస్ కమ్యూనిస్ట్ పార్టీ (కేకేఈ) జనరల్ సెక్రటరీ డిమిట్రిస్ కౌట్సౌంబాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,
"కార్మికులు యంత్రాలు కాదు, మనుషులు. 21వ శతాబ్దంలో కృత్రిమ మేధస్సు, శాస్త్రీయ పురోగతి యుగంలో, పని గంటలను తగ్గించడం ప్రభుత్వాల ప్రాథమిక లక్ష్యం. ప్రభుత్వం 13 గంటల పని దినాలను అమలును చేయడాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలి" అని డిమాండ్ చేశారు. మనకు కావలసింది రోజుకు ఏడు గంటలు, ఐదు రోజుల పనివారం, మంచి వేతనాలు, కార్మిక ఒప్పందాల అమలు, ఆరోగ్యం, భద్రతా చర్యలు. ఇవి కార్మికుల, సంఘాల డిమాండు. గ్రీస్ అంతటా ఈ డిమాండ్లకు మద్దతు పలికారని చెప్పారు. సెప్టెంబర్ 6వ తేదీ శనివారం, థెస్సలోనికి ఓడరేవులో ఆల్ వర్కర్స్ మిలిటెంట్ ఫ్రంట్ (పీఏఎంఈ) ట్రేడ్ యూనియన్ల సామూహిక ర్యాలీ, ప్రదర్శన జరిగింది. గ్రీస్ ఓడరేవును నాటో స్థావరంగా మార్చినందున, సామ్రాజ్యవాద యుద్ధాల నుంచి వైదొలగాలని ఈ ర్యాలీ సందేశం పంపింది.

గ్రీస్ ప్రధాన మంత్రి కె. మిత్సోటాకిస్ థెస్సలోనికి అంతర్జాతీయ ప్రదర్శనలో మాట్లాడుతూ, ఈయూ ప్రజావ్యతిరేక చట్టాలు క్రమశిక్షణ, జాతీయ రుణాన్ని తిరిగి చెల్లించడంపై తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. కార్మిక వర్గానికి 'పన్ను మినహాయింపులు', 'ప్రయోజనాలు' పై హామీ ఇచ్చారు, వారిపై విధించిన ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు కనీస పరిహారం మాత్రమే అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ దీర్ఘకాలిక ప్రజా వ్యతిరేక చర్యలకు మేము ప్రతిస్పందిస్తామని తెలిపారు. వాటిలో ఇటీవలి నిర్ణయం 13 గంటల పని. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను మేము తిరస్కరిస్తున్నాం. తప్పుడు వాగ్దానా లను మేము తిరస్కరిస్తున్నాం. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాన్ని, ఈ కుళ్లిపోయిన రాజ్యాన్ని, వారి అవినీతి వ్యవస్థను తిప్పికొట్టడానికి మా పోరాటంపైన మాత్రమే మాకు నమ్మకం ఉందని తెలిపారు. ఆధునిక సమాజ బానిసల తరహాలో 13 గంటల పనిదినం, ప్రభుత్వ దీర్ఘకాలిక ప్రజా వ్యతిరేక చర్యలను మేము ప్రతిఘటిస్తామని అన్నారు. పీఏఎంఈ, కేకేఈ నేతృత్వంలోని పెట్టుబడిదారీ వ్యతిరేక, గుత్తాధిపత్య వ్యతిరేక కూటమితో, దీర్ఘకాలిక వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. వ్యాపారస్థులకు ముఖ్యంగా యుద్ధ ఆర్థిక వ్యవస్థ, ఆయుధాల నిధులపై ప్రయోజనాలు, 'సంస్కరణలు' కూడా ప్రధాన మంత్రి ప్రకటించారు. ప్రజలకు, ఇవన్నీ వారి పరిస్థితి మరింత దిగజారుతుం దని సూచిస్తున్నాయి. కార్మికులు, రైతులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు, యువకులు, మహిళలు ప్రజల జీవితాలను త్యాగంచేసే విధానాలకు వ్యతిరే కంగా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానానికి నిర్ణయాత్మకంగా స్పందించారు. ఆధునిక బానిసత్వానికి వ్యతిరేకంగా, అంటే ప్రభుత్వం ప్రవేశపెట్టిన 13 గంటల పని దినానికి వ్యతిరేకంగా, సెప్టెంబర్ చివరి నాటికి సమ్మె నిర్వహించడానికి కార్మిక సంఘాలు సిద్ధమవుతున్నాయి.

ఆగస్టు 26న ట్రేడ్ యూనియన్లు నిర్వహించిన సమావేశంలో యజమానుల లాభాలకు వ్యతిరేకంగా "13 గంటల పని దినాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రోజుకు "7 గంటలు, 5 రోజుల పనివారంతో పాటు కార్మికుల వేతన పెంపుదల అమలు చేయాలని జరిపిన ప్రదర్శనతో నగర వీధులు ప్రతిధ్వనిం చాయి. 13 గంటల పని దినం అనే కార్మిక వ్యతిరేక వికృత విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కార్మికులు, కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. అందరికీ స్థిరమైన ఉద్యోగాలు, 7 గంటలు, 5 రోజుల పనివారం, వేతనాలు, పెన్షన్ల పెంపుదల కోసం డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనకు పెద్ద కంపెనీలతో పోటీ పడటం కష్టంగా ఉన్నందున చిన్న, స్వయం ఉపాధి పొందుతున్న చేతివృత్తులవారు, వర్తకులు భారీగా తరలివచ్చారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై నిరసనలకు రైతులు, పశువుల పెంపకందారులు సంఘీభావం పలికారు. నిధుల కొరత, వాణిజ్యీకరణ కారణంగా తీవ్రమైన సమస్యలతో బాధపడుతున్న విశ్వవిద్యాలయ విద్యార్థులు కూడా ఆధునిక, ఉచిత విద్యను డిమాండ్ చేస్తూ ఈ ప్రదర్శనలో భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆధునిక మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల కొరత లేకుండా, అలసిపోయేలా కాకుండా విద్యను అందించే పాఠశాలలను డిమాండ్ చేస్తూ విద్యార్థులు వారితో చేరారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను మేము తిరస్కరిస్తున్నాం. ప్రజా వ్యతిరేక విధానాన్ని, ఈ కుళ్లిపోయిన రాజ్యాన్ని వారి అవినీతి వ్యవస్థను తిప్పికొట్టడానికి మా పోరాటంలో మాకు నమ్మకం ఉందని కార్మికులు విశ్వాసం వెలిబుచ్చారు.

(ఐడీ కమ్యూనిజం నుంచి)

గతి తప్పుతున్న విదేశాంగ విధానం

డాక్టర్ సి ఎన్ క్షేత్రపాల్ రెడ్డి

భారతదేశ విదేశాంగ విధానం ఎలా ఉండాలో మన రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశించింది. ఆర్టికల్ 51లో విదేశాంగ విధానంలో పాటించాల్సిన మౌలికమైన అంశాలు పొందుపర్చారు. అంతర్జాతీయంగా శాంతి భద్రతలను కాపాడుకోవడం, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడం, పంచశీల సూత్రాలు, వర్ణ వ్యవస్థ విధానాన్ని వ్యతిరేకించడం, అంతర్జాతీయ వివాదాల్లో శాంతియుతమైన, రాజకీయ పరిష్కారాలను అన్వేషించడం, అలీన విధానం అనేవి మన విదేశాంగంలో ప్రాధాన్యత కలిగిన అంశాలు. ఈ అంశాల ఆధారంగా అంతర్జాతీయంగా ప్రత్యేకతను పొందుతూ వచ్చిన భారత విదేశాంగ విధానం 11 ఏళ్ల మోదీ పాలనలో అష్టవంకర్లు తిరుగుతూ ఆ ప్రత్యేకతను కోల్పోతోంది. మోదీ పాలనలో హిందుత్వ శక్తులు దేశాన్ని సొంత సామ్రాజ్యంగా భావించడం మొదలు పెట్టేశాయి. ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై నుంచి ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను, భావాలను పొగిడారు. తాజాగా ఆర్ఎస్ఎస్ అధినేత జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని పత్రికలకు వ్యాసాలు కూడా రాశారు. నిజానికి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆర్ఎస్ఎస్ నిర్ణయాలను అమలుచేసే పనిలోనే బీజేపీ నిమగ్నమైంది. ఈ క్రమంలో అంతర్జాతీయ స్థాయిలో భారత్ వ్యవహరించాల్సిన తీరులోనూ అనేక మార్పులు మొదలయ్యాయి. దేశం తరఫున విదేశాలకు ప్రాతినిధ్యం వహించే దౌత్య వ్యవస్థ కూడా కాషాయీకరణకు గురవుతోంది.

బీజేపీ సిద్ధాంతకర్త దీనదయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలతో 2017లో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ సమగ్ర మానవతావాదం పేరుతో ఒక పుస్తకాన్ని రూపొందించడం విదేశాంగ విధానాన్ని ఆర్ఎస్ఎస్‌కు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నమే. రాజకీయాలతో సంబంధం లేకుండా నడవాల్సిన భారత విదేశాంగశాఖ అసాధారణ పద్ధతుల్లో పాలకుల ప్రభావానికి లోనవుతూ క్రమంగా హిందుత్వను మోసుకెళ్లే వాహకంగా మారినట్టు స్పష్టంగా కనిపిస్తోంది. విశ్వగురుగా అనుచరులచేత జేజేలు పలికించుకుంటూ, వ్యక్తిగత ప్రతిష్టను పెంపొందించుకునే ఆరాటం పాలకుల్లో ఎక్కువైంది. ఇందుకోసం దౌత్య వ్యవస్థల్లో ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన అధికారులతో నింపే ప్రయత్నాల్ని కూడా చేశారనే వాదనలు వచ్చాయి. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన లెక్చరర్ కిరా హుజు రెండేళ్ల కిందట విడుదల చేసిన ఒక అధ్యయనం ఈ వాదనలకు బలాన్నిచ్చింది. భారతదేశ దౌత్య వ్యవస్థలపై హిందూ జాతీయవాదం ప్రభావాన్ని తెలుసుకునేందుకు భారత విదేశాంగశాఖలో పనిచేస్తున్న అధికారులు, కొత్తగా చేరిన అధికారులు, పదవీ విరమణ పొందిన 85 మంది అధికారులతో ప్రైవేటుగా నిర్వహించిన ఇంటర్వ్యూల ఆధారంగా ఆ ముసాయిదా రూపొందించారు. భారత విదేశాంగంలో మైనారిటీలపై వ్యతిరేకతను పెంచేలా వివిధ కార్యక్రమాలు జరుగుతున్నట్టు ఆ నివేదిక వివరించింది. భారత రాయబార కార్యాలయాలు, హైకమిషన్ కార్యాలయాల నియామకాల్లో ఏరి కోరి నియమిస్తుండడం, వారు ఆర్ఎస్ఎస్ భావాలను తమ భుజాలపై మోసేవారే కావడం ఇందుకు కారణమని కిరా హుజు పేర్కొన్నారు. దౌత్యపరమైన అంశాల్లో కీలకమైన భాష విషయంలోనూ ప్రభుత్వం జోక్యం పెరిగినట్టు తెలిపారు. ఆంగ్లం స్థానంలో ఇప్పుడు హిందీకి ప్రోత్సాహం పెరుగుతున్నట్టు వివరించారు. దౌత్య విషయాల్లో అన్ని దేశాల్లోని రాయబారులు హిందీలోనే మాట్లాడవలసిన పరిస్థితి ఏర్పడినట్టు తెలిపారు. ప్రధాని మోదీ కూడా తన విదేశీ పర్యటనలలో భాగంగా హిందూ దేవాలయాల సందర్శనలు ఉండేలా చూసుకుంటున్నారు. వివిధ దేశాధినేతలకు ఇచ్చే బహుమతులు కూడా హిందూత్వను సూచించేవిగానే

ఉంటున్నాయని ఆ నివేదికలో ఉంది. మన విదేశాంగ విధానానికి పంచశీల పునాది. విదేశాలకు సంబంధించిన అంతర్గత వ్యవహారాల్లో మన పాలకుల జోక్యం ఉండకూడదనే నియమం పంచశీలలోని ఐదు సూత్రాల్లో అత్యంత ప్రధానమైంది. విదేశాల్లో జరిగే ఎన్నికలకు మన దేశానికి సంబంధం ఉండదు. ఈ విషయాన్ని మోదీ లెక్కచేయలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆ దేశానికి అధ్యక్షుడిగా మరోసారి ఎన్నుకోవాలని కోరుతూ ఆబ్ కీ బార్ ట్రంప్ సర్కార్ అంటూ అమెరికాలో ఎన్నికల ప్రచారం నిర్వహించడం పంచశీలను ఉల్లంఘించడమే అవుతుంది. మోదీతో కలసి అమెరికా అధ్యక్షుడు మన దేశంలోకి వచ్చి హౌడీ మోదీ అంటూ ఒక కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ట్రంప్ కోసం మోదీ, మోదీ కోసం ట్రంప్ పరితపించిన ఈ తరుణంలోనే కరోనా నివారణలో కీలకమైనదిగా ప్రచారంలోకి వచ్చిన పారాసెటమాల్ మాత్రలను తమ దేశానికి ఎగుమతి చేయకపోతే భారతదేశం కథ తేలుస్తానంటూ ట్రంప్ విపరీత వ్యాఖ్యలే చేశారు. ఇటీవల పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రమూక పహల్గాంలో జరిపిన మారణహోమం నేపథ్యంలోనూ భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపేశానని పదేపదే అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు, వాటిని ఖండించలేక మోదీ పాటించిన మౌనం వంటి అంశాలు మన దేశ అంతర్గత వ్యవహారాల్లోకి విదేశీ శక్తులకు అవకాశం ఇవ్వడమే అవుతుంది. ఈ అంశాలన్నిటినీ పంచశీల ఉల్లంఘన కిందనే చూడవలసి ఉంటుంది. ఇక అలీన విధానానికి సంబంధించిన మన దేశం ప్రధానమైన ఏ కూటములతోనూ ప్రత్యక్షంగా జతకట్టకూడదని నిర్దేశిస్తుంది. అయితే మోదీ పాలనలోని విదేశాంగ విధానం తీరును గమనిస్తే సామ్రాజ్యవాద నాటో కూటమికి దగ్గరగా మెలుగుతున్నదనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

పలస్తీనా పట్ల, ఆ దేశ మూలవాసుల పక్షాన నిలుస్తూ అనేక దశాబ్దాలుగా అనుసరించిన భారత విదేశాంగ విధానానికి భిన్నంగా మోదీ ప్రభుత్వం వ్యవహరించింది. అనాదిగా పలస్తీనా ప్రజల హక్కులకు అనుకూలంగా, ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా వ్యవహరించిన భారతదేశ విదేశాంగ విధానం నేడు దురాక్రమణదారు అయిన ఇజ్రాయిల్‌కు అనుకూలంగా మారిపోయింది. ఏ దేశమైనా దురాక్రమణలకు పాల్పడితే దాన్ని ఖండించడం, భాధితుల పక్షాన నిలవడం మన విదేశాంగ విధానం ప్రాథమిక లక్షణం. దీన్ని మోదీ ప్రభుత్వం పెడచెవినపెట్టింది. ఇందుకు గల కారణాల్లో ఒకటి ముస్లిం మైనారిటీలపై పాలక పక్షానికి ఉన్న వ్యతిరేకత అని సులభంగానే అర్థమవుతోంది. మరోవైపు ఆర్థిక కోణం వెలుగులోకి వచ్చింది. తన అనుంగు మిత్రుడైన అదానీకి ఇజ్రాయిల్‌లో కీలకమైన హైఫా పోర్టు దక్కడం కోసం ఆ దేశంలో మోదీ స్వయంగా పర్యటించారనే ఆరోపణలు వచ్చాయి. అదానీ వ్యాపార సామ్రాజ్య విస్తరణ కోసం పలస్తీనా ప్రజల పక్షం కాకుండా ఇజ్రాయిల్ పాలకుల పక్షం వహిస్తున్నారనే వాదనలూ ఉన్నాయి. పహల్గాం ఉగ్రచర్యపై ఇరాన్ మన దేశానికి సానుభూతి ప్రకటించింది. అయితే అదే ఇరాన్‌పై ఇజ్రాయిల్ చేసిన అమానుషదాడి విషయంలోనూ మోదీ ప్రభుత్వం నోరు మెదపలేదు. పైగా సంఘ్ శక్తులు ఇజ్రాయిల్‌కు అనుకూలంగా మాట్లాడాయి. 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' నినాదంతో ట్రంప్ చేస్తున్న టారిఫ్ యుద్ధం విషయంలో మన దేశం స్వతంత్రంగా వ్యవహరించలేకపోతున్నది. అమెరికాలోకి ప్రవేశించిన అక్రమ వలసదారులను సంకెళ్లువేసి సైనిక విమానాలలో తరలించటంపై చిన్న చిన్న దేశాలు సైతం గళమెత్తినా మన ప్రభుత్వం స్పందించలేదు. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ కంపెనీల్లో భారతీయ టెకీలను ఉద్యోగులుగా నియమించవద్దని ట్రంప్ అంటున్నా ఒక్క మాట మాట్లాడే స్థితి లేకుండా పోయింది. ప్రపంచ వ్యాప్తంగా డాలర్ ఆధిపత్యంపై పోరాటం సాగుతుంటే మన విదేశాంగ మంత్రి పతనమవుతున్న డాలరుకు అనుగుణంగా మాట్లాడారు. 2025 ఆగస్టు 1 నుంచి మన దేశ ఉత్పత్తులపై 25 శాతం అదనపు సుంకం అమలులోకి వచ్చింది. దాంతో పాటు రష్యాతో వాణిజ్య కార్యకలాపాలు కొనసాగిస్తున్నందుకు మరో 25 శాతం జరిమానా విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడం మన దేశ విదేశాంగ విధాన వైఫల్యమే. అమెరికా బెదిరింపులకు తలొగ్గుతున్నారనే వాదనలకు బలం చేకూరడంతో తప్పనిసరి పరిస్థితిలో అమెరికా ఆంక్షలను తాను లెక్కచేయడం లేదని నిరూపించుకోవడంకోసం ఇటీవలే మోదీ చైనాలో పర్యటించినా ఇప్పటికీ అనేక అనుమానాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. ఒకవైపు రష్యా-చైనాతో వివిధ ఒప్పందాలు చేసుకుంటూనే మన తప్పులేకున్నా అమెరికాకు కోపం రాకుండా అమెరికా-భారత్ సంబంధాలు ప్రత్యేకమైనవని, వ్యూహాత్మకమైనవని పేర్కొంటూ మన విదేశాంగశాఖ ప్రకటనలు చేస్తున్నది. ఇవన్నీ మన విదేశాంగ విధానంలోని లొంగుబాటు ధోరణులే.

సరిహద్దు దేశాలతో అనేక దశాబ్దాలుగా ఉన్న స్నేహ సంబంధాలు కూడా మోదీ పాలనలో దెబ్బతింటున్నాయి. రాజకీయ వైరం, సరిహద్దు వివాదాలు తలెత్తి వైరి పక్షాలకు దగ్గరగా జరుగుతున్నాయి. మోదీ పాలనకు ముందు పాకిస్థాన్‌తో తప్ప సరిహద్దు దేశాలతో స్నేహ సంబంధాలు కొనసాగాయి. ఇప్పుడు ఆ పరిస్థితి చేజారి వివిధ దేశాలు మనకు దూరం జరుగుతున్నాయి. గల్వాన్ లోయలో చోటు చేసుకున్న ఘర్షణ అనంతరం చైనాతో సంబంధాలు దెబ్బతిన్నాయి. పాకిస్థాన్ నిత్యం తీవ్రవాదులను ప్రోత్సహిస్తూ దేశ భద్రతకు సవాలు విసురుతున్నది. బంగ్లాదేశ్ ఏర్పాటైనప్పటి నుంచి ఉన్న స్నేహసంబంధాలు ఇటీవలి కాలంలో దెబ్బతిన్నాయి. బంగ్లాదేశ్‌లో జరిగిన పౌర, సైనిక తిరుగుబాటులో పదవి కోల్పోయిన షేక్ హసీనా మన దేశంలో ఆశ్రయం పొందటం వివాదాస్పదమైంది. నేపాల్ కూడా చైనాకు దగ్గర అవుతోంది. అసుర కుమార దిశనాయకే నాయకత్వంలోని శ్రీలంక ప్రభుత్వం కూడా భారత్ పట్ల వ్యూహాత్మకంగా దూరంగానే ఉంటూ చైనాకు దగ్గరవుతోంది. మాల్దీవులలో పర్యాటకం వద్దని సంఘ్‌పరివార్ చేసిన హడావిడి కారణంగా అక్కడ కూడా భారత వ్యతిరేక ప్రభుత్వమే కొలువుదీరింది. ఈ పరిణామాలన్నీ మన గతి తప్పిన విదేశాంగ విధానాన్ని బహిర్గతం చేస్తున్న క్రమంలో జరిగే నష్టాలను గ్రహించి పాలకులు దిద్దుబాటు చర్యలు చేపడతారని ఆశిద్దాం.

సెల్ : 9059837847

70శాతం విద్యార్థులు ప్రైవేట్ బడుల్లోనే...!

ఎం. మురళీకృష్ణ

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడిచినా ఉన్నత విద్య చాలా మందికి అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. దేశంలో ఉన్నత విద్యకు దూరమవుతున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రాథమిక దశలో వికాస దీపం వెలిగించి, అనంతర కాలంలో ఆ కాంతుల్ని దేదీప్యమానం చేస్తూ-విజ్ఞానఖనుల్ని, ప్రయోగశీలుర్ని అవతరింప జేయడమే విద్య మౌలిక లక్ష్యం. విజ్ఞానం కోసం పెట్టే పెట్టుబడి ఎప్పటికీ సత్ఫలితాలు అందిస్తుందనేది అక్షరసత్యం. దేశీయంగా అది సక్రమంగా నెరవేరుతోందా? ఈ ప్రశ్నకు సమాధానం బహిరంగ రహస్యమే! ఈ పెట్టుబడి నేడు మన దేశంలో పిల్లలను ధనార్జన యంత్రాలుగా మార్చేస్తోంది తప్ప విజ్ఞానధనులుగా తీర్చిదిద్దలేక పోతున్నదనేది వాస్తవం. దేశంలో నేడు విద్య ప్రైవేటీకరణ వైపు వేగంగా కదులుతోంది. విద్యాబోధనను వ్యాపారంగా మార్చేసిన విద్యా సంస్థల యాజమాన్యాల ధోరణే దీనికి ప్రధాన కారణం. నేడు పట్టణ ప్రాంతాలలో 70 శాతం విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. పట్టణ ప్రాంతాలలో విద్యార్థి సగటు వ్యయం గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థిపై పెడుతున్న సగటు వ్యయంకన్నా మూడు రెట్లు ఎక్కువ. పట్టణ ప్రాంతాలలో ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభంలో దాదాపు 30.1% మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరగా, 70.0% మంది ప్రైవేట్ పాఠశాలల్లో చేరారు. గ్రామీణ ప్రాంతాలలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 66శాతం మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 33.9శాతం మంది చదువుతున్నారు.

విద్య: సమగ్ర మాడ్యులర్ (సీఎంఎస్;ఇ)పై ఈ ఏడాది ఏప్రిల్ - జూన్ నెలల్లో నిర్వహించిన 80వ రౌండ్‌లోని సర్వే ఆధారంగా రూపొందించిన నివేదిక, పట్టణ ప్రాంతాల్లో ఒక్కో విద్యార్థికి విద్య ఖర్చులు గ్రామీణ ప్రాంతాల్లో ఖర్చు కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువగా ఉన్నాయని కనుగొంది, ఇది సార్వత్రిక, సమాన నాణ్యమైన విద్యను పొందడంలో గొప్ప అసమానతను చూపిస్తోంది. గ్రామీణ భారతదేశంలో పాఠశాల విద్యపై సగటున ఒక్కో విద్యార్థి ఖర్చు రూ. 8,382గా, పట్టణ ప్రాంతాలలో రూ. 23,470గా అంచనా వేసినట్టు సర్వే నివేదిక పేర్కొంది, అన్ని స్థాయిల నమోదు, అన్ని రకాల పాఠశాలలకు ఇది వర్తిస్తుంది.

గ్రామీణ భారతదేశంలో, ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాల విద్య కోసం ఒక్కో విద్యార్థి సగటు ఖర్చు ప్రభుత్వ పాఠశాలల్లో రూ.2,639 ఉండగా, ప్రభుత్వేతర పాఠశాలల్లో రూ.19,554గా అంచనా వేశారు. పట్టణ ప్రాంతాలలో ప్రభుత్వ పాఠశాలలకు రూ.4,128, ప్రభుత్వేతర పాఠశాలలకు రూ.31,782గా అంచనా వేశారు. పట్టణ ప్రాంతాలలో ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు జోరుగా సాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో పాఠశాల విద్యలో చేరిన దాదాపు 25.5% మంది విద్యార్థులు ప్రస్తుత



విద్యా సంవత్సరంలో ప్రైవేట్ కోచింగ్ కొందరు తీసుకోగా మరికొందరు తీపుకుంటున్నట్లుగా ఆ నివేదిక తెలిపింది. పట్టణ ప్రాంతాలలో ఈ అంచనా 30.7%గా ఉంది. ప్రైవేట్ కోచింగ్ తీసుకునే విద్యార్థుల అఖిల భారత సగటు 27 శాతం. హయ్యర్ సెకండరీలో దాదాపు 37 శాతం మంది విద్యార్థులు, సెకండరీలో 37.8 శాతం మంది, మాధ్యమిక విద్యలో 29.6 శాతం మంది, ప్రాథమిక విద్యలో 22.9 శాతం మంది, ప్రీ-ప్రైమరీ స్థాయిలో 11.6 శాతం మంది విద్యార్థులు ప్రైవేట్ ట్యూషన్ లేదా కోచింగ్ తీసుకుంటున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రైవేట్ కోచింగ్ కోసం ఒక్కో విద్యార్థి సగటు ఖర్చు రూ.2,409గా అంచనా వేశారు. విద్యార్థి, విద్యార్థినీలకు సంబంధించి సగటున ఒక్కొక్క విద్యార్థికి అయ్యే ఖర్చు వరుసగా రూ.2,572, రూ.2,227గా అంచనా వేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రైవేట్ కోచింగ్ ఖర్చు మధ్య కూడా భారీ వ్యత్యాసం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేట్ కోచింగ్ సగటు ఖర్చు రూ.1793 కాగా, పట్టణ ప్రాంతాల్లో ఇది రెండింతలు ఎక్కువగా రూ.3,988గా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ కోచింగ్‌కు రూ. 4548 ఖర్చు చేస్తుండగా, పట్టణ ప్రాంతాల్లో ఖర్చు రూ. 9950గా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో సెకండరీ విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి రూ.3159, మాధ్యమిక విద్యకు రూ.1745, ప్రైమరీకి రూ.1039, ప్రీ-ప్రైమరీకి రూ.420 ఖర్చు చేశారు. పట్టణ ప్రాంతాల్లో సెకండరీ స్థాయి విద్యార్థులు రూ.6585, మిడిల్‌కు రూ.3326, ప్రైమరీ 2108, ప్రీ-ప్రైమరీకి రూ.783 ఖర్చు చేశారు. విద్య కోసం మీరు పెట్టే ఖర్చుకు ఆదాయం ఏ మార్గాన వస్తోందని ప్రశ్నించగా దాదాపు 95% మంది విద్యార్థులు తమ విద్యా ఖర్చులకు 'ఇతర కుటుంబ సభ్యుల నుంచి నిధులు' పొందడం మొదటి ప్రధాన వనరు అని చెప్పారు. ఇందుకు సంబంధించి దాదాపు 91.3 శాతం మంది (పట్టణ ప్రాంతాలలో 92.3 శాతం మంది, గ్రామీణ ప్రాంతాలలో 91 శాతం మంది) ఒకే విధమైన సమాధానం చెప్పారు. జులై 2017 నుంచి జూన్ 2018 వరకు ఎన్ఎస్ఎస్ 75వ రౌండ్ సందర్భంగా చివరిసారిగా ఇటువంటి సర్వే నిర్వహించారు. ఈ సర్వేకు "గృహ సామాజిక వినియోగం: విద్య" అని పేరు పెట్టారు. 2017-18, 2025 మధ్య దేశ విద్యా వ్యవస్థలో అసమానత, స్తోమతపరంగా క్షీణత స్పష్టంగా కనిపిస్తోంది. ప్రైవేట్ పాఠశాలల ఆధిపత్యంతో ప్రభుత్వ పాఠశాలలు శరవేగంగా మారుతున్నాయి. 2017-18లో గ్రామీణ ప్రాంతాల్లో, ప్రీ-ప్రైమరీ స్థాయిలో 44.2%, ప్రాథమిక స్థాయిలో 73.7%, ఉన్నత ప్రాథమిక/మధ్య స్థాయిలో 76.1%, మాధ్యమిక, ఉన్నత మాధ్యమిక స్థాయిలో 68.0%, గ్రాడ్యుయేట్ అంతకంటే ఎక్కువ స్థాయిలో 49.7% మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకున్నారు. పట్టణ ప్రాంతాల్లో, ప్రీ-ప్రైమరీ స్థాయిలో 13.9%, ప్రాథమిక స్థాయిలో 30.9%, ఉన్నత ప్రాథమిక స్థాయిలో 38.0%, మాధ్యమిక, ఉన్నత మాధ్యమిక స్థాయిలో 38.9%, గ్రాడ్యుయేట్ అంతకంటే ఎక్కువ స్థాయిలలో 41.0% మంది ప్రభుత్వ సంస్థలలో చదువుతున్నారు. ఉచిత విద్య పొందుతున్న విద్యార్థుల శాతం 2017-18 నుంచి బాగా తగ్గింది. ఆ సమయంలో భారతదేశంలో ప్రీ-ప్రైమరీ స్థాయిలో దాదాపు 33% మంది విద్యార్థులు (గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 44%, పట్టణ ప్రాంతాల్లో 14%) ఉచిత విద్యను పొందుతున్నారు. ప్రాథమిక స్థాయిలో, ఉచిత విద్యను పొందుతున్న విద్యార్థుల నిష్పత్తి 62% (గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 72%, పట్టణ ప్రాంతాల్లో 31%). ఉన్నత ప్రాథమిక/మధ్యస్థ స్థాయిలో, గ్రామీణ ప్రాంతాల నుంచి 72%, పట్టణ ప్రాంతాల నుంచి 36% విద్యార్థులు ఉచిత విద్యను పొందుతున్నారు. సెకండరీ స్థాయిలో, ఉచిత విద్య పొందుతున్న విద్యార్థుల నిష్పత్తి గ్రామీణ ప్రాంతాల్లో 46%, పట్టణ ప్రాంతాల్లో 25%. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ నిష్పత్తి వరుసగా 26%, ఉన్నత మాధ్యమిక స్థాయిలో 14%గా ఉంది. ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థులలో 77% మంది ఉచిత విద్యను పొందుతున్నారు (గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 81%, పట్టణ ప్రాంతాల్లో 62%). ప్రైవేట్ అన్ఎయిడెడ్ సంస్థలలో చదువుతున్న, ఉచిత విద్య పొందుతున్న విద్యార్థుల శాతం గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 2%, పట్టణ ప్రాంతాల్లో 1%. ప్రస్తుత సర్వేలో ఒక్కో విద్యార్థికి విద్యా వ్యయంలో పెరుగుదల కనిపించింది.

ప్రైవేట్ కోచింగ్ విషయానికొస్తే, 2017-18లో భారతదేశంలో దాదాపు 20% మంది విద్యార్థులు ప్రీ-ప్రైమరీ, అంతకంటే ఎక్కువ స్థాయికి (21% బాలురు, 19% బాలికలు) ప్రైవేట్ కోచింగ్ తీసుకుంటున్నారు. ప్రైవేట్ కోచింగ్ తీసుకునే సంఘటనలు సెకండరీ స్థాయిలో గరిష్ఠంగా ఉన్నాయి (31% బాలురు, 29% బాలికలు). 2017-18 విద్యా సంవత్సరం నుంచే దేశంలో ప్రైవేట్ కోచింగ్ పెరిగింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులు , పేద, ధనిక కుటుంబాల మధ్య విద్యలో అసమానతలు పెరుగుతున్నాయని పాలకులు తక్షణమే ఈ అంశంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ప్రస్తుత సర్వే స్పష్టంగా సూచించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నాణ్యతను తక్షణమే మెరుగుపరచాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

ముస్లింలు భారత్‌లో ఉండటమే బీజేపీకి సమస్య: ఒవైసీ

గువహతి: అస్సోం ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అస్సోం అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ విడుదల చేసిన ఒక ఏఐ వీడియోపై హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ పాలన లేకపోతే అస్సోం ముస్లింలు అధికంగా ఉండే రాష్ట్రంగా మారిపోతుందని ఈ వీడియోలో చూపించగా... దీనిపై అసద్ స్పందిస్తూ.. ఇది కేవలం ఓట్ల కోసం చేస్తున్న భయపెట్టే ప్రచారం మాత్రమే కాదని బీజేపీ అసలైన హిందూత్వ భావజాలం ఇదేనని అన్నారు. 'భారతదేశంలో ముస్లింలు ఉండడమే వారికి సమస్య. ముస్లిం-ముక్త్ భారత్ వారి కల. ఈ నిరంతర విమర్శలు, ఏడుపు తప్ప దేశం కోసం వారికి అభివృద్ధి పట్టదు' అని ఒవైసీ పేర్కొన్నారు. ఈ వీడియో సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉందని, ఇలాంటి చర్యలను ఖండించాలని ఒవైసీ పిలుపునిచ్చారు. ఈ వీడియోపై ఇప్పటికే బాలీవుడ్ నటి శ్రేయా ధన్వంతరితో పాటు పలువురు ప్రముఖులు విమర్శలు గుప్పించారు.

బీహార్‌పై కాంగ్రెస్ కన్ను

- 24న పట్నాలో సీడబ్ల్యూసీ భేటీ
- అసెంబ్లీ ఎన్నికల వేళ కీలక నిర్ణయాలకు అవకాశం

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో అధికారం చేపడితే... కేంద్రంలో అధికారాన్ని సులువుగా హస్తగతం చేసుకోవచ్చన్న ప్రచారం రాజకీయవర్గాల్లో చాలాకాలంగా ఉంది. మరి కొద్ది నెలల్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో ఈ రాష్ట్రంలో విజయం సాధించేందుకు అధికార ఎన్డీఏ కూటమి, కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా ఐక్యసంఘటన వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. దీంతో బీహార్ కేంద్రంగా కేంద్రంలోని మోదీ సర్కార్ కోట్లాది రూపాయిల విలువైన పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఇప్పటికే శ్రీకారం చుట్టింది. ఇక ప్రతిపక్ష కాంగ్రెస్ సైతం తనదైన శైలిలో ముందుకు వెళ్తోంది. ఆ క్రమంలో అగ్రనేత రాహుల్ గాంధీ సూచన మేరకు బీహార్ రాజధాని పట్నా వేదికగా సెప్టెంబర్ 24వ తేదీన విస్తృత స్థాయి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆ పార్టీ ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీతోపాటు ఆ పార్టీ భాగస్వామ్య పక్షాలకు చెందిన నేతలు, కార్యకర్తలు, శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం నెలకొల్పేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ సీడబ్ల్యూసీ సమావేశం వేదికగా కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ విస్తృత సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు, సీఎల్పీ నేతలతోపాటు పీసీసీ అధ్యక్షులు పాల్గొననున్నారు. అదీకాక ఈ ఏడాది ఆగస్ట్ 17వ తేదీన ససారంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటర్ అధికార్ యాత్రను చేపట్టారు. ఈ యాత్ర సెప్టెంబర్ 1వ తేదీన బీహార్ రాజధాని పట్నాలో ముగిసింది. దాదాపు 25 జిల్లాల్లో ఈ యాత్ర సాగిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేపట్టిన ఈ యాత్రకు బీహార్ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. దీంతో బీహార్‌లో కాంగ్రెస్ పార్టీకి దూసుకు పోతుందనేందుకు ఈ యాత్రకు జనం నుంచి లభించిన విశేష స్పందనే కారణమనే ఒక చర్చ సైతం కొనసాగుతోంది. మరోవైపు ఏప్రిల్ 17 వ తేదీ పట్నాలో జరిగిన సమావేశంలో బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఇండియా ఐక్యసంఘటన సమన్వయ కర్తగా రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) అగ్రనేత తేజస్వీ యాదవ్ నియామితులయ్యారు.

కాంగ్రెస్‌పై పట్నా హైకోర్టు తీవ్ర ఆగ్రహం

ప్రధాని మోదీ తల్లి ఏఐ వీడియో తొలగించాలని ఆదేశం

పట్నా: ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన దివంగత తల్లి హీరాబెన్‌కు సంబంధించిన ఏఐ ఆధారిత వీడియో వివాదంలో బీహార్ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ వీడియోపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన పట్నా హైకోర్టు, రాజకీయాల్లో ఇలాంటివి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కావని స్పష్టం చేసింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల నుంచి ఆ వీడియోను తక్షణమే తొలగించాలని బుధవారం కాంగ్రెస్ పార్టీని ఆదేశించింది. బీహార్ కాంగ్రెస్ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఇటీవల ఒక వివాదాస్పద వీడియోను పంచుకుంది. అందులో ప్రధాని మోదీ కలలోకి ఆయన తల్లి వచ్చినట్లు, ఆయనతో మాట్లాడుతున్నట్లు ఏఐ సాంకేతికతతో సృష్టించారు. ఈ వీడియో బయటకు రావడంతో రాజకీయంగా పెద్ద దుమారం రేగింది. ఇది ప్రధానిని, ఆయన తల్లిని అవమానించడమేనని, రాజకీయ గౌరవానికి ఇది విరుద్ధమని బీజేపీ, ఎన్డీయే మిత్రపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించిన పట్నా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.బి. బజంత్రీ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. రాజకీయ చర్చల్లో ఇలాంటి వీడియోలు తగవని వ్యాఖ్యానిస్తూ, ఇంటర్నెట్ నుంచి పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు కోర్టు నుంచి ఈ ఆదేశాలు రావడం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారింది. హైకోర్టు తీర్పును బీజేపీ నేతలు స్వాగతించారు. ఈ ఆదేశాలపై కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

స్వదేశీ వస్తువులనే వినియోగించండి

దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు

భోపాల్: స్వదేశీ వస్తువులనే వినియోగించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఇది పండుగల కాలమని, స్వదేశీ మంత్రాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. దానిని మన జీవితాల్లో చేర్చుకోవాలని చెప్పారు. "మీరు ఏది కొనుగోలు చేసినా, అది మన దేశంలోనే తయారు చేసి ఉండాలి. ఎవరైనా భారతీయుల చెమటను భరించాలి అని నా 140 కోట్ల మంది తోటి దేశస్థులకు నేను వినయంగా అభ్యర్థిస్తున్నాను. అది నా భారతదేశ నేల పరిమళాన్ని కలిగి ఉండాలి" అని మోదీ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభలో బుధవారం ఆయన మాట్లాడారు. భారతదేశంలోని కోట్లాది మంది తల్లులు, సోదరీమణులు ఈ రోజు పుట్టినరోజు సందర్భంగా తనను ఆశీర్వదించారని చెప్పారు. అందుకు తానేంతో కృతజ్ఞుడినన్నారు.

నిజాం పాలనలో దారుణాలు

హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలన సమయంలో అనేక దారుణాలు జరిగాయని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. "1948లో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉక్కు సంకల్పాన్ని దేటశం చూసింది. ఎంతో ధైర్య సాహసాలు చూపించి హైదరాబాద్‌ను దేశంలో విలీనం చేశారు. దీంతో నిజాం అకృత్యాల నుంచి సంస్థానానికి విముక్తి లభించింది. భారతదేశ గౌరవం తిరిగి నిలబెట్టింది. దీనికి గుర్తుగా హైదరాబాద్ విమోచన దినం నిర్వహిస్తున్నాం. అక్కడ గొప్ప వేడుకలు జరుగుతున్నాయి. దేశ ఐక్యత కోసం మన సైనికులు అనేక త్యాగాలు చేశారు. అణు ముప్పులకు నవ భారతం భయపడదు" అని మోదీ తెలిపారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సైనికుల ధైర్యసాహసాల గురించి కూడా ప్రధాని మాట్లాడారు. "భారతమాత భద్రత దేశ అత్యున్నత ప్రాధాన్యం. పాకిస్థాన్ నుంచి వచ్చిన ఉగ్రవాదులు మన కుమార్తెలు, సోదరీమణుల గౌరవాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా స్పందిస్తూ, మేము ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ధ్వంసం చేశాం. అనేక మంది ఉగ్రవాదులను మట్టుబెట్టాం" అని మోదీ తెలిపారు. మన సైనికులు పాక్‌ను మోకాళ్లపైకి తెచ్చారని చెప్పారు.

తొలి పీఎం పార్క్‌కు శంకుస్థాపన

అంతకుముందు దేశంలోని మొట్టమొదటి ప్రధాన మంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అప్పారెల్ (పీఎం మిత్రా) పార్క్‌కు మోదీ శంకుస్థాపన చేశారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్, రాష్ట్రీయ పోషణ్ మాహ్ ప్రచారాలను కూడా ప్రారంభించారు. మధ్యప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్రలోని ఏడు ప్రదేశాలలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, సౌకర్యాలతో పెద్ద ఎత్తున వస్త్ర తయారీ కేంద్రాలను స్థాపించడానికి కేంద్రం పీఎం మిత్రా పథకాన్ని ప్రారంభించింది. ధార్ జిల్లాలోని భైన్సోలా గ్రామంలో దాదాపు 2,158 ఎకరాల్లో పీఎం మిత్రా పార్క్ నిర్మాణం జరుగుతోంది.

మూడు వారాల్లోగా చర్యలు...

వారిని జైలుకు పంపండి

వాయు కాలుష్యంపై సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ: శీతాకాలం ప్రారంభానికి ముందు వాయు కాలుష్యాన్ని నివారించడానికి మూడు వారాల్లోగా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి ఒక ప్రణాళికను రూపొందించాలని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సీఏక్యూఎం) సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సీపీసీబీ) రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డులకు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం కాలుష్య నియంత్రణ బోర్డుల్లో ఖాళీల గురించి రాష్ట్రాలను ప్రశ్నించింది. ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో మూడు నెలల్లోగా ఖాళీలను భర్తీ చేయాలని ఆదేశించింది. పోస్టులను భర్తీ చేయడానికి మరో ఆరు నెలల సమయం ఇచ్చింది. సీఏక్యూఎం అనేది కేంద్రం ఏర్పాటు చేసిన చట్టబద్ధమైన సంస్థ. దీని ప్రధాన లక్ష్యం జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్), దాని పరిసర ప్రాంతాలలో వాయు నాణ్యతను మెరుగుపరచడం. అందులో పంజాబ్, హర్యానా, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. అయితే రెండు సంస్థల్లోని ఖాళీలను భర్తీ చేయడానికి సంబంధించి సుమోటో పిటిషన్‌ను ధర్మాసనం తాజాగా విచారించింది. అక్టోబర్ 8వ తేదీకి విచారణను వాయిదా వేసింది. కాలుష్య నియంత్రణ బోర్డులలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేయడంలో విఫలమైనందుకు రాష్ట్రాలను కోర్టు తీవ్రంగా విమర్శించింది. కాలుష్యం తీవ్రతరం అయ్యే సీజన్లలో తగినంత ఉద్యోగులు లేకపోవడం పర్యావరణ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తుందని అభిప్రాయపడింది.

కొందరిని జైలుకు పంపితేనే మార్పు సాధ్యం

మరోవైపు, పంట వ్యర్థాల దహనంపై దాఖలైన పిటిషన్లపై కూడా మరోసారి విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దీనికి పాల్పడుతున్న కొంతమందిని జైలుకు పంపితేనే మిగతా వారికి గట్టి సందేశం ఇచ్చినట్లవుతుందని వ్యాఖ్యానించింది. పంట వ్యర్థాలను తగలబెట్టకుండా ఉండేందుకు రైతులకు సబ్సిడీలు, వివిధ పరికరాలు అందిస్తున్నట్లు అమికస్ క్యూరీ అపరాజిత సింగ్ తెలిపారు. అయినప్పటికీ ఉపగ్రహాలు ఆయా ప్రాంతాల మీదుగా వెళ్లే సమయంలో కాకుండా మిగిలిన సమయాల్లో పంట వ్యర్థాలను కాల్చుకోవచ్చని అధికారులు తమకు చెప్పారనే కథనే రైతులు మళ్లీ మళ్లీ చెప్తున్నారని న్యాయస్థానానికి వెల్లడించారు. అయితే సమస్యను పరిష్కరించడానికి అధికారులు రైతులకు శిక్ష, జరిమానా విధించాలనే కోణంలో ఎందుకు ఆలోచించట్లేదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

రైతులు అన్నం పెడుతున్నారు కాబట్టి వారు అందరికీ ప్రత్యేకమైనవారని కోర్టు తెలిపింది. అలా అని పర్యావరణాన్ని పాడు చేస్తుంటే చూస్తూ ఊరుకోలేం కదా అని వ్యాఖ్యానించింది. అందుకే కొంతమందిని అయినా జైలుకు పంపితేనే మిగతా వారికి గట్టి సందేశం ఇచ్చినట్లవుతుందని తెలిపింది. పర్యావరణాన్ని కాపాడాలనే నిజమైన ఉద్దేశం మీకు ఉంటే ఇటువంటి చర్యలకు ఎందుకు దూరంగా ఉంటారని ప్రశ్నించింది. కాగా, దేశ రాజధాని దిల్లీలో శీతాకాలంలో కొన్ని ఏళ్లుగా గాలి నాణ్యత దారుణంగా పడిపోతోంది. దీనికి పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాల దహనమే ప్రధాన కారణంగా మారుతోంది.

చోటారాజన్ బెయిల్ రద్దు

న్యూఢిల్లీ: గ్యాంగ్‌స్టర్ చోటారాజన్‌కు 2001లో జరిగిన జయశెట్టి హత్య కేసులో ముంబై హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. బుధవారం ఈ మేరకు కీలక తీర్పు వెలువరించింది. హోటల్ వ్యాపారి జయశెట్టి హత్యకు సంబంధించిన కేసులో గత ఏడాది మేలో ప్రత్యేక కోర్టు చోటా రాజన్‌ను దోషిగా నిర్ధారిస్తూ... జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును ముంబై హైకోర్టులో చోటారాజన్ సవాల్ చేశారు. 2024 అక్టోబర్ 23న ముంబై హైకోర్టు చోటారాజన్ విధించిన శిక్షను సస్పెండ్ చేస్తూ బెయిలు మంజూరు చేసింది. అయితే ఈ నిర్ణయాన్ని సీబీఐ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, సందీప్ మెహతాలతో కూడిన డివిజన్ బెంచ్ దీనిపై విచారణ జరిపింది. 'చోటారాజన్ నాలుగు కేసుల్లో దోషిగా ఉన్నప్పుడు అలాంటి వ్యక్తికి విధించిన జైలుశిక్షను ఏ విధంగా రద్దు చేస్తారు?' అని ధర్మాసనం ఈ సందర్భంగా ప్రశ్నించింది. హైకోర్టు ఉత్తర్వును రద్దు చేసింది. చోటారాజన్‌పై ఉన్న 71 కేసుల్లో 47 కేసుల్లో సీబీఐ దగ్గర ఎలాంటి సాక్ష్యాలు లేవని రాజన్ తరఫు న్యాయవాది వాదించగా... అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఇతర కేసుల్లో ఇప్పటికే జీవిత ఖైదు పడినందున తిరిగి అతను లొంగిపోవాల్సిన అవసరం లేదని పేర్కొంది.

హత్యకు ముందు బెదిరింపులు

ప్రాసిక్యూషన్ వాదన ప్రకారం, దక్షిణ ముంబైలోని గోల్డెన్ క్రౌన్ హోటల్ యజమాని జయశెట్టికి చోటారాజన్ ముఠా నుంచి బలవంతపు వసూళ్ల బెదిరింపులు వచ్చాయి. శెట్టికి పోలీసు రక్షణ కల్పించినప్పటికీ అతని హత్యకు రెండు నెలల ముందు భద్రతను ఉపసంహరించారు. రూ.50,000 ఇవ్వాలన్న చోటారాజన్ గ్యాంగ్ డిమాండ్‌ను కాదన్నందుకు 2001 మే 4న జయశెట్టిని అతని కార్యాలయం వెలుపల ఇద్దరు ముఠా సభ్యులు కాల్చిచంపారు. 2024 మేలో ముంబైలోని ప్రత్యేక ఎంసీఓసీఏ కోర్టు చోటారాజన్‌కు జీవిత ఖైదు, రూ.1,00,000 జరిమానా విధించింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

గుంతలకు దండలు వేసి స్థానికుల నిరసన

ముంబై: బీజేపీ పాలిత మహారాష్ట్రలో రోడ్లపై ఏర్పడిన గుంతల కారణంగా ప్రమాదాలకు గురై ఇద్దరు యువకులు మరణించారు. ఈ నేపథ్యంలో పాలకుల నిర్లక్ష్యంపై జనం ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంతలకు దండలు వేసి నిరసన తెలిపారు. పాల్గఢ్‌కు చెందిన హేమంత్ కుమార్ (19) వాడా-భివాండి హైవేపై స్కూటర్‌పై వెళ్తున్నాడు. రోడ్డుపై గుంతల వల్ల ట్రాలీని ఢీకొట్టి జారి రోడ్డుపై పడ్డాడు. వసూరిలోని బ్లూ స్టార్ కంపెనీలో విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తూ ఈ ప్రమాదానికి గురయ్యాడు. కాగా, నాగ్‌పూర్‌కు చెందిన మహేంద్ర ఫాటింగ్ (19) బైక్‌పై వెళ్తూ రోడ్డు మధ్యలో ఉన్న నీటి గుంతలో జారిపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. మరోవైపు మహారాష్ట్రలోని రోడ్లు గుంతలమయంగా మారడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్ల పరిస్థితి చాలా దారుణంగా ఉన్నదని, తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని మండి పడ్డారు. పాలకుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. రోడ్లపై నీటితో నిండిన గుంతలకు పూల దండలు వేసి నిరసన తెలిపారు. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ కుమార్తె, ఆ పార్టీ ఎంపీ సుప్రియా సులే కూడా గుంతలమయంగా ఉన్న రోడ్ల వీడియోలను షేర్ చేశారు. నాసిరకంగా రోడ్లను నిర్మించారని ఆమె ఆరోపించారు.

20 ఎయిర్‌గన్‌లు, 200 బుల్లెట్‌లు

ఓ వృద్ధుడి ఇంట్లో భారీగా మారణాయుధాలు

తిరువనంతపురం: ఓ వృద్ధుడి ఇంట్లో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి పట్టుబడడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అది ఇల్లా లేక ఆయుధాల గోడౌనా అని ఆశ్చర్యపోయేలా అక్కడ పెద్ద మొత్తంలో మారణాయుధాలు దొరికాయి. ఆ ఇంట్లో ఆయుధాలు ఉన్నాయన్న పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు... నిందితుడిని అదుపులోకి తీసుకుని, ఆయుధాలను సీజ్ చేశారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లాకు చెందిన ఉన్నికమద్ (60) అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా ఆయుధాలు నిల్వ ఉంచినట్లు పోలీసులకు రహస్యంగా సమాచారం అందింది. దాంతో పోలీసులు వెంటనే అతడి ఇంటిపై దాడి చేసి సోదాలు నిర్వహించారు. ఆ సోదాల్లో పోలీసులే నివ్వెరపోయేలా పెద్ద సంఖ్యలో ఆయుధాలు బయటపడ్డాయి. వాటిలో ఎయిర్‌గన్‌లు, రైఫిల్స్, బుల్లెట్‌లు, పెల్లెట్‌లు ఉన్నాయి. వృద్ధుడి ఇంటి నుంచి 20 ఎయిర్ గన్‌లు, 3 రైఫిల్స్‌తో పాటు 200 బుల్లెట్లు, 40 పెల్లెట్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. ఉన్నికమద్‌ను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇంత భారీ మొత్తంలో ఆయుధాలను ఎక్కడి నుంచి సేకరించారు... వాటిని విక్రయించేందుకు నిల్వఉంచారా లేక వ్యక్తిగత అవసరాల కోసం దాచారా అనే కోణాల్లో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీలో విషవాయువు... కార్మికుడి మృతి

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఒక అపార్ట్‌మెంట్ సమీపంలోని మురుగునీటి కాలువను శుభ్రం చేస్తుండగా విషపూరిత వాయువును నలుగురు పారిశుద్ధ్య కార్మికులు పీల్చారు. దీంతో ఒకరు మృతి చెందగా.. మరో ముగ్గురు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారు. అశోక్ విహార్ ప్రాంతంలో మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగింది, నలుగురు పారిశుద్ధ్య కార్మికులు ఒక అపార్ట్‌మెంట్ సమీపంలోని మురుగునీటి కాలువను శుభ్రం చేస్తుండగా విషపూరిత వాయువును పీల్చారు. దీంతో ఊపిరి ఆడకఇబ్బంది పడ్డారు. అందులో అరవింద్ (40) అక్కడికక్కడే చనిపోయాడు. మరో ముగ్గురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. రాత్రి 11:36 గంటలకు ఈ విషయం తెలియడంతో ఘటనాస్థలికి చేరుకుని నలుగురు కార్మికులను డీడీయూ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్ నివాసి అయిన అరవింద్ మరణించినట్లు ప్రకటించారు. మరో ముగ్గురు సోను, నారాయణ్, నరేష్ అపస్మారక స్థితిలో ఉండడంతో చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. సంఘటనా స్థలాన్ని క్రైమ్ బృందం పరిశీలించింది. బ్రిజ్‌గోపాల్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ మేనేజర్‌ను విచారణ కోసం పిలిపించారు. ఆ ప్రాంతంలో చాలా రోజులుగా మురుగు కాలువలను శుభ్రపరిచే పనులు జరుగుతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సారధి లేని సీఐసీ

- సమాచార కమిషనర్లను నియమించని ప్రభుత్వం
- 11 ఏళ్లలో 7వ సారి ఇదే పరిస్థితి
- గుట్టలుగా ఫిర్యాదులు: ఆర్టీఐకు దెబ్బ

న్యూఢిల్లీ: కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) సారధి లేని వ్యవస్థగా మారింది. గత 11 ఏళ్లలో ఏడో సారి ఇలాంటి పరిస్థితి నెలకొంది. ప్రధాన సమాచార కమిషనర్ హీరాలాల్ సమరియా గత శనివారం పదవీ విరమణ పొందగా, ఆయన స్థానాన్ని భర్తీ చేయడంపై ప్రభుత్వం అలసత్వం స్పష్టమైంది. సీఐసీతో పాటు సమాచార కమిషనర్ల నియామకంలోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ఆర్టీఐ కార్యకలాలపై ప్రతికూల ప్రభావం ఉంటోంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు సైతం బేఖాతరవుతున్నాయి' అంటూ పారదర్శకత (ట్రాన్స్‌పరెన్సీ) కార్యకర్తలు ఆందోళన వ్యక్తంచేశారు. హీరాలాల్ 2023, నవంబరు 6న ప్రధాన సమాచార కమిషనర్‌గా నియమితులయ్యారు. 65 ఏళ్ల వయస్సులో రిటైర్ (ఈనెల 9వ తేదీన) అయ్యారు. కేంద్ర సమాచార కమిషన్ ప్రస్తుతం ఇద్దరు కమిషనర్లతో నడుస్తోంది. సీఐసీతో పాటు ఎనిమిది సమాచార కమిషనర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో సుమారు 26వేల ఫిర్యాదులు పెండింగ్ ఉన్నాయి. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో ఈ స్థానాలు ఖాళీ అయిన మరుసటి రోజే ఐదుగురు సీఐసీలు నియమితులయ్యారు. మోదీ హయాంలో అందుకు పూర్తి విరుద్ధమైన పరిస్థితి ఉంది. ఉదాహరణకు 2014, ఆగస్టులో రాజీవ్ మాథూర్ రిటైరైన పది నెలలకు అంటే 2015 జూన్‌లో విజయ్ శర్మ ఆయన స్థానాన్ని భర్తీ చేశారు. శర్మ 2015 డిసెంబరులో పదవీ విరమణ పొందగా ఆ తర్వాత ఆర్‌కే మాథూర్ 2016, జనవరిలో నియమితులయ్యారు. మాథూర్ రిటైరైన 40 రోజులకు సుధీర్ భార్గవ నియామకం జరిగింది. అదే విధంగా పదవీ విరమణలు జరిగిన దాదాపు నెల రోజుల తర్వాత బిమల్ ఝుల్కా, వైకే సిన్హా, హీరాలాల్ సమరియా బాధ్యతలు చేపట్టారు. అధికారులు ఏ రోజు పదవీ విరమణ పొందుతారో తెలిసినాగానీ ఆ ఖాళీల భర్తీలో ప్రభుత్వం విఫలమవుతోందని కార్యకర్తలు అంజలీ భరద్వాజ్, అమ్రితా జోహ్రీ వ్యాఖ్యానించారు. సమయానుచితంగా సమాచార కమిషనర్లను నియమించుకుండా సమాచారాన్ని తెలుసుకునే ప్రజల హక్కును అణచివేస్తోందని, ఆర్టీఐ వ్యవస్థను కుంటుపరుస్తోందన్నారు. ఖాళీలు భర్తీ చేయకపోవడంతో ఫిర్యాదులు గుట్టలుగా పేరుకుపోతున్నాయని తెలిపారు. సమాచారం కోసం ఫిర్యాదుదారులు దాదాపు ఏడాదికిపైగా నిరీక్షించాల్సిన పరిస్థితి ఉందని. ఆలస్యంగా లభించే సమాచారం పనికి రాదని అన్నారు. కార్యకర్త లోకేశ్ భత్రా స్పందిస్తూ కోర్టులలో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తుల వలే ప్రధాన సమాచార కమిషనర్‌ను నియమించేలా ఆర్టీఐ చట్టం-2005లో ఏ నిబంధన లేదన్నారు. ఈ కారణంగా కొత్త సారధి వస్తే తప్ప పరిపాలన, ఆర్థికపరమైన కీలక నిర్ణయాలు జరగవన్నారు. కాగా, సమాచార కమిషనర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలంటూ 2024, ఆగస్టులో ప్రభుత్వ ప్రకటన వెలువడింది కానీ, ఇప్పటివరకు ఒక్క నియామకం జరగలేదు. 2025 ఏప్రిల్ నాటికి ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని జనవరిలో సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో సర్కారు హామీనిచ్చింది. సీఐసీ పోస్టు కోసం మేలో దరఖాస్తులను ఆహ్వానించింది. జూన్ 30వతేదీ వరకు గడువు ఇచ్చింది. ఈ ప్రక్రియలోనూ ఎలాంటి పురోగతి లేదు.

మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ

న్యూఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీ 75వ పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం ఆయనకు దేశ, విదేశీ ప్రముఖుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. 'ప్రధాని మోదీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీ అసాధారణ నాయకత్వం, కృషితో దేశం గొప్ప లక్ష్యాలను సాధించేలా చేశారు. నేడు ప్రపంచం మొత్తం మీ మార్గదర్శకాలపై విశ్వాసంగా ఉంది. మీరు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అని భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ్ము అన్నారు. 'మీ దార్శనిక నాయకత్వంలో ప్రపంచ వేదికలపై భారత్ తన ముద్ర వేస్తోంది. అభివృద్ధి చెందిన దేశం అనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది' అంటూ ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలిపారు. 'త్యాగం, అంకితభావానికి చిహ్నం... కోట్లాది మంది దేశ ప్రజల ప్రేమను పొందుతున్న మోదీకి జన్మదిన శుభాకాంక్షలు అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. 'ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడు, నవ భారత నిర్మాత ప్రధాని మోదీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు. సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్ నినాదంతో సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి, స్వావలంబనకు, అభివృద్ధి చెందిన దేశంగా భారత్ తన లక్ష్యాన్ని సాధించేందుకు అనేక చర్యలు తీసుకున్నారు. మీ దార్శనిక నాయకత్వంలో మన దేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. మీ మార్గదర్శకత్వం బీజేపీ కార్యకర్తలందరికీ స్ఫూర్తిదాయకం' అని కేంద్ర మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే... ప్రధాని మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 'మై డియర్ గుడ్ ఫ్రెండ్ నరేంద్ర.. హ్యాపీ బర్త్‌డే. మీరు మీ జీవితంలో భారత్ కోసం ఎంతో చేశారు. భారత్ - ఇజ్రాయిల్ మధ్య స్నేహం కోసం మనం కలిసి గొప్ప విజయాన్ని సాధించాం. మన భాగస్వామ్యాన్ని, స్నేహాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలి. త్వరలో మిమ్మల్ని కలిసేందుకు ఎదురు చేస్తున్నాను. పుట్టిన రోజు శుభాకాంక్షలు మై ఫ్రెండ్' అంటూ ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజిమిన్ నెతన్యాహూ పేర్కొన్నారు. ఈ మేరకు ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనెస్, న్యూజిలాండ్ ప్రధాని, భూటాన్ ప్రధాని సహా ప్రపంచ నేతలు ప్రధానికి శుభాకాంక్షలు తెలిపారు. మోదీతో, భారత్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

ట్రంప్‌కు మోదీ ధన్యవాదాలు

తన 75వ పుట్టినరోజు సందర్భంగా తన మిత్రుడు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారని ప్రధాని మోదీ ఎక్స్ (ట్వీట్) వేదికగా పోస్టు చేశారు. ట్రంప్ లాగే తానూ భారత్-అమెరికా సమగ్ర భాగస్వామ్యానికి కట్టుబడి ఉన్నట్లు మోదీ తెలిపారు. ప్రపంచ భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉక్రెయిన్-రష్యా వివాద పరిష్కారం కోసం ట్రంప్ చొరవకు మద్దతు ఇస్తున్నట్లు మోదీ తెలిపారు.

విశాలాంధ్ర
హైదరాబాద్

చిరు ధాన్యాలు, ఆహార పదార్థాల విక్రయ కేంద్రం ప్రారంభించిన కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : చిరు ధాన్యాలు ఆరోగాన్నిచ్చే సిరి ధాన్యాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సముదాయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన చిరు ధాన్యాలు - ఆహార పదార్థాల విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తృణ ధాన్యాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని, ముఖ్యంగా శరీరానికి పోషకాలు పుష్కలంగా లభిస్తాయని, మాంసాహారంతో పోలిస్తే చిరు ధాన్యాల్లో ప్రోటీన్స్ ఎక్కువగా ఉంటాయని తెలిపారు. చిరు ధాన్యాలు రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్ఓ సంగీత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష, సీపీఓ సామ్య పాల్గొన్నారు

విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : బుధవారం సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయ భవనంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పరంగా నిర్వహించిన విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృత్తిలో ప్రతి దానికి రూపకల్పన చేసి దానికి ఒక ఆకృతి కల్పించే వారే విశ్వకర్మలన్నారు. ఒక రాతిని చెక్కి దేవుని రూపం కల్పించే విశ్వకర్మలు తన వృత్తి నైపుణ్యాన్ని చూపుతారని అలాంటి శిల్పులకు సమాజంలో మంచి ఆదరణ కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న పథకాలను ఈ వృత్తుల వారికి చేయూతనిస్తాయని అన్నారు. భారతదేశ పారిశ్రామిక రంగ ప్రగతికి తార్కాణం విశ్వకర్మ అని కలెక్టర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీ ఆర్ఓ సంగీత, డీసీపీ సునీత రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి కేశురాం, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెరియార్ రామస్వామి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సర్వజన్ వికాస్ మంచ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం బాగ్ లింగంపల్లిలో 147వ పెరియార్ రామస్వామి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు రాఘవేంద్ర మాట్లాడుతూ పెరియార్ రామస్వామి చేసిన పోరాటం వల్ల అనగారిన కులాల వారికి దేవాలయ ప్రవేశం, పురుషులతో పాటు మహిళ కూడా సమాన హక్కును పొందుతున్నారన్నారు. ఆయన చేసిన స్వాభిమన ఉద్యమం ద్వారా ప్రజలు ఆత్మగౌరంతో బతుకుతున్నారని, ఆయన చేసిన పోరాటాలు ఈ తరానికి ఎంతో స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. తమసంస్థ ద్వారా పెరియార్ రామస్వామి సిద్ధాంతాలు, ఆయన పోరాట స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోళ్ల జనార్ధన్, శ్రీపాద రామచంద్రారావు, నాగభూషణ్, భరత్, సంపత్పాల్గొన్నారు.

సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో దసరా ఆఫర్లు

SOUTH INDIA shopping mall

విశాలాంధ్ర - హైదరాబాద్ : పెళ్ళిళ్ళ సీజన్ విజయదశమి పర్వదిన వేడుకలను పురస్కరించుకుని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ తమ షోరూమ్స్‌లో కొనుగోలుదారుల కోసం ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించారు. వాటిలో సూపర్ ధమాకా ఆఫర్స్ స్పాట్ గిఫ్ట్‌లో భాగంగా రూ.2,000 విలువ చేసే ప్రతీ కొనుగోలుపై ఆకర్షణీయమైన అనేక రకాల కానుకలను అందిస్తున్నారు. అదేవిధంగా రూ.4,335 విలువ చేసే కామాక్షి పట్టుచీరతో పాటు 45 రూపాయలకే మరో చీర, 4995 రూపాయల విలువ చేసే పట్టుచీరతో పాటు మిక్సీ గ్రైండర్ కానుకగా ఇస్తున్నారు. వీటితో పాటు మెన్స్ వేర్, కిడ్స్ వేర్, లీడింగ్ బ్రాండ్స్‌పై స్పెషల్ కాంబో ఆఫర్లు ఈ దసరా వేడుకల సందర్భంగా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ షోరూమ్స్‌లో కొనులుగోదారుల కోసం వైవిధ్యభరితమైన కానుకల రూపంలో అందజేస్తున్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా విలీన దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ విలీన దినోత్సవం కార్యక్రమం తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, ఎన్టీఆర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సామ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి 1947లో స్వాతంత్ర్యం వస్తే హైదరాబాద్ సంస్థానానికి 1948లో వచ్చింది. సర్దార్ వల్లభాయి పటేల్ సైనిక చర్య చేపట్టి నిజాం అరాచక పాలన నుంచి ప్రజలను విముక్తి కలిగించారు. సాయుధ పోరాటంలో నిజాంకు వ్యతిరేకంగా ఎందరో ప్రాణాలను అర్పించారని అన్నారు. నిజాంపై పోరాటం చేసిన యోధులు వీరు అని అన్నారు. మాజీ ఎమ్మెల్యే, కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ... సెప్టెంబర్ 17న సర్దార్ వల్లభాయ్ పటేల్ తెలంగాణను భారతదేశంలో విలీనం చేసిన మహత్తరమైన రోజన్నారు. రాష్ట్ర పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీరా రాజునాయక్, రాష్ట్ర పార్టీ నాయకులు నెల్లూరు దుర్గాప్రసాద్, సంధ్యపోగు రాజశేఖర్, యానా అనంతరెడ్డి, యాదీలాల్, ముంజా వెంకట్రాజం గౌడ్, జలమోని రవీందర్, ఎం.స్వాతి చౌదరి, చోటా గణేష్, కొత్త వినయ్ గౌడ్, మీడియా కమిటీ చైర్మన్ ప్రకాశ్ రెడ్డి, ఎంపిపి రమేష్ బాబు, వెంకటేష్ గౌడ్, బాదేపల్లి రాజుగౌడ్, కిషన్ నాయక్, మహారాష్ట్రలోని షోలాపూర్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు జి. తిప్పన్న, పి. రాములు, డి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోషణ మాస మహోత్సవాలు ప్రారంభించిన మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : ములుగు కేంద్రంలో పోషణ మాస మహోత్సవ కార్యక్రమాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క లాంఛనంగా ప్రారంభించారు. పోషణ తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పోషణ మాస మహోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ములుగు కేంద్రంలో పోషణ మాస మహోత్సవాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క లాంఛనంగా ప్రారంభించారు. కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ సౌజన్యంతో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ చిన్నారులు, మహిళల ఆరోగ్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సహకారంతో ఈ మహోత్సవాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ప్రతి ఇంటికీ పోషణ సందేశం చేరేలా అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. పిల్లలకు పూర్వప్రాథమిక విద్యతో పాటు పోషకాహారం అందించే చర్యలను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. "వోకల్ ఫర్ లోకల్" ద్వారా గ్రామీణ ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించాలని మంత్రి సూచించారు. అంగన్‌వాడీ సిబ్బందికి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వివరించిన ఆమె, వేసవిలో వారికి సెలవులు ఇచ్చినట్లు, మినీ అంగన్‌వాడీలను మెయిన్ సెంటర్లుగా మార్చినట్లు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ లేదా హెల్పర్ మరణిస్తే అంత్యక్రియల ఖర్చు భరిస్తున్నామని, రిటైర్మెంట్ ప్రయోజనాలు రెట్టింపు చేసినట్లు గుర్తుచేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఎత్తేస్తారని జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండించిన మంత్రి సీతక్క, ఆ కేంద్రాలను కాపాడే బాధ్యత తన దేనని స్పష్టం చేశారు. నాసిరకం సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్ చేస్తామని హెచ్చరించారు. "పోషణ తెలంగాణ నిర్మాణం మనందరి బాధ్యత. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణమే ఈ పోషణ మాసం ప్రధాన ఉద్దేశ్యం" అని సీతక్క అన్నారు. ములుగు జిల్లా కలెక్టర్ టీ.ఎస్. దివాకర్, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో వరంగల్ రీజనల్ హెడ్ శ్రీధర్, సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీకి చరిత్ర తెలియదు...

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ విలీనం దినోత్సవం సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విలీనానికి కాంగ్రెస్ పార్టీ చేసిన త్యాగాలు, పోరాటాలను ఈ రోజున స్మరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. విలీనం కోసం అహర్నిశలు కృషి చేసిన రామనంద తీర్థ, జమాలపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పీవీ నరసింహరావు వంటి మహనీయులను, నిజాం వ్యతిరేకంగా పోరాడిన కొమురం భీమ్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగి, కమ్యూనిస్టు యోధులను స్మరించడం ప్రతి తెలంగాణ వాసి బాధ్యత అన్నారు. బీజేపీ పాత్రపై స్పందిస్తూ...ఆ పార్టీ 1980లో పుట్టిందని, స్వాతంత్ర్యం, తెలంగాణ విలీన పోరాటాలకు సంబంధం లేనిదని ఎద్దేవా చేశారు. "ఇది పాత బీజేపీ కూడా కాదు.. 2014లో పుట్టిన మోడీ-షా బీజేపీ. వీరికి చరిత్ర తెలియదు, చరిత్రను వక్రీకరించడం మాత్రమే తెలుసు. గాంధీని గౌరవించని, గాడ్సేను దేవుడిగా చూసే వారి నుండి దేశభక్తి ఆశించడం వృథా" ప్రయాసగా అభివర్ణించారు. 1948లో సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం "ఆపరేషన్ పోలో" ద్వారా నాలుగు రోజుల్లో హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిందని గుర్తుచేశారు. కానీ, నేడు అదే పటేల్ పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ ఆయన చేసిన విలీనాన్ని "విమోచన"గా పిలవడం పటేల్ ను అవమానించడం కాదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం అన్ని రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ఎన్నికల సంఘాన్ని లొంగదీసుకుని మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ పాలనను ఆయన తీవ్రంగా విమర్శించారు. బీహార్‌లో ఓటు దోపిడీ ప్రయత్నాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అద్భుతమైన ప్రజా పాలన కొనసాగుతోందని, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం నుంచి సన్నబియ్యం వరకు అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

యాత్ర దానం వినూత్న కార్యక్రమం ప్రారంభం

విశాలాంధ్ర, హైదరాబాద్: టీ.జీ.ఎస్.ఆర్.టీ.సి సేవలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాలనీ బస్సు ఆఫీసర్లకు రాణిగంజ్ డిపో మేనేజర్ ఏ.శ్రీధర్ సూచించారు. ప్రజలందరికీ సామాజిక బాధ్యతతో వినూత్న ఆలోచనతో ఇటీవల ప్రారంభించిన యాత్ర దానం అనేది మానవ సంబంధాల వారధి మానవత్వపు బహుమతి అనే నినాదంతో ముందుకు సాగాలని ప్రజలకు కోరారు. సమాజంలో అనేక మంది ఔత్సాహికులు పలు రకాల దానాలు చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని, అదే విధంగా యాత్ర దానంతో అభాగ్యులకు నిరాశ్రయులు, వృద్ధులు, దివ్యాంగులు, పాఠశాల విద్యార్థులు, సంక్షేమ హాస్టల్లోచదివే విద్యార్థులు, గురుకులాల్లో చదువుకునే పేద విద్యార్థులకు విజ్ఞాన యాత్రలతోపాటు పర్యాటక ప్రాంతాలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు సందర్శించడానికి టి.జి.ఎస్.ఆర్.టి.సి రాణిగంజ్ డిపో వివిధ రకాల ప్యాకేజీలు రూపొందించినట్లు తెలిపారు. వీటితో పాటు పెళ్లిళ్లు శుభకార్యాలకు అద్దె బస్సుల బుకింగ్ కార్గో సేవలపై అవగాహన కల్పించాలని కాలనీ బస్సు ఆఫీసర్లకు ఆదేశించారు. ఎవరైనా వ్యక్తులు తమ సంతోషకరమైన, ప్రత్యేకమైన, ఆనందకరమైన రోజులలో అనగా పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాల రోజులలో, పెద్దల జ్ఞాపకార్థం సమయాలలో ఔత్సాహికులైన ప్రజాప్రతినిధులు ఎన్.ఆర్.ఐ.లు, కార్పొరేట్ సంస్థలు, ఎన్.జి.ఓలు, లైన్స్ క్లబ్ లాంటి స్వచ్ఛంద సేవ సంస్థలు, కుల సంఘాలు ఎవరైనా ఈ యాత్ర దానం చేయవచ్చని, అనాధలు నిరాశ్రయులైన వృద్ధులకు, దివ్యాంగులకు, విద్యార్థులకు ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు పర్యటన ప్రాంతాలకు విహార యాత్రలకు యాత్ర దానంతో వారికి కూడా మానసిక ఆనందాన్ని కల్పిస్తూ వారికి కూడా దైవ క్షేత్రాల దర్శనం కలిగించి ఆ పుణ్య కార్యక్రమంలో వారు కూడా పాలుపంచుకోవాలని కోరారు. ఎవరైనా దాతలు యాత్రా దానం చేయాలనుకుంటే నేరుగా రాణిగంజ్ డిపోకు వచ్చి కానీ, ఫోన్ చేసి కానీ వివరాలు తెలుసుకోవచ్చని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండనున్నట్లు రాణిగంజ్ డిపో మేనేజర్ ఏ.శ్రీధర్ తెలిజేశారు. మరిన్ని వివరాలకు 9959226147 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రజాపాల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండిఏ) ఆవరణలో కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో - మేడ్చల్ మల్కాజిగిరి : ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో ప్రజలకు తమ వంతు సేవ అందిస్తూనే, తమ గౌరవాన్ని కాపాడుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డిలు పాల్గొన్నారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ మను చౌదరి ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందరికి తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో భాగంగా ప్రజలకు తాము చేయగలిగినంత సేవలు అందించాలని కలెక్టరు సూచించారు. నీతి నిజాయితీగా తమ విధులు నిర్వహిస్తూ తమ గౌరవాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం తెలంగాణ గీతానికి గౌరవ వందనం చేసారు. ముందుగా జిల్లా కలెక్టరు, డిసిపి లు పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహులు, జిల్లా గ్రంథాలయ సంస్థ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, డిఇఓ విజయకుమారి, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాంమోహన్, ఇంచార్జ్ డిఆర్డిఓ పిడి కాంతమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పిసిబి కార్యాలయంలో..

తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్య కార్యదర్శి జి.రవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధులకు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన నాయకులకు నివాళులు అర్పించారు. ప్రజాస్వామ్య విలువలు, ఐక్యత, దేశభక్తిని పాటించేందుకు ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సభ్య కార్యదర్శి ప్రసంగిస్తూ, భారతదేశంలో తెలంగాణ విలీనం జరిగిన చారిత్రాత్మక ఘట్టమని గుర్తు చేస్తూ, ప్రజాస్వామ్యం, ఐక్యత, సమగ్రత విలువలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా పర్యావరణ పరిరక్షణకు టీఎస్పీసీబీ కట్టుబడి పని చేస్తుందని తెలిపారు. ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ విమోచన కోసం పోరాడిన నాయకులకు ఘనంగా నివాళులు అర్పించారు.

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి చౌరస్తాలో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...కాంగ్రేస్ ప్రజాపాలనలో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని, కాంగ్రేస్ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ తో పాటు పలువురు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్ వార్డు ఆఫీసు దగ్గర ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ జెండా ఆవిష్కరణ చేసి శానిటేషన్ లేబర్స్ ను సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో కాంగ్రేస్ పాలన ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రేస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హైదరాబాద్ : జలమండలిలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎండీ అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై.. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈడీ మయాంక్ మిట్టల్, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్, పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఆపరేషన్స్ డైరెక్టర్ వినోద్ భార్గవ, సీజీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కొంగరకలాన్‌లో బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ముఖ్య అతిథిగా గౌరవ రాష్ట్ర నీటి పారుదలశాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన మంత్రి దుద్దీళ్ళ శ్రీధర్, ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి పుర ప్రముఖులను, అధికార అనధికారులను కలిసి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతిని, సెప్టెంబర్ 17 ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ వేడుకల్లో టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నరసింహారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలక మధుసూధన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, మహేశ్వరం డిసిపి సునీతరెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏ.ఓ. సునీల్, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

అగ్రశ్రేణి నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు కృషి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రపంచం లోనే అగ్రశ్రేణి నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందనీ జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె వేడుకలకు హాజరైన అధికారులు, ఉద్యోగులను ఉద్దేశించి తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ సందేశాన్ని ఇచ్చారు. అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ ప్రాంతం రాజరిక, నిరంకుశ పాలన నుండి విముక్తి పొంది ప్రజా పాలనకు అడుగులు పడ్డాయన్నారు. అందువల్లే ఈ రోజు ప్రజా ప్రభుత్వం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా జరుపుకుంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని మేయర్ అన్నారు. ఒక్క హైదరాబాద్ నగరంలోనే 50 వేలకు పైగా రేషన్ కార్డులను పేద కుటుంబాలకు పంపిణీ ఇటీవలే చేసిందని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, అదనపు కమిషనర్‌లు కే వేణు గోపాల్, గీతా రాధిక, సిసిపి శ్రీనివాస్, చీఫ్ ఇంజనీర్ లు సహదేవ్ రత్నాకర్, నిత్యానంద్, విజిలెన్స్ ఎఎస్పీ సుదర్శన్ , డీఎస్పీ నరసింహ రెడ్డి, ప్రజా సంబంధాల అధికారి మామిండ్ల దశరథం, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సాహితీ వేత్త ఎస్వీ రామారావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణంపై దృష్టి పెట్టి పరిశోధన చేసిన గొప్ప సాహితీ వేత్త సూగూరు వేంకటరామారావు అని వారి నిర్యాణం పట్ల తెలుగు విశ్వవిద్యాలయం ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించింది.వారు ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాచార్యులుగా, కేంద్రీయ విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, బెనారస్, బెంగళూరు విశ్వవిద్యాలయాల్లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పని చేశారు "తెలుగులో విమర్శ - అవతరణ వికాసాలు" అనే విషయంపై డా.సి.నారాయణరెడ్డి పర్యవేక్షణలో పిఎచ్డీ పట్టా పొందారని, ఆచార్య ఎస్.వి.రామారావు తెలుగు సాహిత్య విమర్శ పరిణామ వికాసాలపై సాధికారికంగా పరిశోధన చేసిన సాహితీవేత్త అని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెల్దండ నిత్యానంద రావు గుర్తుచేశారు. ఎస్వీ రామారావు మృతిపట్ల వారి కుటుంబానికి సానుభూతిని ప్రకటించారు.

మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర- కొత్తూరు : భారత ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదిన సందర్భంగా బుధవారం మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అమడాపురం రణధీర్ గౌడ్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని ముఖ్య కూడలిలో మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సుమారు 40 మంది రక్తదానం చేశారు. అదేవిధంగా తెలంగాణ విమోచన దినోత్సవం పురస్కరించుకొని జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ గత 11 సంవత్సరాల పరిపాలనలో దేశం స్వరూపన్నే మార్చి ప్రపంచంలో భారతదేశాన్ని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చి దిద్దిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీకె దక్కుతుందని కొనియాడారు. ప్రధాని మోడీ దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశారని, అత్యుత్తమ భారతీయ పరిపాలన సామర్థ్యానికి నిదర్శనమని, దేశం కోసం పరితమించే శ్రామికుడు ప్రధాని అని పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జెశ్రీ, రాష్ట్ర నాయకులు అందే బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, మహబూబ్నగర్ పార్లమెంటు కో కన్వీనర్ అమడాపురం నరసింహ గౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పాలకొండ అశోక్ గౌడ్, డాక్టర్ విజయ్, కొత్తూరు సేవా పక్వాడ్ ఇంచార్జ్ వెంకటేష్ గుప్తా, కొత్తూరు మండల అధ్యక్షులు అత్తాపురం మహేందర్ రెడ్డి, నందిగామ మండల అధ్యక్షుడు వడ్ల అరవింద్ చారి, కొత్తూరు టౌన్ మాజీ అధ్యక్షుడు నాగరాజుచారి, మాణిక్యం బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

విశాలాంధ్ర - కొత్తూరు: తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కొత్తూరు మండల కేంద్రంలో అధికారులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో అరుంధతి, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ రవీందర్ రెడ్డిలు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల ప్రాముఖ్యతపై అవగాహన పెరగాలి : మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఔషధ మొక్కల ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన మరింత పెరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఇవి కేవలం ఆరోగ్యానికి మాత్రమే కాకుండా, పర్యావరణ సమతుల్యతకు, జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం తోల్ కట్ట గ్రామంలోని "పీవీ నర్సింహారావు మెడిసినల్ గార్డెన్" లో బుధవారం ఏర్పాటు చేసిన "ఆరోమెటిక్ అండ్ మెడిసినల్ ప్లాంట్స్ ప్లాంటేషన్" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయుర్వేదం, సిద్ధ వంటి సంప్రదాయ వైద్య విధానాల్లో ఔషధ మొక్కల పాత్ర ఎంతో గొప్పదని, వేప, తులసి, అల్లం లాంటివి నిత్య జీవితంలో మనకు ఎంతగానో ఉపకరిస్తాయని ఈ సందర్భంగా ఆయన వివరించారు. 'ప్రాణహిత-చేవెళ్ల' ప్రాజెక్ట్ ద్వారా సాగునీటిని అందించేందుకు కాంగ్రెస్ పార్టీ చొరవ తీసుకుంటే, ఆ తర్వాత అధికారంలోకొచ్చిన కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ గడ్డకు విముక్తి కల్పించేందుకు ఎంతో మంది మహానీయులు పోరాటం చేశారని, వారి త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్వామి రామనంద తీర్థ, పీవీ నర్సింహా రావు తదితర నాయకుల స్ఫూర్తితో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా పక్కా ప్రణాళికతో తమ ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, పీవీ ప్రభాకర్ రావు, శేఖర్ మారంరాజు తదితరులు పాల్గొన్నారు.

1 లక్ష ఎలక్ట్రిక్ వాహన ఛార్జర్‌ల ఏర్పాటు

విశాలాంధ్ర - హైదరాబాద్ : అతిపెద్ద ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ నెట్‌వర్క్ అయిన బోల్ట్, ఎర్త్, దేశవ్యాప్తంగా 1,00,000కు పైగా ఎలక్ట్రిక్ వాహన ఛార్జర్‌లను విజయవంతంగా అమర్చినట్లు ప్రకటించింది. 1,800కు పైగా పట్టణాలు, నగరాలలో విస్తరించింది. బోల్ట్ ఎర్త్ సీఈఓ రాఘవ్ భరద్వాజ్ మాట్లాడుతూ భారత ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో, అలాగే దేశాన్ని కాలుష్యం లేని, అందుబాటులో ఉండే రవాణా వైపు వేగంగా తీసుకెళ్లడంలో ఈ మైలురాయి ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచింది. ఈ కంపెనీ ఛార్జింగ్ నెట్‌వర్క్‌లో విభిన్న రకాల ఛార్జింగ్ పరిష్కారాలు ఉన్నాయని, నివాస ప్రాంతాలు, కార్యాలయాలలోని అవసరాలను తీర్చడం నుండి, 2 వీలర్లు, 3 వీలర్లు, 4 వీలర్లు వంటి అన్ని రకాల ఎలక్ట్రిక్ వాహనాలకు అనుకూలంగా హై-స్పీడ్ బ్లేజ్ డీసీ, లైట్నింగ్ డీసీ ఛార్జర్లు వరకు రూపొందించబడ్డాయన్నారు. అనేక ఇతర సంస్థలతో పోలిస్తే, బోల్ట్ ఎర్త్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, సేవలు మరియు కస్టమర్ సహాయం వంటి అన్నింటిని కలుపుకొని తన పరిష్కారాలను సంపూర్ణంగా అభివృద్ధి చేసింది. తమ ప్రత్యేకమైన ఛార్జర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా, వినియోగాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించడం, డైనమిక్ ప్రైసింగ్‌ను అమలు చేయడం సాధ్యమవుతుంది. దీని ద్వారా భవిష్యత్‌కు సిద్ధమైన స్మార్ట్ ఛార్జింగ్ వ్యవస్థకు బలమైన పునాది ఏర్పడింది.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ప్రజల సంక్షేమానికి కొనసాగిస్తు తమ బాధ్యతగా, నేడు వైద్య అత్యవసర పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ 2.40 లక్షల చెక్కులను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడానికి, కష్టాల్లో ఉన్న వారికి తక్షణ సహాయం అందించేందుకు మేము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ఆయన పేర్కొన్నారు. సీఎంఆర్‌ఎఫ్ కార్యక్రమం వైద్య అత్యవసర పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఆర్థిక సహాయాన్ని అందించేందుకు రూపొందించబడిందని,వీరు కష్టకాలంలో సమయానికి సహాయం అందుకునేలా ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట ఫలితమే విలీనం

విశాలాంధ్ర - మేడిపల్లి: మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరానగర్ చౌరస్తాలో మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం తెలంగాణ సాయుధ పోరాట విలీనం సందర్భంగా జాతీయ జెండా ఎగరవేసి తెలంగాణ సాయుధ పోరాట వీరులకు జోహార్లు తెలియ జేయడం జరిగింది. ఈ సందర్భంగా రచ్చ కిషన్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం 1947 ఆగస్టు 15న, రాగా హైదరాబాద్ సంస్థా నంలో 1948 సెప్టెంబర్ 17న దాదాపు ఒక సంవత్సరం తరువాత మువ్వన్నెల జెండా ఎగిరింది. ఆ నడుమ కాలంలో ప్రజోద్యమం ఉధృతంగా కొనసాగుతున్న క్రమంలో ఆంధ్ర మహాసభ ప్రతినిధిగా రావి నారాయణరెడ్డి, కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధిగా బద్దం ఎల్లారెడ్డి, ఎఐటీయుసి ప్రతినిధిగా మద్దూం మహిమద్దీన్‌లు 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటానికి పిలుపునిచ్చినారు. మేడిపల్లి మండల సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శిలు సిహెచ్ మాధవి, జి నాగరాజు, ఏఐటిసి మండల కార్యదర్శి దండు రమేష్, బి కే ఎం యు మండల కార్యదర్శి కే మహాలక్ష్మి, మండల కౌన్సిల్ సభ్యులు ఇస్తారి, సోమరాజు, సరిత పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

విశాలంధ్ర - మేడిపల్లి : పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్‌లో శ్రీ పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక పూజలలో మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్లు జక్క వెంకట్ రెడ్డి, అమర్ సింగ్ పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించారు. మాజీ కార్పొరేటర్లు బోడిగే స్వాతి కృష్ణ గౌడ్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, బోడిగే స్వాతి కృష్ణ గౌడ్, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ప్రభు, కోనేటి వెంకట్, యాసారం శ్రీనివాస్, కిరణ్, కిరణ్ నాయక్, అమర్ పటేల్, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలు ఉత్సవాలను విజయవంతం చేశారు.

ఆత్మ రక్షణ, శారీరక, మానసిక దృఢత్వానికి కరాటే

విశాలాంధ్ర - కాప్రా : ఆత్మ రక్షణతో పాటు శారీరక, మానసిక దృఢత్వానికి కరాటే ఉపయోగపడుతుందని నాచారంలోని డక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ నవనీతరావు పేర్కొన్నారు. ఎల్‌బీ నగర్, కె కె గార్డన్ సరోనగర్ ఆకిడో నిర్వహించడం జరిగింది. 2025 కరాటే పోటీల్లో పాల్గొని విజయం సాధించిన తమ పాఠశాల విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ పోటీలో తమ పాఠశాల నుండి పాల్గొన్న విద్యార్థులు 9 బంగారు పతకాలు, 2 వెండి పథకాలు, 7కాంస్య పతకాలు సాధించడం సంతోషకరమన్నారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రతి ఒక్కరికి మార్షల్ ఆర్ట్స్ అవసరమన్నారు.

ఘనంగా తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్ నగర్ నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం - ఐడిఓసి ప్రాంగణంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు గౌరవ మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు ఎమ్మెల్యే ఐడిఓసి ప్రాంగణంలో మంత్రికి పుష్పగుచ్చం అందించి ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించి, ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను అలరించాయి. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులను మంత్రితో కలిసి ఆయన ఘనంగా సన్మానించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, జిల్లా ఎస్పీ డి.జానకి, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, శాంతన్న యాదవ్, ఎస్సీ సెల్ చైర్మన్ సాయి బాబా, జేసిఆర్ పాల్గొన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పోలీస్ లైన్ సిబ్బందికి సూచించారు. మహబూబ్ నగర్ నగరంలోని పోలీస్ లైన్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల ప్రాంగణంలో శిధిలావస్థలో ఉన్న పోలీసు క్వార్టర్స్ వద్ద నిత్యం పందుల బెడదతో పాటు, అక్కడ విష సర్పాలు కూడా వస్తున్నాయని ఎమ్మెల్యే దృష్టికి పాఠశాల సిబ్బంది తీసుకురాగా వెంటనే ఆయన స్పందించి, పై అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. మహబూబ్ నగర్ నగరం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నెలకొన్న పరిస్థితులను వివరించార. ఎమ్మెల్యేతో పాటు డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు అజ్మత్ అలి, కృష్ణ ముదిరాజ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ఖాజా పాషా, అంజద్, రాషెద్ ఖాన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాజిద్ హుసేన్ ఉన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్య భీమా, జీవిత భీమా తీసుకోవాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారురాలు దాసరి లలితమ్మకు ఎమ్మెల్యే ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన పథకం ద్వారా వచ్చిన 2 లక్షల రూపాయల జీవిత భీమాకు చెక్కును అందజేశారు.

సామాజిక న్యాయం, ప్రజల ఆకాంక్షలే ప్రభుత్వ లక్ష్యాలు

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: ఉద్యమాల చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటం గొప్పదని ఉద్యమకారుల స్ఫూర్తితో తెలంగాణలో సామాజిక న్యాయం, ప్రజల ఆకాంక్షలే ప్రభుత్వ లక్ష్యాలుగా ముందుకు సాగుతామని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17 ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా షాద్ నగర్ లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాలు జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్, ప్రొఫెసర్ కోదండరాం హాజరై క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. సాయుధ పోరాట స్ఫూర్తితోనే ప్రజా పాలన తెచ్చుకున్నామన్నారు. సామాజిక న్యాయం, ప్రజల ఆకాంక్షలే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. స్వేచ్ఛ, సమానత్వంలో తెలంగాణ రోల్‌మోడల్ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం కు ఉద్యమకారులు అదేవిధంగా జేఏసీ సభ్యులు పెద్ద ఎత్తున సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, జేఏసీ నాయకులు, బిసి సేన నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ అమరవీరుల స్థూపానికి శంకుస్థాపన

తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లో ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలంగాణ ఉద్యమకర్త ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో కలిసి అమరవీరుల స్థూపానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.,. తెలంగాణ ప్రజలు నిరంతర పోరాట యోధులని అన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన నిజాం రాజు తెలంగాణను వీడిపోకపోవడంతో అతనితో యుద్ధం చేయాల్సి వచ్చిందని గుర్తు చేశారు. ఆ తర్వాత రెండు దశల్లో ప్రత్యేక తెలంగాణ కోసం పోరాటం చేసి రెండవ దశలో సాధించుకున్నామని అన్నారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్‌ను, ఉద్యమ సంఘాల జేఏసీ నాయకులను ఆయన అభినందించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, ఇబ్రహీం, జేఏసీ చైర్మన్ ఏం జనార్ధన్, టిజి శ్రీనివాస్, కరుణాకర్, బాల్ రాజ్ యాదవ్, గొర్ల రాము, శ్రీహరి, రామారావు, రఘు, రవి, అర్జున్ కుమార్, కృష్ణయ్య, నర్సింలు, శ్రీనివాస్, అనంతం, బాదేపల్లి సిద్ధార్థ, జియోనన్ సుధాకర్ రెడ్డి, లక్ష్మయ్య, రవీంద్రనాథ్, ఎంఈఓ మనోహర్, నరసింహులు గౌడ్, నరేందర్ కృష్ణ, శ్రీశైలం పాల్గొన్నారు.

17 నుండి స్వస్థ నారీ - సశక్త్ పరివార్ అభియాన్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మహిళల ఆరోగ్యం- శక్తివంతమైన కుటుంబాలు" అనే లక్ష్యంతో, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వస్థ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోంది. బుధవారం భారత ప్రధానమంత్రి చేతుల మీదుగా దేశస్థాయిలో ప్రారంభమైన అనంతరం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డా.ఉమా గౌరి ఆధ్వర్యంలో అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంలో డిసిహెచ్ సునీత, జిజిహెచ్ సూపరింటెంట్ రాధ, అల్వాల్ మున్సిపల్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ యాదగిరి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి జిల్లా ప్రోగ్రాం అధికారులు, స్పెషలిస్ట్ వైద్యులు, ప్రజా ప్రతినిధు లు, పత్రికా ప్రతినిధులు కూడా హాజరయ్యారు. కార్యక్రమాన్ని అల్వాల్ పిహెచ్‌సి వైద్యాధికారి డా. శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించగా, సిబ్బంది డా.సుప్రియ, డా.అనెగ్, డా.శైలజ సమన్వయం చేశారు. జిల్లా వ్యాప్తంగా 121 ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయబడ్డాయి. ప్రారంభం రోజున 11 శిబిరాలు జరిగాయి. ఇవి ఏరియా హాస్పిటల్ (1), కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (3), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (12), అర్బన్ హెల్త్ సెంటర్లు (28)లో నిర్వహించబడతాయన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్య పరీక్షలు, అవసరమైన మందుల పంపిణీ, కౌన్సిలింగ్, ప్రసూతి, గైనకాలజీ, చిన్నపిల్లల, నేత్ర, దంత, చర్మ, ఈఎన్‌టీ, సైకియాట్రీ నిపుణుల వైద్య సేవలు., బీపీ, షుగర్, క్యాన్సర్, టీబి, హిమోగ్లోబిన్ సమస్యలపై పరీక్షలు, సలహాలు, అవసరమైతే పెద్ద ఆసుపత్రులకు రిఫరల్ సదుపాయం రక్తహీనత నివారణ, పోషకాహారంపై అవగాహన, బలహీనంగా ఉన్న పిల్లలకు ప్రత్యేక చికిత్స మార్గనిర్దేశం., కిశోర బాలికలకు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

గోశాలను కూల్చిన హైడ్రా...

విశాలాంధ్ర -శేరిలింగంపల్లి: మియాపూర్ డైనమిక్ కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఒక గోశాలను బుధవారం ఉదయం హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాలనీలోని ఎమినిటీస్ స్థలంలో ఏర్పాటు చేసిన ఓ గోశాలను నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని హైడ్రా అధికారులు కూల్చివేసినట్లు కాలనీవాసులు తెలిపారు. హైడ్రా వ్యవహారాన్ని పలు హిందూ ధార్మిక సంస్థలు తీవ్రంగా ఖండించాయి. ఓవైసీ సోదరులు చెరువు నడిబొడ్డున కళాశాల నిర్మించుకొని దందా చేస్తుంటే బీరాలు పలికిన హైడ్రా కమిషనర్ గోమాతలు ఆశ్రయం పొందుతున్న కేంద్రాలను కూల్చివేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా నిర్మాణాలు కూల్చివేయడం అమానుషమని అన్నారు. దేవాలయాన్ని ఆనుకొని ఏర్పాటైన గోశాలను ఎలా కూలుస్తారని, రోడ్డున పడ్డ గోమాతల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మరో వర్గం వారి వ్యాపార కేంద్రాలను వదిలేసిన హైడ్రా హిందువుల ఆధ్యాత్మిక కేంద్రాలను టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. గోశాలల విషయంలో హైడ్రా పునరాలోచించుకోవాలని హితవు పలికారు.

పండుగ కలెక్షన్ విడుదల చేసిన తనైరా

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : పండుగ సీజన్ లో ప్రత్యేకమైన ఆఫర్లు, మొట్టమొదటి సారిగా వినూత్నమైన కొనుగోలు ప్రణాళిక తీసుకురావటం ద్వారా కోరుకున్న నేత వస్త్రాలను సొంతం చేసుకునే అవకాశం. టాటా సంస్థకు చెందిన మహిళల ఎత్నిక్ వస్త్రాల బ్రాండ్ అయిన తనైరా, తమ పండుగ కలెక్షన్, 'మియారా' క్రాఫ్టెడ్ బై హ్యాండ్, రూటెడ్ ఇన్ ప్యూరిటీ' పేరిట విడుదల చేసింది. నేటి మహిళల కోసం చేతితో తయారు చేసిన ఈ శ్రేణి, సమకాలీన డిజైన్లను సాంప్రదాయ పనితనంతో మిళితం చేస్తుంది, విభిన్నంగా నిలిపే వైవిధ్యమైన డిజైన్ భాషను తెస్తుంది. విభిన్న నేత సంప్రదాయాలలో పట్టు , కాటన్లను కలిగి ఉన్న మియారా, వ్యక్తిగత ఆనందంగా లేదా ప్రతిష్టాత్మకమైన బహుమతిగా ఎంచుకున్నప్పటికీ, ప్రతి వేడుక క్షణాన్ని ఉన్నతీకరించడానికి రూపొందించబడింది. తనైరా తాజా ప్రచారం 'ది గిఫ్ట్ ఆఫ్ ప్యూర్ లవ్', చీరను పండుగ సీజన్‌లో బహుమతి ఇవ్వడంలోని ఆనందానికి తమదైన రీతి నిర్వచనంగా ఈ ప్రచారం నిలుస్తుంది, తనైరా చీరను బహుమతిగా ఇవ్వడం అంటే అరుదైన, అమూల్యమైన దానితో ప్రేమను గౌరవించడం అనే భావోద్వేగంను మనకు గుర్తు చేస్తుంది. చివరగా, స్వచ్ఛత అనేది ప్రేమకు నిజమైన కొలమానం. ఎందుకంటే 'స్వచ్ఛమైన ప్రేమ కేవలం కనిపించదు, అనుభూతి చెందుతుంది'. బ్రాండ్ గిఫ్ట్ వోచర్‌లు, బంగారు నాణేలతో ప్రత్యేక పండుగ ఆఫర్‌లను పరిచయం చేస్తుంది. కస్టమర్‌లు రూ. 10,000 విలువైన ప్రతి కొనుగోలుకు రూ.1,000 వోచర్‌ను అందుకుంటారు, దీనిని వారి తదుపరి కొనుగోలులో వినియోగించుకోవచ్చు, అయితే రూ.50,000 లేదా అంతకంటే ఎక్కువ కొనుగోలు చేసే వారు 0.2 గ్రా తనిష్క్ బంగారు నాణెం కూడా అందుకుంటారు. ఈ ఆవిష్కరణ సందర్భంగా తనైరా సిఎస్ఎంఓ సోంప్రభ్ సింగ్ మాట్లాడుతూ, "ఈ సీజన్‌లో, వైవిధ్యమైన వస్త్రాలలో వ్యక్తీకరించబడిన ఊహ, వారసత్వ ప్రతిబింబంగా మేము మియారాను ఆవిష్కరిస్తున్నామన్నారు. తనైరా వద్ద మేము చీరను కేవలం ధరించడం కాదు, అనుభవించదగినది అని నమ్ముతామన్నారు.

రోడ్లపై పశువుల సంచారం...

విశాలాంధ్ర-దుండిగల్: పశువుల యజమానులు సాయంత్రం సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిసిన కూడా ఆవులు, గేదెలను ప్రధాన రహదారులపై తిరగడానికి అనుమతిస్తున్నారని, దీనివల్ల వాహనదారులకు, జంతువులకు కూడా చాలా ప్రమాదం జరుగుతుందని పౌరులు ఫిర్యాదు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపై ఎక్కడబడితే అక్కడ గేదెలు, పశువులు, కుక్కలు వంటి మూగ జీవాలు మందలుగా సంచరించడం, అవి రోడ్లపై అడ్డదిడ్డంగా నిలబడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించడం వల్ల ప్రజలు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. దీనికి ప్రధాన కారణాలు పశువుల యజమానులు వాటిని సరిగ్గా పట్టించుకోకపోవడం, బందెల దొడ్డిలు లేకపోవడం, మున్సిపల్ సిబ్బంది చెత్తను తొలగించకపోవడం,ఆ చెత్తలో లభించే వ్యర్థ పదార్థాలను తింటూ రోడ్లపై సంచరిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు మళ్లీ జరగకుండా మున్సిపాలిటీ, పోలీస్ అధికారులు సంయుక్తంగా దృష్టి సరించి వాటి సంబంధిత యాజమానులతో సమావేశం నిర్వహించి రహదారుల పైకి రాకుండా వారితో మాట్లాడి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

తెలంగాణ యోధుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: తెలంగాణ విలీనం దినోత్సవంపై మాట్లాడే హక్కు బిజెపికి ఎంతమాత్రం లేదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి రామకృష్ణ అన్నారు. ఈ నెల 11 నుండి రాష్ట్ర వ్యాప్తంగా వారోత్సవాలు జరుపుకొని. 17 ముగింపు రావి నారాయణరెడ్డి ఆడిటోరంలో జరిగింది ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం ద్వారానే ప్రజలకు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లభించాయని, కానీ తెలంగాణ సాయుధ పోరాటం చరిత్రను పాలకులు వక్రీకరిస్తున్నారని అన్నారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విలీన దినోత్సవంపై కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కపట నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. విమోచన దినోత్సవం పేరిట బీజేపీ చేపట్టిన కార్యక్రమాలు ప్రజలను మభ్యపెట్టేందుకేనని, నైజాం వ్యతిరేక పోరాటంలో బిజెపి పాత్ర ఏమాత్రం లేదన్నారు. పైగా తెలంగాణ పోరాటాన్ని హిందూ,ముస్లీం మధ్య జరిగిన గొడవగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు. తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని, ట్యాంక్ బండ్ పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలు పెడతామని, పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ సాయుధ పోరాట పోరాట చరిత్రను చేర్చుతామని చెప్పిన ప్రభుత్వం ఎందుకు ఆ హామీలను నెరవేర్చలేదని ప్రశ్నించారు.

కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా : కొలను

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం 130 డివిజన్ అపురూప కాలనీ మెయిన్ రోడ్ పరిధిలో డ్రైనేజీ పూర్తిగా పాడవటంతో బస్తి వాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటు గత నెల నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించి సమస్యను విన్నపించగా రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పెషల్ ఫండ్స్ ద్వారా డ్రైనేజీ కొరకు రూ. 13,00,000 లక్షల రూపాయలు మంజూరు చేయించారు.బుధవారం డివిజన్ అధ్యక్షులు సోమన్నగారి శ్రీధర్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ హరి కిరణ్ పటేల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రైనేజీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు.అ నంతరం కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ కొలను హన్మంత్ రెడ్డిని శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు తిప్పారెడ్డి, సెక్రటరీ రమణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కరణ్, చందు, వీరేశ్ గుప్తా,డివిజన్ జనరల్ సెక్రెటరీ నాగిరెడ్డి,కోశాధి కారి భాస్కర్ రెడ్డి,కాలనీ సొసైటీ సభ్యులు గణేషన్,సీతారాం రెడ్డి, అంజిరెడ్డి,ఆకుల కృష్ణ,దయాకర్ రెడ్డి,రాజు చారి, సురేందర్ రెడ్డి,ఇన్నయ్య రెడ్డి,ఆదినారాయణ,మోహన్ రావు,రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు యాసిన్ గఫార్,మహిళ అధ్యక్షురాలు తులసి,శైలజ,నాగ శిరోమణి, ప్రసన్న,యూత్ నాయకులు శ్యామ్,జానీ,హరి,వాసు,తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలి

విశాలాంధ్ర - బషీర్‌బాగ్: ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఎనిమిది వేల కోట్లు ఉంటే 600 కోట్లు విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అవి ఏ మూలకు సరిపోతాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ. ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను చెల్లించాలని, లేనిపక్షంలో దసరా తర్వాత విద్యార్థి సంఘాలతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, పగిళ్ల సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీ. ఆర్ కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే ఫీజు రియంబర్స్మెంట్ పథకానికి బడ్జెట్ ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఫీజులు చెల్లించడానికి డబ్బులు లేవనడం, విద్యను నిర్లక్ష్యం చేయడమేనని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి పూర్తిస్థాయిలో ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు మణికంఠ, మోడీ రాందేవ్, లింగయ్య, రవి, నరేష్, కౌశిక్, నిఖిల్, లీలావతి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కేశంపేటలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

విశాలాంధ్ర - షాద్‌నగర్, రూరల్ : ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజక వర్గం కేశంపేట మండల కేంద్రంలో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల ప్రజా పరిషత్‌లో ఎంపీడీఓ రవిచంద్ర కుమార్ రెడ్డి, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో తహసీల్దార్ ఆజాం అలీ ఖాన్ లు జాతీయ జెండాను ఎగురవేశారు. ?ఈ కార్యక్రమాలకు మాజీ జెడ్పీటీసీ తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి, మాజీ సర్పంచులు యెన్నం శ్రీధర్ రెడ్డి, తలసాని వెంకట్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విశాలాంధ్ర - మొయినాబాద్ : రక్తదానం ఎంతో మందికి ప్రాణదానంతో సమానమని చేవెళ్ల ఎంపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం భారత ప్రదాని నరేంద్రమోడీ 75వ జన్మదినం సందర్భంగా మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్లో రంగారెడ్డి జిల్లా బీజేపీ ఓబీసీ ప్రధాన కార్యదర్శి అత్తపురం శ్రీనివాస్ గౌడ్ అధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 200 మంది వరకు బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా ముందుకు వచ్చి రక్తాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేశ ప్రదాని జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో యువత అధిక సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే రత్నం, జిల్లా పార్టీ అధ్యక్షుడు రాజభూపాల్ గౌడ్, కంజర్ల ప్రకాష్, జిల్లా సీనియర్ నాయకులు గున్నాల గోపాల్ రెడ్డి, ప్రభాకర్రెడ్డి, ఓబీసీ జిల్లా కన్వీనర్ ఎల్లని వెంకటేష్ గౌడ్, బీజేపీ యువ నాయకులు డాక్టర్ వైభవడ్డి, శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రారెడ్డి, నర్సింహ్మారెడ్డి, సహదేవ్ గౌడ్, మాదవరెడ్డి, కుమ్మరి మహేందర్, మండలంలోని వివిద గ్రామాలకు చెందిన బీజేపీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గోన్నారు.

108 సిబ్బంది సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - మొయినాబాద్ : 24 గంటలు ప్రజలకు ఏ ఆపద వచ్చిన వెంటనే అక్కడికి చేరుకొని ఆసుపత్రులకు తీసుకువెళ్లే 108 సిబ్బంది సేవలు అభినందనీయమని వారు భగవంతునితో సమానమని హిమాయత్ నగర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కట్టమీది శ్రీను పేర్కొన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అంబేద్కర్ యువజన సంఘం అధ్వర్యంలో 108 సిబ్బందికి హిమాయత్ నగర్ చౌరస్తాని అంబేద్కర్, బాబు జగ్జీవన్రాం విగ్రహాల ముందు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యకుడు కట్టమీది శ్రీను 24 గంటలు ప్రజలకు ఏ ఆపద వచ్చిన చికిత్స అందిస్తూ ఆసుపత్రులకు తరలిస్తూ వారు చేస్తున్న సేవాలు అభినం నీయమన్నారు. 108 సిబ్బంది భగవంతునితో సమానమని తెలిపారు. ఉద్యోగం అనే కాకుండా సమాజికంగా వారు ఎంతో ఓపికతో సేవాలు నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఫైలు శ్రీదర్, కట్టమీది ప్రకాష్, షాబాద్ దర్శన్, బుర్రకాయల మహేష్ ముదిరాజ్, కంజర్ల శివయ్య, కట్టమీది రాకేష్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: భారత ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా అఖిల్ భారతీయ తేరాపంత్ యువక్ పరిషత్ శాఖ, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ యాదవ్ సహకారంతో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిర కార్యక్రమంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు. సందర్భంగా రాధాకృష్ణ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విధిగా రక్తదానం చేసి ప్రాణాపాయమున్నవారికి సహకరించాలని తెలుపుతూ రేపు కూడా రంగారెడ్డి జిల్లా అర్బన్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మియాపూర్ బీఆర్ఆర్ ఫ్లెక్స్? వద్ద మెగా రక్తదాన శిబిరం ఉంటుందని ఆ కార్యక్రమంలో మీరందరూ పాల్గొనవలసిందిగా కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్,అభిషేక్, సుమన్, ఆదేశ్, అభిషేక్, విశాల్, సుభాష్, విమల్ , రాహుల్ ,సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉమర్ ఖాలిద్‌కు న్యాయం

విచారణ లేకుండా ఐదేళ్లుగా జైల్లోనే

ముంబై సభలో వక్తలు

ముంబై: విద్యార్థి నాయకుడు ఉమర్ ఖాలిద్‌కు న్యాయం కోసం డిమాండ్ పెరుగుతోంది. 2020 ఫిబ్రవరిలో జరిగిన ఢిల్లీ అల్లర్లకు కుట్ర కేసులో యూఏపీఏ చట్టం కింద ఉమర్ జైలుకెళ్లారు. ఈ కేసులో కోర్టు విచారణ ఒక్కసారి కూడా జరగలేదు. ఉమర్ ఐదేళ్లుగా ఖైదీగా శిక్ష అనుభవిస్తున్నారు. దీంతో ఈ కేసులో విచారణను పారదర్శకంగా నిర్వహించాలని, ఉమర్ ఖాలిద్‌కు న్యాయం చేయాలని ముంబై మరాఠీ పత్రకార్ సంఘ్ నిర్వహించిన బహిరంగ సభలో వక్తలు డిమాండ్ చేశారు. ఆందోళనలు ముగిశాయి కానీ ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాటాలు కొనసాగుతున్నాయని వక్తలు ఉద్ఘాటించారు. పౌరుల హక్కులను అణచివేస్తుంటే వీధుల్లోకి రాక తప్పదు... ఇందుకు శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ పరిస్థితులే ఉదాహరణగా చెప్పారు. తమ పోరాటం శాంతియుతంగా సాగుతుందని, చట్టానికి లోబడి ఉంటుందని తెలిపారు. న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని వదలుకోలేదని, తమ గోడును కోర్టులు తప్పక వింటాయని ఆశాభావం వ్యక్తంచేశారు. నిర్వాహకులు, మానవ హక్కుల కార్యకర్త గుడ్డీ ఎస్.ఎల్ మాట్లాడుతూ 'బహిరంగ ప్రదేశాల్లో సభలు నిర్వహించే రోజులు పోయాయి కాబట్టి ముంబై మరాఠీ పత్రకార్ సంఘ్‌ను వేదికగా ఎంచుకున్నాం. ఉమర్ ఖాలిద్ అక్రమ నిర్బంధానికి వ్యతిరేకంగా గళం వినిపించడం, న్యాయ విచారణ కోసం డిమాండ్ చేయడమే ఈ సభ ముఖ్య ఉద్దేశం' అని అన్నారు. ఉమర్‌తో పాటు షర్జిల్ ఇమామ్, గుల్ఫిషా ఫాతిమా, మీరన్ హైదర్‌ల బెయిల్ పిటిషన్లపై విచారణను 19వ తేదీకి వాయిదా వేస్తూ ఈనెల 12న సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చిన క్రమంలో ఈ సభకు ప్రాధాన్యత ఏర్పడింది.

నిరుద్యోగ సమస్య పరిష్కరించరా?

- ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వం విఫలం
- ఖాళీలపై శ్వేత పత్రం విడుదల చేయాలి
- రాష్ట్రాన్ని ప్రైవేట్ వ్యక్తులకు తాకట్టు పెడుతున్న చంద్రబాబు
- యువత పోరాటాలకు సిద్ధం కావాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం మాటలు చెప్పడం తప్పితే సమస్యను పరిష్కరించడంలో విఫలం అయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి అధ్వర్యంలో బుధవారం విజయవాడలోని హనుమంతురాయ గ్రంథాలయంలో సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మజ్జాడ యుగంధర్ అధ్యక్షతన నిరుద్యోగ ఆవేదన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరయిన రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించారని, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులపై శ్వేత పత్రం విడుదల చేసి వాస్తవాలను వెల్లడించాలని అన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యపై చర్చించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వినాశకర విధానాలతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారని, ప్రైవేటీకరణ జపం చేస్తున్నారని మండిపడ్డారు. విద్యా రంగాన్ని, విశ్వవిద్యాలయాలను భ్రష్టు పట్టించారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల్లో ప్రకటించినట్లుగా నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని సభలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. 2 లక్షల 60 వేల మంది వలంటీర్లను తీసేశారని... పవన్ కల్యాణ్ నోటికి తాళం వేసుకున్నారని విమర్శించారు. రేషన్ వాహనాలలో పనిచేసే యువతను, ఏపీ బేవరేజెస్‌లో 16 వేల మంది యువతను ఉద్యోగాల నుంచి తప్పించారని తెలిపారు. 54 వేల టీచర్ పోస్టులు ఖాళీ ఉంటే కేవలం 16,000 పోస్టులకు డీఎస్సీ నిర్వహించారన్నారు. అందులోనూ అనేక అనుమానాలకు తావిస్తూ ఫలితాలు విడుదల చేయలేదని తెలిపారు. స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 2,260 పోస్టులు, లైబ్రేరియన్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేసే ఆలోచనే ప్రభుత్వానికి లేకపోవడంపై రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాలలో 3,480 ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వం విద్యా వ్యవస్థను ప్రైవేటీకరణ చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం అధికారికంగా ఫిబ్రవరిలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా 'స్కిల్ సెన్సెక్స్ సర్వే' 26 జిల్లాల్లో 2.67 కోట్ల మంది దగ్గర వివరాలను సేకరించగా ఉపాధి లేని వారి సంఖ్య కోటిన్నర పైనే ఉందని అన్నారు. అయితే రాష్ట్రంలో 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు వారిలో ఏ ఉపాధి లేని వారు ఒక కోటి 56 లక్షల మంది ఉన్నారని ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయని... వీరిలో 52.69 లక్షల మంది ఏదో ఒక పని చేస్తున్నట్లు తెలపగా, 52.74 లక్షల మంది ఏ పనైనా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారని రామకృష్ణ వివరించారు.

ప్రముఖ రాజకీయ విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా మారిందని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించి పాలకులు దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. రిజర్వేషన్లు అవసరం లేదన్న ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని, ఆ తాత్విక చింతనను మోదీ ప్రభుత్వం దూకుడుగా అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో స్థూల ఆదాయం పెరగడానికి హంద్రి-నీవా, కియా ప్రాజెక్టు అని చెప్పడానికి ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిగ్గు ఉండాలని, విశాఖ ఉక్కు పరిశ్రమపై జరుగుతున్న వ్యవహారంపై ఆయన ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. దావోస్ పర్యటనతో రూ.10 లక్షల పెట్టుబడులు, సంవత్సరంన్నరలో 8 లక్షలు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో నిజమెంతో ప్రజలకు గుణాంకాలతో తెలియజేయాలని డిమాండ్ చేశారు.

ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చదువు పూర్తయిన దాదాపు 1.80 కోట్ల మంది నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో సుమారు 3.20 లక్షల ఖాళీలు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నారని, అయితే ఖాళీ పోస్టులపై శ్వేతపత్రం విడుదల చేసే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం లేదన్నారు. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ల కోసం యువత కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో చర్చించాలని, ఆ సమస్యపై మంత్రి వర్గ ఉప సంఘం ఏర్పాటు చేయాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని, ప్రభుత్వ విద్యాలయాలలో, విశ్వవిద్యాలయాలలో బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు పోరాడితేనే భవిత అని, రాష్ట్ర ప్రభుత్వంపై ఏఐవైఎఫ్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. తొలుత ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి నాయకులు, కళాకారులు షేక్ నజీర్ విప్లవ గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.వలరాజు, బి.నాసర్ జీ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గండాల సంతోష్ కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మందగళ్ల సాయికుమార్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు లంకా గోవిందరాజులు, వై.బాబి, కె.శ్రీనివాసులు, జి.నాగ రాముడు, కత్తి రవి, కోన శ్రీనివాస్, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

బీహార్ కోసం మీరేం చేశారో చెప్పండి

మోదీకి డి.రాజా సూటి ప్రశ్న



న్యూఢిల్లీ: బీహార్ కోసం ఏం చేశారో చెప్పాలని ప్రధాని మోదీకి సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సవాల్ విసిరారు. రాష్ట్రంలోని ఎన్డీయే పాలనలో జరిగిన పని గురించి మాట్లాడటం మానేసి ప్రతిపక్షాలపై విమర్శలతో బీజేపీ సీనియర్లు పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. మోదీ తన పర్యటనలో భాగంగా ఆర్‌జేడీ, కాంగ్రెస్‌ను విమర్శించడాన్ని రాజా ఖండించారు. అభివృద్ధి పనులపై ప్రగతి నివేదికను మోదీ ఇవ్వలేదన్నారు. బీహార్‌లో ఎస్ఐఆర్ గురించి ఒక్క మాటైనా మాట్లాడలేదని దుయ్యబట్టారు. ఓటు హక్కు సమస్యగా మారిన బీహార్ రాష్ట్ర పరిస్థితిపై ప్రధాని వైఖరి ఏమిటి? బీహార్ కోసం ఆయన ప్రభుత్వం చేసినదేమిటి? అంటూ రాజా ప్రశ్నించారు. ప్రభుత్వాధినేతగా, ప్రధానమంత్రిగా హుందాగా వ్యవహరించాలని మోదీకి హితవు పలికారు. అసంబద్ధ ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు. ప్రధాని స్థానంలో ఉన్న వ్యక్తి ఇలా ప్రవర్తించరాదని సమస్యలపై మాట్లాడాలని రాజా హితవు పలికారు.

శాంతి చర్చలకు సిద్ధం

కాల్పులు విరమించండి: కేంద్రానికి మావోయిస్టుల లేఖ

నాగపూర్/గడ్చిరోలి: శాంతి చర్చలకు రావాలంటూ మావోయిస్టులు మరోసారి పిలుపునిచ్చారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. మూడు నెలల కిందట కూడా శాంతి చర్చలు, కాల్పుల విరమణ కోరుతూ కరపత్రాన్ని విడుదల చేశారు కానీ కేంద్రం స్పందించలేదు. ఆగస్టు 15న సాయుధ ఘర్షణకు నెల రోజుల విరామం ప్రకటించాలని కోరుతూ ఒక లేఖను కామ్రేడ్ అభయ్ పేరిట జారీ చేశారు. దానిపైనా కేంద్రం స్పందించలేదు. ఈమేరకు మావోయిస్టుల అధికార ప్రతినిధి భూపతి అలియాస్ సోను అలియాస్ అభయ్ వెల్లడించారు. కేంద్రం శాంతి చర్చల కోసం ముందుకు రావాలని మళ్లీ కోరుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నామన్నారు. 'శాంతి పథంలో ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం. హింసను ఆపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం' అని ఆ లేఖలో అభయ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం... మావోయిస్టుల కోరిన నెల గడువు ముగియడంతో శాంతి చర్చలు, కాల్పుల విరమణ కోసం మళ్లీ పిలుపునిస్తూ ప్రకటన విడుదలైంది. మావోయిస్టులు ప్రజా ఉద్యమాల్లో పాల్గొనాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొంది. మే 21న ఛత్తీస్‌గఢ్‌లోని గుండెకోట్ సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి బసవరాజ్ ఆశయాల ప్రకారం శాంతి చర్చలకు సిద్ధమైనట్లు తెలిపింది. కేంద్ర హోం మంత్రి లేదా ప్రతినిధి బృందంతో చర్చలకు సిద్ధమని, తమ సహచరులతో ఒక ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేస్తామని అభయ్ ప్రకటన పేర్కొంది. వివిధ రాష్ట్రాల్లో పని చేస్తున్న సహచరులు, జైళ్లలో ఉన్న వారితో సంప్రదించేందుకు నెల రోజులు కావాలని కోరింది. కాల్పుల విరమణ ప్రకటించి శాంతి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ వైఖరిపై ఆధారపడి ఉంటుందని వెల్లడించింది. అయితే మావోయిస్టు చరిత్రలోనే తొలిసారిగా ప్రజలతో నేరుగా సంప్రదింపులు జరిపే దిశగా ముందడుగు వేస్తూ ఈ-మెయిల్, ఫేస్‌బుక్ ఐడీ బహిర్గతం చేశారు. ఈ ప్రకటనలో కిషన్‌జీ సోదరుడు మల్లోజుల వేణుగోపాల్ చిత్రాన్ని ముద్రించారు.

మావోయిస్టుల నిర్ణయం చారిత్రకం

కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలకు ముందుకు రావాలి

సీపీఐ కార్యదర్శి నారాయణ

విజయవాడ: శాంతి, సయోధ్య, ప్రజాస్వామ్య సంభాషణ దిశగా కీలక ముందడుగు పడిందని, మావోయిస్టులు చారిత్రక నిర్ణయం తీసుకున్నారని సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరపాలని, ఆయుధాలు విడిచిపెట్టి శాంతి పథంలో పయనించాలన్న నిర్ణయాన్ని సీపీఐ స్వాగతిస్తోందని తెలిపారు. నారాయణ బుధవారం విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ మావోయిస్టులు శాంతి మార్గాన్ని ఎంచుకోవడాన్ని సీపీఐ హృదయపూర్వకంగా స్వాగతిస్తుందన్నారు. ఇది శాంతి, సయోధ్య, ప్రజాస్వామ్య సంభాషణ దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా అభివర్ణించారు. సాయుధ పోరాటాన్ని వీడి ప్రజాస్వామ్య పద్ధతుల్లో సమస్యలను పరిష్కరించుకోవాలనే మావోయిస్టులు నిజమైన సంకల్పాన్ని తాజా నిర్ణయం ప్రతిబింబిస్తున్నదని నారాయణ తెలిపారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సానుకూలంగా స్పందించి, శాంతి చర్చలకు ముందుకు రావాలని కోరారు. చర్చలకు అనుకూలమైన వాతావరణం సృష్టించి, విశ్వాసాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని, అణచివేతతో సమస్యలు పరిష్కారం కాబోవని సూచించారు. శాశ్వత పరిష్కారం కావాలంటే సంభాషణ, ప్రజల ఆవేదనల గుర్తింపు, ప్రజాస్వామ్య భాగస్వామ్యం అవసరమని హితవు పలికారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వం వినియోగించుకొని, రాజకీయ పరిపక్వతను ప్రదర్శించాలన్నారు. అర్థవంతమైన చర్చలు త్వరగా ప్రారంభించాలని కోరారు. తద్వారా హింస తగ్గడమే కాకుండా ప్రజాస్వామ్యం, అణగారిన వర్గాలకు న్యాయానికి బలం చేకూరుతుందని నారాయణ నొక్కిచెప్పారు.

ఎస్‌బీఐలో బంగారం, నగదు లూటీ

బెంగళూరు: కర్నాటకలోని విజయపుర జిల్లా చడ్చనా ఎస్‌బీఐ శాఖలో భారీ దోపిడీ జరిగింది. ముసుగులు ధరించిన దుండగులు బ్యాంక్‌లోకి చొరబడి తుపాకులు, ఇతర ఆయుధాలతో సిబ్బందిని బెదిరించి రూ.21కోట్ల విలువైన బంగారం, నగదును దోచుకున్నారు. ఉద్యోగులను బంధించి యథేచ్ఛగా దోపిడీకి పాల్పడి పరారయ్యారు. నిందితులు వాడిన కారు పంధర్‌పూర్ ప్రాంతానికి చెందినదిగా పోలీసులు గుర్తించారు. దొంగలు మిలిటరీ యూనిఫామ్‌ను పోలిన దుస్తులు ధరించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. దోపిడీ సమయంలో బ్యాంక్ మేనేజర్ అలారమ్ బెల్‌ను నొక్కకుండా వారు ఆయుధాలతో బెదిరించినట్లు తెలిసింది. ఇప్పటికే డాగ్‌స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణులు ఆ ప్రాంతానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కేసును ఎస్పీ లక్ష్మణ్ నింబార్గి పర్యవేక్షిస్తున్నారు. బ్యాంక్ మూసివేసే సమయంలో మంగళవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. సిబ్బందిని బెదిరించి స్ట్రాంగ్‌రూమ్‌లోని సొమ్మును దోచుకున్నట్లు గుర్తించారు. ఓ ఖాతాదారుడు అదే సమయంలో బ్యాంకులోకి వెళ్లి పరిస్థితి గమనించి... పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. దొంగలు మహారాష్ట్రకు పారిపోయి ఉంటారని ఎస్పీ అనుమానం వ్యక్తం చేశారు. ముగ్గురికిపైగా దోపిడీలో పాల్గొనట్లు భావిస్తున్నారు. దొంగల కోసం కర్నాటక, మహారాష్ట్రలో భారీగా గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపు రూ.20 కోట్ల విలువైన 20 కేజీల బంగారు నగలు, రూ.కోటి నగదును దుండగులు దోచుకెళ్లినట్లు పోలీసులు తమ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

సీజేఐ వ్యాఖ్యలపై దుమారం

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్, ఖజురహోలోని విష్ణు విగ్రహానికి సంబంధించిన పిటిషన్‌పై విచారణ సమయంలో సీజేఐ బీఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఖజురహోలోని ఏడు అడుగుల ఎత్తైన పురాతన విష్ణువు విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సీజేఐ గవాయ్ నేతృత్వ ధర్మాసనం కొట్టివేసింది. 'మీరు మిమ్మల్ని విష్ణువు ఆరాధకుడిగా పిలుచుకుంటే, కొంచెం ప్రార్థన చేసి ధ్యానం చేయండి. వెళ్లి భగవంతుడినే దీనిపై చర్యలు తీసుకోమని అడగండి. ఖజురహో ఒక పురావస్తు ప్రదేశం, ఇది భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) కిందకు వస్తుందని, వారి అనుమతి లేకుండా ఎలాంటి మార్పు సాధ్యం కాదు. క్షమించండి' అని విచారణ సందర్భంగా సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై సీజేఐకు ఒక న్యాయవాది బహిరంగ లేఖ రాశారు. సీజేఐ వ్యాఖ్యల్ని పున: పరిశీలించాలి లేదా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మతపరమైన మనోభావాలను సీజేఐ వ్యాఖ్యలు దెబ్బతీస్తున్నాయని తన లేఖలో న్యాయవాది సత్యం సింగ్ రాజ్‌పుత్ పేర్కొన్నారు. వినీత్ జిందాల్ అనే మరో న్యాయవాది కూడా స్పందించారు. ఇదే అంశంపై రాష్ట్రపతి ముర్ముకు లేఖ రాశారు.

ఆచార్య ఎస్వీ రామారావు కన్నుమూత

అరసం నివాళి

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలుగు సాహిత్య విమర్శకులు, అధ్యయనకర్త, ఆచార్య ఎస్వీ రామారావు (85) బుధవారం కన్నుమూశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో తుది శ్వాస విడిచారు. 14ఏట నుంచి రచనలు చేస్తూ ఏడు దశాబ్దాల సాహిత్య జీవితం గడిపారు. ఆయన మృతి సాహిత్య లోకానికి తీరని లోటని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) సంతాపం ప్రకటించింది. ఆచార్య ఎస్వీ రామారావుకు నివాళులర్పించింది. తెలుగులో వచ్చిన, వస్తున్న సాహిత్య విమర్శలను విశ్వవిద్యాలయ స్థాయిలో చారిత్రక దృష్టితో అధ్యయనం చేయడానికి దారులు వేసినవారు ఎస్వీ రామారావు అని కొనియాడింది. ఎస్వీ రామారావు 1941 జూన్ 5న ఇప్పటి వనపర్తి జిల్లా, శ్రీరంగాపురంలో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యునిగా పని చేశారు. తెలుగు సాహిత్య చరిత్రను అనేక కొలమానాలతో రచించారు. 'మా ఊరి కవులు, పాలమూరు జిల్లా సాహిత్య వైశిష్ట్యం, పాలమూరు ఆధునిక కవుల చరిత్ర, తెలుగు సాహిత్య వైశిష్ట్యం, తెలంగాణ సాహిత్య చరిత్ర, సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర, తెలంగాణ సాంస్కృతిక వైశిష్ట్యం, సమగ్ర తెలంగాణ వాఙ్మయకోశం, విమర్శక వతంసులు, అన్వీక్షణం, సమవీక్షణం, అభివీక్షణం, మనోవీక్షణం, తెలుగు సాహిత్య విమర్శ-అవతరణవికాసములు, తెలంగాణ సినిమా-బంగారు కాంతులు' వంటి గ్రంథాలు రచించారు. ఆచార్య రాచపాళెం, ఆచార్య బన్న అయిలయ్యలతోపాటు కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడిగా పనిచేశారు.

ప్రజలపై భారం తగ్గించడమే జీఎస్టీ సంస్కరణల లక్ష్యం

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

విశాలాంధ్ర-పీఎం పాలెం (విశాఖ): దేశంలో అన్ని వర్గాల ప్రజల పై భారం తగ్గించేలా, అందరికీ ఆమోదయోగ్యరీతిలో జీఎస్టీ సంస్కరణలు చేపట్టినట్లు కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఈ సంస్కరణలు వికసిత్ భారత్ కు పునాదులు వేస్తాయని తెలిపారు. విశాఖ మధురవాడ వీ కన్వెన్షన్స్ లో బుధవారం జరిగిన జీఎస్టీ అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. తొలుత పలు వాణిజ్య సంస్థల ప్రతినిధుల సందేహాలకు, ప్రశ్నలకు ఆమె సమాధానాలు ఇచ్చారు. అనంతరం జీఎస్టీ పై గత స్లాబ్ లు ప్రస్తుత స్లాబ్ లు, ఏయే వస్తువుల పై ఎంతెంత పన్ను తగ్గించారు, పన్ను నుండి పూర్తిగా మినహాయింపు పొందిన వస్తువులు తదితర అంశాల పై సమగ్రంగా 'పవర్ పాయింట్' ద్వారా పై వివరించారు. గతం లో 5,12,18,28 శాతంగా ఉండే పన్నులు ప్రస్తుతం 5, 18 శాతంతో అమలులోకి వస్తున్నాయని తెలిపారు. ఈ నెల 22 నుండి కొత్త జీఎస్టీ అమల్లోకి వస్తుందని, 12 శాతం జీఎస్టీ ఉండే వస్తువులు 99 శాతం వరకు 5 శాతం జీఎస్టీలోకి వెళ్లాయని, అలాగే 28 శాతం ఉన్న వస్తువులు 90 శాతం వరకు 18 శాతం పన్ను లోకి వెళ్లాయని, దీని వలన పేద, మధ్య తరగతి వారి ఖర్చు తగ్గి, వారి కొనుగోలు శక్తి పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రధానంగా వైద్య, ఆరోగ్య సంబంధ వస్తువులు, మందుల పై ఎటువంటి జీఎస్టీ లేదని తెలిపారు. వ్యవసాయ ఉపకరణాలు, ఎం.ఎస్.ఎం.ఈ తదితర రంగాల పై జీఎస్టీని తగ్గించడం జరిగిందన్నారు. జీఎస్టీ నుండి దేశానికి వచ్చే ఆదాయాన్ని తిరిగి ప్రజలకే అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపం లో అందించడం జరుగుతోందన్నారు. జాతీయ రహదారులు, ఎయిర్‌పోర్ట్‌లు, పోర్ట్‌ల్లో మౌలిక వసతుల కల్పనకు ఈ పన్నులు ఉపయోగ పడతాయన్నారు. వినియోగదారులు, వాణిజ్య వేత్తలు, తయారీ దారులు, ఎగుమతిదారులు, ప్రభుత్వం కూడా లబ్ధి పొందడమే సంస్కరణల ప్రధాన లక్ష్యమని అన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలు అకస్మాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదని, అంతకు ముందు కౌన్సిల్ సమావేశం లో అన్ని రాష్ట్రాల సమక్షం లో మేధో మథనం చేశాక, ప్రజల కోసం, దేశం కోసం తీసుకున్న గొప్ప నిర్ణయమని అన్నారు. రాష్ట్ర వైద్యారోగ్య మంత్రి వై.సత్యకుమార్ మాట్లాడుతూ క్లిష్ట పరిస్థితుల్లో ఆర్థికశాఖను సమర్థంగా నిర్వహించిన మంత్రి నిర్మలా సీతారామన్ తీసుకొచ్చిన సంస్కరణలు పేదలకు మేలు చేసేవిగానే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు, రాష్ట్ర అధ్యక్షులు పీవీఎస్ మాధవ్, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పరశురామ్, జీఎస్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, బీఎన్ఐ, టెక్స్‌టైల్స్, పాప్సి, హెూటల్స్, స్టీల్, క్రెడాయ్, టాక్స్ పేయర్స్ తదితర వాణిజ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యలో చైనా, భారత్ భాగస్వామ్యం

అనంత సెంట్రల్ వర్సిటీ సందర్శనలో చైనా ప్రతినిధులు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: ఉన్నత విద్యలో చైనా, భారత్ పరస్పర భాగస్వామ్యంతో ముందుకెళ్లాలని చైనా రాయబార కార్యాలయం ప్రతినిధుల బృందం ఆకాంక్షించింది. అనంతపురం సమీపంలోని జంతలూరు గ్రామం దగ్గర సెంట్రల్ యూనివర్సిటీని కౌన్సిలర్ యాంగ్ షీయుహువా నేతృత్వ బృందంలో జాంగ్ హైలిన్ (ఫస్ట్ సెక్రటరీ), మిస్సు సూ చెన్ (సెకండరీ సెక్రటరీ), ఫాంగ్ బిన్ (థర్డ్ సెక్రటరీ) బుధవారం సందర్శించారు. యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎస్ఏ కోరీని కలశారు. విద్యలో పరస్పర సహకారంపై, విద్యార్థులు, అధ్యాపకుల వినిమయం, శిక్షణ, పరస్పర సహకారంతో కోర్సుల నిర్వహణ వంటి అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. చైనా భాషలో డిగ్రీ, డిప్లోమా ప్రోగ్రాములు ప్రారంభించటం, అతిథి అధ్యాపకులు రావడంపై చర్చించారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులతో చైనా ప్రతినిధులు మాట్లాడారు. చైనా-భారత్ మధ్య సాంస్కృతిక సారూప్యతలు, అక్కడి విద్యావ్యవస్థ, చైనా ప్రభుత్వ ఉపకార వేతన పథకం గురించి వివరించారు. చైనాలో ఉన్నత విద్య, పరిశోధన, ఉద్యోగ అవకాశాలను తెలియజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్, అంతర్జాతీయ సంబంధాల కార్యాలయ సమన్వయకర్త డా.బాబు గోపాల్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ ఉగ్రదాడుల వెనక మసూద్

జైషే కమాండర్ ఇలియాస్

న్యూఢిల్లీ: పార్లమెంట్‌పై ఆత్మాహుతి దాడి, 26/11 ముంబై మారణకాండ వెనుక జైషే అధినేత మసూద్ అజార్ హస్తమున్నట్లు ఆ సంస్థ టాప్ కమాండర్ అంగీకరించాడు. దీనికి సంబంధించిన వీడియో ఒకటి వైరలైంది. మసూద్ ఇలియాస్ కశ్మీరి ఓ సభలో మాట్లాడుతూ 'అమీర్ ఉల్ ముజాహిద్దీన్ మౌలానా మసూద్ అజార్ భారత్ జైలు నుంచి బయటపడి పాకిస్థాన్ వచ్చాక బాలాకోట్‌లో ఆశ్రయం లభించిందన్నాడు. ఇలియాస్ చెప్పినదాని ప్రకారం మసూద్ అజార్ బాలాకోట్‌ను అడ్డాగా చేసుకొని ఎప్పటి నుంచో భారత్‌పై ఉగ్ర కుట్రలు పన్నుతున్నట్లు తేలింది. ఒసామా బిన్ లాడెన్‌ను ఇలియాస్ అమరవీరుడిగా పోల్చాడు. పాక్ సైన్యం పహారాలో జైషే స్థావరం స్వేచ్ఛగా నడుస్తోందని భారత్ ఎప్పటినుంచో ఆరోపిస్తోంది. పాక్ మాత్రం ఉగ్ర క్యాంపులు లేవని చెబుతోంది. 'ఆపరేషన్ సిందూర్'తో మౌలానా మసూద్ అజార్ కుటుంబీకులు ముక్కలైపోయారని ఇలియాస్ చేసిన ప్రకటన సంచలనంగా మారింది. 'మేం ఢిల్లీతో పోరాడాం. కాబూల్‌తో పోరాడాం. కాందహార్‌తో పోరాడాం. అన్నింటినీ త్యాగం చేశాం. మే 7న బహావల్‌పూర్‌పై భారత్ దాడిలో మసూద్ అజార్ కుటుంబ సభ్యులు, వారి పిల్లలు ముక్కలైపోయారు' అని ఇలియాస్ పేర్కొన్నాడు.

విజయవాడలో లౌకిక సంఘాల నిరసన

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించతలపెట్టడం రాజ్యాంగ ఉల్లంఘనగా లౌకిక, హేతువాద సంఘాల నేతలు పేర్కొన్నారు. రానున్న నవంబర్ ఆఖరులో పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడాన్ని తప్పుబడుతూ సంగమం సంస్థ ఆధ్వర్యంలో వివిధ లౌకిక, హేతువాద సంఘాల నేతలు బుధవారం విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద నిరసన ప్రదర్శన



నిర్వహించారు. ఒక వివాదాస్పద వ్యక్తిని ప్రభుత్వమే భగవంతుని అవతారంగా గుర్తించి కార్యక్రమాలు నిర్వహించడం సెక్యులర్ విలువలకు విరుద్ధమని వారు అన్నారు. సత్యసాయి బాబా జీవితకాలంలోనే అనేక ఆరోపణలు, వివాదాలు ఉన్నాయని, 1993లో ప్రశాంతి నిలయంలో ఆరుగురు యువకుల హత్యలు జరగడం ప్రజలు మరచిపోలేదని గుర్తుచేశారు. ఈ నిరసనలో కందుకూరి తాజారావు (సంగమం), నార్నె వెంకటసుబ్బయ్య (హేతువాద సంఘం), దివి కుమార్ (జన సాహితి), జంజనం సత్యనారాయణ (చార్వాకాశ్రమం), కోడూరు సత్యరంజన్ (సాహితీ స్రవంతి), జివి రంగారెడ్డి (సీనియర్ జర్నలిస్ట్)తో పాటు జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

అమరావతి శిల్ప సంపదపై కేంద్రమంత్రికి జాస్తి విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: అమరావతి ప్రాచీన శిల్ప సంపదను దేశ విదేశాల నుండి తిరిగి తెప్పించి అమరావతిలో ప్రదర్శనకు ఉంచాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు ఆయన ఢిల్లీలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన వివిధ సమస్యలను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా అమరావతి సర్కిల్‌లో కేంద్ర పురావస్తు శాఖ పరిధిలో 15 నుంచి 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న క్యాజువల్ కార్మికుల సమస్యను ప్రస్తావించారు. వారిని తొలగించి జెమ్ ద్వారా టెండర్ విధానంలో కొత్త నియామకాలకు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఈ అంశంపై సమగ్రంగా పరిశీలించి, త్వరలో నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.